ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
శనివారం 25, అక్టోబరు 2025


ఉప్పుగుండూరు, మాచవరం గ్రామాల మధ్య పొలాల్లో నిలిచిన వర్షపు నీరు


గుండ్లకమ్మ గేట్లు ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న నీరు

అతలాకుతలం

గండం తప్పినా కొనసాగిన వాన

- నాలుగు రోజుల్లో 112.0 మి.మీ సగటు వర్షపాతం
- పలు మండలాల్లో అంతకు మించి నాలుగు రెట్లు
- అల్పపీడన ప్రభావంతో దంచికొట్టిన వాన
- పొంగిన వాగులు, వంకలు.. రవాణాకు ఆటంకం
- పల్లెలు, పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం
- గుండ్లకమ్మకు పెరిగిన వరద, నాలుగు గేట్లు ఎత్తివేత

జిల్లాకు వాయు'గండం' తప్పినా తెరపి లేకుండా నాలుగు రోజులపాటు కురిసిన వర్షాలు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. ఇంచుమించు అన్ని ప్రాంతాల్లోనూ వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. అనేక చోట్ల చెరువులు నిండి అలుగులు పారాయి. వర్షపు నీటి ఉధృతితో వాగులు దాటేందుకు వీలు లేక అనేక రోడ్డు మార్గాలలో రవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. కొన్నిచోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. అటు పల్లెలు, ఇటు పట్టణాల్లోని లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. అదే సమయంలో వేలాది ఎకరాల్లోని ఖరీఫ్ పంటలు నీట మునిగాయి. దీంతో నష్టం అధికంగానే ఉండే అవకాశం కనిపిస్తోంది.


కంభం మండలం ఎర్రబాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ (ఇన్‌సెట్‌లో) ఒంగోలులోని ధారావారితోటలో ఓ ఇంట్లోకి చేరిన వర్షపు నీటిని బకెట్‌తో బయటకు పోస్తున్న మహిళ

స్నేహితులను కాపాడి.. డైట్ విద్యార్థి గల్లంతు! | యర్రగుడిపాడు జంక్షన్ వద్ద ముదిగొండిలో జారిపడిన వైనం 7


గలిజేరుగుళ్ల చెరువు కట్టకు పడిన గండి నుంచి బయటకు వస్తున్న నీరు


కుంగిన కొణిజేడు- మర్లపాడు ఆర్అండ్‌బీ రోడ్డు

ఒంగోలు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. నాలుగు రోజుల్లో 112.0 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అనేక మండలాల్లో అంతకు నాలుగు రెట్లు కురిసింది. జిల్లాలో ఈ నెలలో సాధారణంగా వర్షాలు అధికంగానే ఉంటాయి. వార్షిక వర్షపాతం 679.80 మి.మీ కాగా అత్యధికంగా ఈనెలలోనే సుమారు 207మి.మీ కురుస్తుంది. అందులో ఈ సమయానికి 175 మి.మీ కురవాలి. అయితే ఈనెలలో 206 మి.మీ కురిసింది. అందులో ఈ నాలుగు రోజుల్లోనే దాదాపు 112.0 మి.మీ పడింది. అంటే ఈ నాలుగు రోజులకు ముందే జిల్లాలో 145 మి.మీ వర్షపాతం నమోదు కావడంతో అత్యధిక ప్రాంతాల్లో భూములు బాగా నెమ్ముతో ఉన్నాయి. అలాగే వాగులు, వంకల్లో ప్రవాహాలు, చెరువుల్లోకి పుష్కలంగా నీరు చేరి ఉంది. ఇక చుక్కపడినా బయటకు పెట్టాల్సిన పరిస్థితి ఉన్న ఈ సమ యంలో వరుసగా నాలుగు రోజులు తెరపిలేకుండా భారీగా వర్షం కురవడంతో నీటి వన రులు పొంగి ప్రవహిస్తున్నాయి.

నిండిన గుండ్లకమ్మ.. దిగువకు నీరు

జిల్లాలోని మైదాన ప్రాంతాలతోపాటు నల్లమల అటవీ ప్రాంతంలో కూడా విస్తారంగా వర్షం పడటంతో గుండ్లకమ్మకు భారీగా నీరు వస్తోంది. మార్కాపురం, కంభం ప్రాంతాలలో గుండ్లకమ్మ పొంగి రాకపోకలు నిలిచిపోయాయి. దిగువన ఉన్న గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టు నీటిమట్టం 24.38 మీటర్లు కాగా నీటి నిల్వ సామర్థ్యం 3.859 టీఎంసీలు. ప్రస్తుతం 23.9 మీటర్ల మేర నీటిమట్టం, 3.30 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ సమయంలో ఎగువ నుంచి 9 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా నాలుగు గేట్లు ఎత్తి 9,500 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. రామతీర్థం ప్రాజెక్టు కూడా పూర్తిస్థాయిలో నిండి ఉంది. ఎగువన పశ్చిమ ప్రాంతమైన గిద్దలూరులోని సగిలేరుకు భారీగా వరద నీరు వస్తూ ఉధృతంగా ప్రవహిస్తోంది. కంభం మండలంలోని నల్లవాగు, రావిపాడు సమీపంలో, అలాగే ఎర్రబాలెం వద్ద గుండ్లకమ్మ పొంగి అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దోర్నాల, పెద్దారవీడు, మార్కాపురం తదితర మండలాల్లోని పలు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. రాచర్ల మండలంలోని పగిడివాగు, కొమరోలు మండలంలోని బాదినేనిపల్లి వాగు, సూరావారిపల్లి వాగులు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సీఎస్‌పురం మండలంలోని భైరవకోన జలపాతానికి భారీగా నీరు వస్తోంది. మోపాడు రిజర్వాయర్, కంభం చెరువులకు భారీగానే నీరు

మిగతా 6వ పేజీలో

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

నాగులుప్పలపాడు మండలంలోని కొత్తకోట వాగు, సంతనూతలపాడు-కొండపి మార్గంలో ఉన్న ముసినది, ఇనగలేరు, అట్లేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఒంగోలు నుంచి సంతనూతలపాడు మీదుగా కొండపి, కామేపల్లి వెళ్లే మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. నాగులుప్పలపాడు మండలం చదలవాడ, టీపేట మండలం గలిజేరుగుళ్ల, దోర్నాల మండలం కడపరాజుపల్లె చెరువులు తెగడం, అలుగులు పారడంతో దిగువ పొలాల్లోకి భారీగా నీరు చేరింది. మరోవైపు తెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో పల్లె, పట్టణం అలాగే చిన్నపెద్ద తేడా లేకుండా అనేక రోడ్లు ఛిద్రమయ్యాయి. భారీ వాహనాలు కాదు కదా కనీసం చిన్న వాహనాలు చివరకు కొన్నిచోట్ల నడకకు కూడా వీలుకాని పరిస్థితి కనిపిస్తోంది.



ఆమెకు అనారోగ్యం..!

40శాతం మంది మహిళలకు ఆరోగ్య సమస్యలు

- స్వస్థ్‌నారీ వైద్యశిబిరాల్లో వెలుగులోకి వ్యాధులు
- కేన్సర్, బీపీ, షుగర్ సమస్యలే అధికం

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక ప్రపంచంలో మహిళలు తమ కుటుంబాల కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. ఈక్రమంలో తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడంతో అనేక సమస్యల్లో చిక్కుకుంటున్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం, ఆ సమాజం ఆరోగ్యంగా ఉంటాయన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు స్వస్థ్‌నారీ సశక్తి పరివార్ అభియాన్ అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టాయి. అందులో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజు సందర్భంగా గతనెల 17వ తేదీ నుంచి ఈనెల 2 వరకు ప్రభుత్వ వైద్యశాలలో 'స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్' శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రతి మహిళకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేశారు. 40 శాతం మంది మహిళలు కేన్సర్, రక్తపోటు, మధుమేహం రుగ్మతలతో ఉన్నట్లు గుర్తించారు.

634 క్యాంపులు.. 2,46,800 స్ర్కీనింగ్ పరీక్షలు

జిల్లాలో 634 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి 2,46,800 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 4,800 మందికి ఏఎంసీ పరీక్షలు, 2,800 ఇమ్యునైజేషన్ సేవలు, 45 వేల మందికి హెచ్‌బీ, 70వేల మందికి హైపర్ టెన్షన్, షుగర్, 32వేల మందికి కేన్సర్

మిగతా 6వ పేజీలో

భద్రత డొల్ల!

ప్రైవేటు ట్రావెల్స్ ఇష్టారాజ్యం

- ప్రాణాంతకంగా మారుతున్న ప్రయాణం
- తూతూమంత్రంగా రవాణా శాఖ తనిఖీలు

ఒంగోలు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు ట్రావెల్స్ వ్యవహారం ఇష్టారాజ్యంగా మారింది. భద్రతా ప్రమాణాలు పాటించడం లేదు. నిబంధనలను తుంగలో తొక్కి, కాంట్రాక్ట్ క్యారియర్లను స్టేజ్ క్యారియర్లుగా మార్చి నడుపుతున్నారు. అదేసమయంలో బస్సుల్లో కనీస సౌకర్యాలు లేకుండా ఇష్టానుసారంగా టికెట్ల ధర పెంచి ప్రయాణికుల జేబులు ఖాళీ చేస్తున్నారు. నైపుణ్యం లేని డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ

మిగతా 6వ పేజీలో


కర్నూలులో ప్రమాదానికి గురైన ట్రావెల్స్ బస్సు

ఒంగోలు బస్సు... ఒడిశా రిజిస్ట్రేషన్!

- డయ్యూడామన్ నంబరుతో చలామణి
- కర్నూలులో ప్రమాదం
- 12 మంది ప్రాణాలను కాపాడిన కనిగిరి డ్రైవర్..!

వివరాలు మెయిన్‌లో..


రవిశంకర్

కనిగిరి తహసీల్దార్ రవిశంకర్ సస్పెన్షన్

అడ్‌హక్ ఉద్యోగోన్నతిపై జయలక్ష్మి నియామకం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కనిగిరి తహసీల్దార్ రవిశంకర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ రాజాబాబు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రవిశంకర్ అడ్డగోలుగా అసైన్‌మెంట్ భూములను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఒంగోలు ఆర్డీవో విచారణ చేసి అక్రమాలు జరిగినట్లు గుర్తించి నివేదికను ఇచ్చారు. దీంతో తహసీల్దార్ రవిశంకర్‌పై కలెక్టర్ వేటు వేశారు. కనిగిరి తహసీల్దార్‌గా చీమకుర్తి ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న జయలక్ష్మిని అడ్‌హక్ ఉద్యోగోన్నతిపై నియమించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- పంచాయతీల్లో తాగునీరు కలుషితం కాకుండా చర్యలకు ఆదేశం
- కలెక్టర్ సూచనలతో అధికారుల అప్రమత్తం



ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాలు కురుస్తుండటంతో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యంపై అధికారులను అప్రమత్తం చేశారు. కలెక్టర్ రాజాబాబు ఆదేశాలతో డీపీవో వెంకటేశ్వరరావు పంచాయతీ కార్యదర్శులు చేపట్టాల్సిన విధివిధానాలపై సర్క్యులర్‌ను జారీచేశారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు బ్లీచింగ్ వంటివి చల్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు ఉంటే తగిన చర్యలు తీసుకోవడంతోపాటు సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలను అక్కడికి తరలించాలన్నారు. అన్ని శాఖల ఉద్యోగులు, సిబ్బందిని సమన్వయం చేసుకొని పనిచేసే విధంగా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా వ్యాధులు ప్రబలితే వెంటనే బాధితులను ఆ పరిధిలోని పీహెచ్‌సీలకు, సీహెచ్‌సీలకు తరలించాలన్నారు. బ్లీచింగ్, సున్నం అందుబాటులో ఉంచుకొని వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని ఆ సర్క్యులర్‌లో ఆదేశించారు. వరద ప్రాంతాల్లో తాగునీటి సరఫరా కోసం అందుబాటులో ఉన్న ట్యాంకర్లను గుర్తించి నీటిని అందించడంతోపాటు భారీ వర్షాలకు రోడ్లు, డ్రెయిన్‌లు, నీటి పారుదల నిర్మాణాలు దెబ్బతింటే యుద్ధప్రాతిపదికన ఆయా పనులు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. పంచాయతీ కార్యదర్శి నిత్యం అందుబాటులో ఉంటూ సచివాలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులను సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయ పనులు చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, డీడీవోలు, డీఎల్‌పీవోలు తమ పరిధిలోని గ్రామ పంచాయతీల్లో కలెక్టర్ జారీ చేసిన సూచనలకు అనుగుణంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరా సక్రమంగా నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.



పుట్టలోని నాగయ్యా లేచి రావయ్యా!

- నేడు నాగుల చవితి పండుగ
- సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు

7

స్థానిక సంస్థలు బలోపేతం

- ఆ దిశగా ప్రభుత్వం అడుగులు
- వచ్చేనెల 1 నుంచి డీడీవో కార్యాలయాల ప్రారంభానికి సన్నాహాలు
- పంచాయతీల క్లస్టర్ విధానం రద్దు



ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందుకు అవసరమైన చర్యలు తీసుకొంటోంది. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ పంచాయతీల అభివృద్ధిపై దృష్టిపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలు క్లస్టర్ విధానంలో పనిచేస్తుండగా దానిని రద్దు చేసి స్వతంత్ర యూనిట్లుగా ఏర్పాటు చేయడం ద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని నిర్ణయించింది. అందులో భాగంగా ప్రాంతీయ అభివృద్ధి అధికారి (డీడీవో) కార్యాలయాలను ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీలను వాటి పరిధిలోకి తెచ్చే విధంగా చర్యలు చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసింది.లు నిర్వీర్యం కావడంతోపాటు పంచాయతీలకు రావాల్సిన నిధులను కూడా దారి మళ్లించింది. దీంతో జిల్లాలోని 729 గ్రామపంచాయతీలు అంధకారంలోకి వెళ్లాయి. అయితే ప్రస్తుతం ఆయా పంచాయతీల్లో మెరుగైన పాలనను అందించేందుకు

మిగతా 6వ పేజీలో

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ఒంగోలు క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి పెళ్ళూరు-వాసేపల్లిపాడు మధ్య పొలాల్లో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు శుక్రవారం ఒంగోలు తాలుకా పోలీసులు గుర్తించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 55ఏళ్ళు ఉంటుందని, లేతబూడిద రంగు ప్యాంట్, బ్లూ కలర్ కట్‌బనీయన్ ధరించి ఉన్నాడు. వివరాలు తెలిసినవారు 9121104780, 9121102127 సెల్ నంబర్లను సంప్రందిచాలని తాలుకా సీఐ విజయకృష్ణ కోరారు.

కనిగిరిలో చిట్టీల పేరుతో మోసం

మరికొంత వడ్డీలకు తీసుకుని.. రూ.8 కోట్లతో ఓ వ్యక్తి ఉడాయింపు

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు



సీఐ ఖాజావలికి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కనిగిరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణంలో కొందరు పెద్ద మనుషుల్లా చలామణి అవుతూ మోసాలకు పాల్పడుతున్నారు. ఓ సంఘం రాష్ట్ర కార్యదర్శి పదవిలో ఉన్న వ్యక్తి చిట్టీలు వేసి దాదాపు రూ.8 కోట్లతో ఉడాయించిన వైనం వెలుగుచూసింది. దీంతో బాధితులు లబోదిబో మంటూ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. మారెళ్ళ ఉమాకాంత్ పట్టణంలో దాదాపు 300 మంది రూ.2లక్షల నుంచి రూ.10లక్షల చిట్టీలు వేస్తుంటారు. విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి సోదరుడైన ఉమాకాంత్‌ను నమ్మి అందరూ మోసపోయినట్లు తెలుస్తుంది. చీటీలు వేసి మోసపోయిన వారు కొందరైతే, అప్పులిచ్చి మోసపోయినవారు మరికొందరున్నారు. ఈనెల 17 నుంచి కనపడకుండా పోవడంతో బాధితులకు అనుమానం వచ్చింది. ఉమాకాంత్ కుటుంబసభ్యుల వద్దకు బాధితులు వెళ్ళి విచారించగా సరైన సమాధానం చెప్పలేదు. తమకు సంబంధం లేదన్నట్లు మాట్లాడటంతో బాధితుల్లో ఆందోళన మొదలైంది. వారం రోజులుగా బాధితులు అతనికి ఫోన్ చేసినా అందుబాటులోకి రాలేదు. దీంతో బాధితులు సీఐ ఖాజావలిని కలసి ఫిర్యాదు చేశారు. కాగా ఉమాకాంత్ కుటుంబసభ్యులు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అతను కనిపించకుండా వెళ్ళిపోయాడని ఫిర్యాదు చేయటం గమనార్హం.

వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

● గర్భిణులు, వృద్ధులు, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు కోరారు. ఆ మేరకు శుక్రవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా క్షేత్ర స్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. తీర ప్రాంతాల్లో గర్భిణులు, వృద్ధులు, పిల్లలను పునరావాస కేంద్రాలకు పంపడంతో పాటు వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మంచినీటి వనరులు కలుషితం కాకుండా చూడటంతో పాటు దోమలవల్ల వచ్చేవ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి వ్యాధినిరోధక కార్యక్రమాలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రోగ్రాం అధికారులు వారివారి డివిజన్లలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల నుంచి సమాచారాన్ని సేకరించడంతో పాటు ఆయా గ్రామాలను సందర్శించాలన్నారు.

వెలిగొండ నిర్వాసితులను ఆదుకోండి

కలెక్టర్‌ను కోరిన టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు


కలెక్టర్‌ను కలిసి బొకే అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): వెలిగొండ ముంపు గ్రామాల్లో అర్హులైన నిర్వాసితులందరికీ న్యాయం చేయాలని టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు కలెక్టర్ పి.రాజాబాబును కోరారు. శుక్రవారం ప్రకాశం భవనంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలపై ఆయనతో చర్చించారు. ముఖ్యంగా నిర్వాసితులకు అందించే ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీపై రకరకాల ఊహాగానాలు గ్రామాల్లో వినిపిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వ నియమావళిని ప్రజల మధ్య బహిరంగ పరిచి వివరించాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే అర్హత ఉన్నప్పటికీ చాలా కుటుంబాలకు పరిహారం అందకుండా పెండింగ్ జాబితాలో ఉంచారని, వారందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అర్హులైన ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అర్హులైన వారికి తప్పక న్యాయం చేస్తామని, ఒకవేళ తన పరిధిలో లేని అంశాలు ఉంటే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లయినా అందరికీ ప్యాకేజీ అందేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు ఎరిక్షన్‌బాబు తెలిపారు. ఆయనతోపాటు పెద్దారవీడు మండల నాయకులు ఇండ్ల రామకృష్ణారెడ్డి, సీహెచ్.సుబ్బరామిరెడ్డి, మాజీ ఎంపీపీ నాగేశ్వరరావు, ఖాశింవలి ఉన్నారు.

పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి


● జేసీ గోపాలకృష్ణ

మద్దిపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్ పునరావాసకాలనీలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. శుక్రవారం మద్దిపాడు, ఘడియపూడి, బూరేపల్లి కాలనీని ఆయన సందర్శించారు. ఆయా కాలనీవాసులతో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఘడియపూడి కాలనీకి శ్మశాన స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ వెంటనే శ్మశానస్థలం కోసం అవసమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఆదిలక్ష్మిని ఆదేశించారు. బూరేపల్లి కాలనీలో పెండింగ్ పట్టాలు, ప్యాకేజీలు అందించాలని గ్రామస్థులు జేసీని కోరారు. మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ పాఠశాల వద్ద ఆగి స్కూలులోకి వెళ్లేందుకు మెరక తోలించాలని అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతి, ఆర్ఐ రమణయ్య, సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు, అన్నమనేని సుబ్బారావు, ఏడుగుండ్ల సత్యనారాయణ, చింతల శ్రీనివాసరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.



హెడ్ పోస్టాఫీసులో సర్వర్ డౌన్ !



పోస్టాఫీస్‌లో బోర్డు

ఒంగోలు(రూరల్), అక్టోబరు24(ఆంధ్ర జ్యోతి): ఒంగోలులోని హెడ్ పోస్టాఫీసులో శుక్రవారం సర్వర్ డౌన్ అయ్యింది. దీంతో కార్యాలయంలో పనులు స్తంభించిపోయాయి. ఈక్రమంలో పనుల కోసం వచ్చిన వినియోగదారులకు విషయం తెలిసి ఇబ్బందిపడాల్సి వచ్చింది. చేసేదేమి లేక వెనుదిరిగి వెళ్లిపోయారు. సర్వర్లు పనిచేయనప్పుడు వెంటనే మరమ్మతులు చేయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

రేకుల ఇంటిలో అగ్నిప్రమాదం


కాలిపోయిన సామగ్రి

ఒంగోలు క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రేకుల ఇంటిలో అగ్నిప్రమాదం జరిగి లక్ష రూపాయలు ఆస్తినష్టవాటిల్లింది. ఈ సంఘటన ఒంగోలు నగరం సంతపేట ఆంజనేయస్వామి దేవాలయంలో సమీపంలో వివరాలలోకి వెళితే.. వినోదరాయిని పాలెంనకు చెందిన ఎర్రిచర్ల శారద టైలరింగ్ పనులు చేసుకుంటూ సంతపేటలో రేకుల ఇంటిలో తన సోదరుడితో కలిసి నివాసం ఉంటున్నారు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వకపోతే సోదరి శారదను వేదిస్తుంటాడు. దీంతో గురువారం రాత్రి కూడా డబ్బులు అడగ్గా తన వద్ద లేవని ఇంట్లో నుంచి పక్కఇంటికి వెళ్ళింది. వెంటనే ఆమె సోదరుడు కూడా అతని స్నేహితులతో కలిసి బయటకు వెళ్ళిపోయాడు. కొద్దిసేపటికి ఇంట్లో మంటలు రావడంతో శారదను పక్కింటి వారు పిలిచి చెప్పారు. అప్పటికే ఇంట్లో ఉన్న 10 బస్తాలు వడ్లు, బీరువా, డబుల్ కాట్ మంచం, టీవీ ఇంకా గృహోపకరణలు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపకదళం వచ్చి మంటలను ఆర్పివేశారు. సుమారు లక్షరూపాయాలు నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపారు.

బాలసదన్ ఆకస్మిక తనిఖీ

అవీఇవీ


బాలసదన్‌ను పరిశీలిస్తున్న న్యాయాధికారి ఓంకార్

గిద్దలూరు టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీఆర్‌కాలనీ లోగల బాలసదన్‌ను శుక్రవారం జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్, తహసీల్దార్ అంజనేయరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలకు బిల్డింగ్ అంతా నీరు కారుతుండడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బిల్డింగ్ లోపల తడిచిన గోడను, కరెంటు బోర్డులు, వాన నీరు పడడానికి పెట్టిన బక్కెట్లు కనిపించడంతో వారు విస్తుపోయారు. కరెంటు షార్ట్‌సర్క్యూట్ జరుగడానికి అవకాశం ఉందని, ప్రమాదం జరిగితే బాలికలకు, సిబ్బందికి అపాయం జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారి వెంట బాలసదన్ సూపరింటెండెంట్ ఎస్.ఝాన్సీరాణి, పారాలీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అమరజవాన్ స్థూపం కోసం స్థలం కేటాయిస్తాం


కలెక్టర్‌కు ఎంపీ మాగుంటతో కలిసి బొకే అందజేస్తున్న మాజీ సైనికులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో అమర జవాన్‌స్థూపం కోసం స్థలాన్ని కేటాయిస్తానని కలెక్టర్ రాజాబాబు పేర్కొన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితో కలిసి ది ప్రకాశం జిల్లా ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ సంఘం నాయకులు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట రంగారాయుడు చెరువుకు ఈశాన్యం వైపున జాతీయ జెండా పక్కన అమర జవానుల స్మారక స్థూపానికి స్థలం కేటాయించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ అందుకు సంబంధించిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎక్స్‌సర్వీస్‌మెన్ ఫెడరేషన్ అధ్యక్షుడు నెప్పల్లి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఆలపాటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు దశరథ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ఒంగోలు క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఒంగోలు నగరం హౌసింగ్‌బోర్డ్ కాలనీలో శుక్రవారం జరిగింది. స్థానిక నగర శివారు ప్రాంతంలో ఉండే ఓ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుకునే నలుగురు విద్యార్థులు హౌసింగ్ బోర్డు కాలనీలో రేకుల ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఇంటిలో ఎవరూ లేని సమయం లో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన బాపట్ల దిగ్విజయ్‌సాయిమణికంఠ (22) ఇనుప కమ్మీకి టవల్‌తో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేయగా వారు ఒంగోలు వచ్చి తమ కుమారుడి మృతదేహాన్ని తీసుకెళ్లారు. విద్యార్థి మృతికి గల కారణం తెలియాల్సి ఉంది.

సింగరాయకొండలో వర్ష బీభత్సం

పాకలలో రాష్ట్రంలోనే అత్యధికంగా 147.5మి.మీ వర్షపాతం

జలమయంగా మారిన లోతట్టు ప్రాంతాలు

తీరప్రాంత గ్రామాల్లో పర్యటించిన జడ్పీ సీఈవో, తహసీల్దార్




వర్షపునీటిని ఎక్స్‌కవేటర్ సహాయంతో బయటకు పంపిస్తున్న అధికారులు, బస్టాండ్ ప్రాంగణంలో నిలిచిన వర్షపునీరు, అప్పాపురం గిరిజనకాలనీలో పర్యటిస్తున్న తహసీల్దార్ రాజేష్

సింగరాయకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజుల నుంచి మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు భారీ వర్షం పడింది. శుక్రవారం ఉదయం 7 గంటలకు మండలంలోని పాకల గ్రామంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 147.5 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్ష బీభత్సం దాటికి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణమంతా నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. వర్షపు నీరు బయటకుపోక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని పాతపోస్టాఫీస్ వీధి, భైరాగిమన్యం, అరుణాకాలనీల్లో పల్లపు ప్రాంతాల్లోని పలు గృహాల్లోకి వర్షపు నీరుచేరడంలో ప్రజలు అవస్థలు పడ్డారు. సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలో లోతట్టుప్రాంతమైన ఎస్టీకాలనీ అప్పాపురంలో వర్షపు నీరు భారీగా నిలిచింది. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక టీడీపీ నేతలు వారికి భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఊళ్లపాలెం పంచాయతీ పరిధిలోని బేసిన్ పల్లెపాలెంలో వర్షపు నీరు బయటకు వెళ్లే వీలులేక వీధులన్నీ జలమయంగా మారాయి. పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలోని ఆంజనేయస్వామిగుడి ప్రహరీ గోడ కుప్ప కూలింది. జడ్పీ సీఈవో చిరంజీవి, తహసీల్దార్ ఎన్‌బీవీ రాజేష్ తీరప్రాంత గ్రామాలైన పాకల, ఊళ్లపాలెంతోపాటు సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని అప్పాపురంలో పర్యటించారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు.

बैंक ऑफ़ इंडिया BOI బ్యాంక్ ఆఫ్ ఇండియా

అసెట్ రికవరీ శాఖ

10-1-1199/2, PTI బిల్డింగ్, 3వ అంతస్తు, A.C. గార్డ్స్, హైదరాబాద్-500004, ఫోన్: 8919422100, 9160006393, ఇ-మెయిల్ : AssetRecoveryBranch.Telangana@bankofindia.bank.in

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8 (6) మరియు 9(1)తో చదువబడే SARFAESI చట్టం, 2002 క్రింద సెక్యూర్డ్ ఆస్తుల అమ్మకం కొరకు ప్రకటన

SARFAESI చట్టం, 2002 మరియు అందులో రూపొందించబడిన నియమాల క్రింద ఈ అమ్మకం ప్రకటన జారీ చేయడానికి మరియు అమ్మకం యొక్క అన్ని హక్కులను వినియోగించుకొనుటకు బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు పూర్తి హక్కులు కలిగి ఉన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/చార్జ్ చేసిన, బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిచే నిర్మాణాత్మక / భౌతిక స్వాధీనం చేసుకొనబడినట్టి దిగువ వివరించబడిన స్థిరాస్తులు దిగువ వివరించబడిన రుణగ్రహీతలు మరియు హామీదారుల నుండి బ్యాంక్ ఆఫ్ ఇండియా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించవలసిన దిగువ వివరించబడిన బకాయిలను రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నది అలా", "అక్కడ ఏమున్నదో అది" మరియు "అక్కడ ఉన్నది ఉన్నట్లు" ప్రాతిపదికన 25.11.2025 తేదీన ఇ-వేలం ద్వారా విక్రయించబడునని మీకు / రుణగ్రహీతలకు / హామీదారులకు / తనఖాదారులకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

1) సాధారణ ప్రజానీకం మరియు ఆసక్తిగల కొనుగోలుదారులు ఏదేని ఆస్తి కొనుగోలుకు సంబంధించి బిడ్‌లో పాల్గొనుటకు ఏదేని విచారణ కొరకు మరియు ఇందుకు సంబంధించి అన్ని ఇతర విషయాల కొరకు (నియమ నిబంధనలో తెలిపిన విధంగా వారి ఆన్‌లైన్ బిడ్ దాఖలు చేయుట మినహా) లేదా ఏదేని విచారణ వివరాలు పొందుటకు పైన తెలిపిన శాఖను సంప్రదించవలసినదిగా సూచించబడుచున్నారు. 2) మూడవ పార్టీలకు చెల్లించవలసిన ఏదేని దాని కొరకు లేదా ఇందుకు సంబంధించి ఏదేని మూడవ పార్టీతో సాధారణ ప్రజానీకం ఆసక్తిగల కొనుగోలుదారులు/ ఏవేని చర్యలు/వ్యవహారాలు జరిపితే దానికి బ్యాంక్ ఎలాంటి బాధ్యత వహించదు/ జవాబుదారీ కాదు అని సాధారణ ప్రజానీకం/ ఆసక్తిగల కొనుగోలుదారులను హెచ్చరించడమైనది. అది వారి సొంత బాధ్యత మరియు వ్యయ ప్రయాసలపై నిర్వహించుకొనవచ్చును. 3) బిడ్డింగ్ ప్రాసెసింగ్ కోట్ చేసిన వారి అంతిమ బిడ్ మొత్తాన్ని మాత్రమే బ్యాంకుకు ఆస్తి యొక్క సఫలీకృత బిడ్డరుచే మొత్తం చెల్లించబడాలని కూడా తెలియజేయడమైనది (నియమ నిబంధనల ప్రకారం) + వర్తించు పన్నులు (అమ్మకం సర్టిఫికెట్ నమోదు నిమిత్తం TDS, స్టాంపు సుంకం, చార్జీలు/ఫీజులు బిడ్డరుచే విడిగా చెల్లించబడాలి. 4) ఏదేని SRO వద్ద ఆస్తి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి బ్యాంక్‌కు తెలియని ఏదేని నిషేధం ఉన్నదేమోనని ఆస్తి నమోదు గురించి తమకుతాము కొనుగోలుదారులు సంతృప్తి చెందవలెను. 5) కాగోరు బిడ్డర్లు బిడ్ దాఖలు చేసే ముందు ఆస్తిపై ఏవేని చట్టబద్ధమైన / ప్రభుత్వ / మునిసిపాలిటీ క్లెయిమ్‌లు అనగా ఆస్తి పన్ను, ఎలక్ట్రిసిటీ, వాటర్, వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహణ బకాయిలు లేదా ఏవేని ఇతర బకాయిలు మొదలగు వాటి గురించి వివరాలు పొందవలెను మరియు తమకుతాము సంతృప్తి చెందవలెను. 6) సదరు ఇ-వేలం ఆస్తి / ఆస్తులకు సంబంధించి భవిష్యత్‌లో ఏవేని వ్యాజ్యాలు ఎదురయ్యే విషయంలో సదరు వేలం అట్టి వ్యాజ్యం ఫలితానికి లోబడి ఉంటుందని కాగోరు బిడ్డర్లు గమనించవలెను. 7) కాగోరు బిడ్డర్లు బిడ్ దాఖలు చేసే ముందు సరియైన / స్వతంత్ర విచారణ చేసుకోవలెను.

అమ్మకం తేది & సమయం : 25.11.2025 న ఉ. 11.00 గం.ల నుండి సా. 5.00 గం. వరకు (అమ్మకం ముగిసే వరకు బహుళ విస్తరణలతో)

క్రసం	రుణగ్రహీతలు మరియు హామీదారుల పేరుతో పాటు మిగులు బకాయి వివరాలు
1.	**M/s కెమోల్ టెక్నాలజీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్**, ప్లాట్ నం.129/2బి, తీగదుర్తిపాడు గ్రామం, పొదిలి మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 523240; **శ్రీ పలగాని చంద్రశేఖర్ రెడ్డి తండ్రి శ్రీ వెంకా రెడ్డి**, మేనేజింగ్ డైరెక్టర్/హామీదారు, 6-2, జండాచెట్టు వీధి, సంతనూతలపాడు గ్రామం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 523225; **శ్రీమతి పలగాని రమాదేవి భర్త శ్రీ వెంకా రెడ్డి**, హామీదారు, 6-2, జండాచెట్టు వీధి, సంతనూతలపాడు గ్రామం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 523225; **శ్రీ ముప్పూరి చలమయ్య తండ్రి శ్రీ సుబ్బారావు**, హామీదారు, 14-139, తూర్పు బజారు, చీమకుర్తి గ్రామం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 523226. **బకాయి మొత్తం: రూ.2,29,37,050/-** ప్లస్ తిరిగి చెల్లించబడిన ఏవైనా మొత్తాలు తగ్గించుకుని వ్యయాలు, ఖర్చులు వగైరా కలుపుకుని 31.03.2017 నుండి కాంట్రాక్చువల్ రేట్ వంతున వడ్డీ.
	స్థిరాస్తి వివరణ: ఐటం నం.1: ఎ) M/s కెమోల్ టెక్నాలజీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరున గల పొదిలి మండలం, ఆముదాలపల్లి పంచాయతీ, తీగదుర్తిపాడులోని సర్వే నం.129/2, సబ్ డివిజన్ నం.129/2బి వద్దగల ఎ.7-24 సెంట్ల మొత్తంలో ఎ.4.00 సెంట్ల విస్తీర్ణం గల భూమి యావత్తు మరియు **భూమి సరిహద్దులు:** ఉత్తరం: పలగాని చంద్రశేఖర్ రెడ్డి, దక్షిణం: బీడు, తూర్పు: దోవ, పశ్చిమం: బీడు. **సేల్ డీడ్ నం:** 3790/2011 తేది 27.06.2011, **SRO:** పొదిలి; **MOD:** 3995/2014 తేది 13.05.2014; **SRO:** ఒంగోలు (R.O); **MOD:** 4081/2014 తేది 15.05.2014; **SRO:** ఒంగోలు (R.O); **స్వాధీనం:** భౌతిక **బి) M/s కెమోల్ టెక్నాలజీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్** పేరున గల పొదిలి మండలం, ఆముదాలపల్లి పంచాయతీ, తీగదుర్తిపాడులోని సర్వే నం.128/2, 128/3, సబ్ డివిజన్ నం.128/2బి, 128/3బి వద్దగల ఎ.0.42 సెంట్ల విస్తీర్ణం గల భూమి యావత్తు మరియు **భూమి సరిహద్దులు: ఉత్తరం:** బొక్కిసం నాగభూషణం మరియు కొండా మల్లికార్జునరావు, దక్షిణం: బీడు, తూర్పు: మందాటి వెంకాయమ్మ, పశ్చిమం: విక్రయదారుల మిగతా ఆస్తి. **సేల్ డీడ్ నం:** 1767/2012 తేది 16.05.2012, **SRO:** పొదిలి; **MOD:** 3995/2014 తేది 13.05.2014; **SRO:** ఒంగోలు (R.O); **MOD:** 4081/2014 తేది 15.05.2014; **SRO:** ఒంగోలు (R.O); **స్వాధీనం:** భౌతిక. సి) **శ్రీ పలగాని చంద్రశేఖర్ రెడ్డి** పేరున గల ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లా, పొదిలి సబ్ రిజిస్ట్రార్ పరిధి, పొదిలి మండలం, ఆముదాలపల్లి పంచాయతీ, తీగదుర్తిపాడులోని సర్వే నం.129/2, సబ్ డివిజన్ నం.129/2ఎ వద్దగల ఎ.3-24 సెంట్ల విస్తీర్ణం గల భూమి యావత్తు మరియు **భూమి సరిహద్దులు:** ఉత్తరం: సర్వే నం.129/1 లోని భూమి, దక్షిణం: కెమోల్ టెక్నాలజీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, తూర్పు: దోవ, పశ్చిమం: బీడు భూమి. **సేల్ డీడ్ నం:** 3789/2011 తేది 27.06.2011, **SRO:** పొదిలి; **MOD:** 3995/2014 తేది 13.05.2014; **SRO:** ఒంగోలు (R.O); **MOD:** 4081/2014 తేది 15.05.2014; **SRO:** ఒంగోలు (R.O); **స్వాధీనం:** భౌతిక.
	రిజర్వు ధర : రూ.91.58 లక్షలు; బయానా : రూ.9.158 లక్షలు; బిడ్ పెరుగుదల మొత్తం: రూ.1.00 లక్షలు

నియమ నిబంధనలు: 1) ఆస్తి వివరాలు చూడడానికి https://baanknet.com/eauction-psb/x-login దర్శించండి. 2) వెబ్‌సైట్ https://baanknet.com/ eauction-psb/x-login ద్వారా 'ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ బిడ్డింగ్' ప్రక్రియ ద్వారా మాత్రమే వేలం అమ్మకం / బిడ్డింగ్ ఉంటుంది. 3) కాగోరు బిడ్డర్లు పోర్టల్ https://baanknet.com/eauction-psb/bidder-registration లో తమ పేర్లను వన్‌టైమ్ రిజిస్టర్ చేసుకొని యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్ పొందవలెను. సదరు పోర్టల్‌లో ఆన్‌లైన్ ఇ-వేలంలో పాల్గొనుటకు వారు అప్పుడు అనుమతించబడతారు. బయానా వారి వాలెట్‌కు డిపాజిట్ చేయబడాలి. 4) ఏ సమయంలోనైనా కనీసం మొదటి బిడ్ పెంపుదల మొత్తం కంటే మీ బిడ్ మొత్తం రిజర్వు ధర కంటే ఎక్కువగా ఉండాలి మరియు బిడ్లు పైన తెలిపిన పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో దాఖలు చేయాలి మరియు బిడ్డరు ఇ-వేలంలో పాల్గొనుటకు బయానా కొరకు వారి వాలెట్‌లో తగిన బ్యాలెన్స్‌ను కలిగియుండవలెను. 5) కాగోరు బిడ్డర్లు ఇ-వేలంలో నమోదు కొరకు మరియు పాల్గొనుట చెల్లుబాటుగు ఇ-మెయిల్ చిరునామా & మొబైల్ నం. కలిగి ఉండవలెను. 6) బిడ్డర్లు ఇ-వేలం అమ్మకంలో వారి బిడ్లు దాఖలు చేయుటకు మరియు పాల్గొనే ముందు ఇ-వేలం అమ్మకం సవివర నియమ నిబంధనల కొరకు మా వెబ్‌సైట్ https://bankofindia.co.in/Tender దర్శించవలసిందిగా సూచించబడుతున్నారు. 7) సెక్యూర్డ్ క్రెడిటార్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ https://baanknet.com/eauction-psb/home లో ఏర్పాటు చేయబడిన నియమ నిబంధనలకు లోబడి అమ్మకం ఉంటుంది. 8) సంబంధిత శాఖ యొక్క ముందస్తు అనుమతితో ఆస్తిని తనిఖీ చేసుకొనవచ్చును. సంప్రదించాల్సిన వారి వివరాలు పైన పొందుపర్చబడినవి. 9) అమ్మకం క్రింద కొనుగోలుదారులకు ఏవేని భూములను డీమార్కేట్ చేయడానికి బ్యాంకు బాధ్యత వహించదు.

గమనిక: సఫలీకృత బిడ్డర్లు బయానాతో కలుపుకొని అమ్మకం ధరలో 25 శాతాన్ని అమ్మకం యొక్క అదే రోజున లేదా మరుసటి పని రోజుకు మించకుండా చెల్లించవలెను మరియు అమ్మకం ధరలో మిగిలిన మొత్తాన్ని వారికి అమ్మకం తెలియజేయబడిన యొక్క అంగీకారం / నిర్ధారణ నుండి 15 రోజులలోగా చెల్లించవలెను. పైన పేర్కొన్న నిర్దేశిత గడువులోగా మొత్తంలో 25% మొత్తాన్ని లేదా మిగతా మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైనచో, అమ్మకం రద్దు చేయబడును మరియు ఈ బిడ్‌కు సంబంధించి బిడ్డర్లచే డిపాజిట్ చేయబడిన మొత్తం బిడ్డర్లకు ఎలాంటి తదుపరి నోటీసు లేకుండా జప్తు చేసుకోబడును. ఈ విషయంలో బిడ్డర్ల ఆస్తికి సంబంధించి లేదా అందులో భాగానికి అన్ని క్లెయిమ్‌లు వదులుకోవలసి ఉంటుంది. తదుపరిగా ఆస్తి విక్రయించబడును మరియు సఫలీకృత బిడ్డర్‌కు ఎలాంటి వడ్డీ చెల్లించబడదు మరియు తదుపరిగా ఎట్టి పరిస్థితులలోను బిడ్డర్లచే వడ్డీ చెల్లింపు కొరకు ఎలాంటి క్లెయిం చేయబడదు.

తేది: 22.10.2025, ప్రదేశం : హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

అతలాకుతలం

(5వ పేజీ తరువాయి)

చేరుతోంది. కనిగిరి నియోజకవర్గంలోని అనేక వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఒంగోలులోని అనేక కాలనీలు జలమయమయ్యాయి. ప్రధాన వీధులు చెరువులను తలపిస్తున్నాయి. అలాగే లోతట్టు ప్రాంతంలోని ప్రభుత్వ కార్యాలయాలు నీటిలోనే ఉన్నాయి.

దెబ్బతింటున్న పంటలు

తాజా వర్షాలతో పంటలకు భారీ నష్టం వాటిల్లే పరిస్థితి కనిపిస్తోంది. ఖరీఫ్‌లో సాగుచేసిన పత్తి, మిర్చి, వరి, కంది, సజ్జ, మొక్కజొన్న, పొగాకు, మినుము వంటి పంటలు అనేక చోట్ల నీటమునిగాయి. సుమారు 50వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు నీటిలో ఉన్నట్లు తెలుస్తుంది. తెరపి ఇచ్చాక అసలు నష్టాలు వెలుగు చూసే అవకాశం ఉంది. ఇటు రెవెన్యూ, అటు పోలీస్ అధికారులు కలెక్టర్, ఎస్పీలు రాజాబాబు, హర్షవర్ధన్‌రాజుల నేతృత్వంలో మరింత అప్రమత్తంగా పనిచేస్తున్నారు. తీరప్రాంత మండలాల్లో పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతోపాటు మత్స్యకారులు చేపలవేటకు వెళ్లకుండా ఆపారు.

'ఆమె'కు అనారోగ్యం

(5వ పేజీ తరువాయి)

స్ర్కీనింగ్ పరీక్షలు చేశారు. వాటితోపాటు సిఫిల్ సెల్ స్ర్కీనింగ్ 3,200 మందికి నిర్వహించారు. పీఎంజేఏవై, ఏబీడీఎం కార్డులు 4వేల మందికి మంజూరు చేశారు. 35 మందికి మైనర్, 42 మందికి మేజర్ శస్త్ర చికిత్సలు నిర్వహించారు. 85వేల మందికి టీబీ స్ర్కీనింగ్ చేశారు. ఈ పరీక్షల్లో మొత్తం 35 నుంచి 40శాతం వరకు డయాబెటిక్, 5శాతం మందికి హైపర్ టెన్షన్, 5శాతం టీబీ, 12శాతం రక్తహీనత, 10 శాతం మంది కేన్సర్ బాధితులు ఉండగా, అందులో బ్రెస్ట్ కేన్సర్‌లే అధికంగా ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఈ క్యాంపుల్లో పురుషులు కూడా పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. మగవారిలో 10శాతం ఓరల్ కేన్సర్, సర్వైకల్ కేన్సర్ ఉన్నట్లు గుర్తించారు.

స్థానిక సంస్థలు బలోపేతం

(5వ పేజీ తరువాయి)

చర్యలు తీసుకున్నారు. పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సహకారంతో గ్రామాలభివృద్ధికి నిధులను సమకూరుస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తి సాధించే విధంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. రానున్న రోజుల్లో గ్రామ పంచాయతీల ద్వారా మెరుగైన పాలనను అందించడమే కాకుండా ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు వీలుగా చర్యలు చేపట్టారు.

భద్రత డొల్ల

(5వ పేజీ తరువాయి)

అతివేగంతో నడుపుతూ ప్రమాదాలకు హేతువులుగా మారుతున్నారు. కర్నూలు జిల్లాలో వేమూరి కావేరి బస్సు నడిపిన డ్రైవర్ తప్పిదం వల్లే 20మంది ప్రాణాలు గాలిలో కలిశాయి. అతివేగంతో వెళుతూ ముందున్న మోటారు బైకిస్టును ఢీకొట్టడం ప్రమాదానికి కారణమని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్న తర్వాతైనా రవాణాశాఖ మేల్కొనాల్సి ఉంది. మిగతా బస్సులన్నా నిబంధనలకు లోబడి నడుస్తున్నాయా లేదా పరిశీలించాల్సి ఉంది. బస్సులో మండే స్వాభావం ఉన్న వాటిని తరలించకూడదు. వోల్వో బస్సులలో కింద ర్యాకులలో బైకులు, గ్యాస్ సిలిండర్లు లాంటి వస్తువులను రవాణా చేయడం సర్వసాధారణమైపోయింది.ఇంకా దూరప్రాంతాలకు వెళ్లే లగేజీలలో అనేక పదార్థాలు ఉంచి క్యారియర్‌లో పెడుతున్నారు. ఇలాంటి వాటి వలన ఎక్కువ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. జిల్లాలో మొత్తం 202 కాంట్రాక్ట్ క్యారియర్లు, 101 ఆర్టీసీకి అద్దె బస్సులు నడుస్తున్నాయి. అద్దె బస్సులను నిబంధనలు ప్రకారం ఆర్టీసీ పర్యవేక్షణ చేస్తుంటుంది. అయితే కాంట్రాక్ట్ క్యారియర్ పేరుతో జిల్లాలో 202 సర్వీసులు ఉండగా ఇంకా వందల సంఖ్యలో బస్సులు జిల్లా మీద నుంచి వెళుతుంటాయి. అయితే రవాణా శాఖ ప్రైవేటు బస్సుల మీద దృష్టిసారించడం లేదు. వాటిపై నిఘా ఉంచి తనిఖీలు చేయడం, ఫిట్‌నెస్ తదితరాలు ఉన్నాయా? లేదా? పరిశీలించాల్సి ఉంది. కానీ నిబంధనలకు తుంగలో తొక్కి ట్రావెల్స్ బస్సులు ఇష్టారాజ్యంగా తిరుగుతుంటే అధికారులు చోద్యం చూడటం గమనార్హం

వారంవారం తనిఖీలు చేస్తున్నాం

ఆర్.సుశీల, రవాణాశాఖ ఉప కమిషనర్

జిల్లాలో వారం వారం మూడు ప్రాంతాలలో ప్రైవేటు బస్సులను తనిఖీలు చేస్తున్నాం. ఒంగోలు సమీపంలోని టంగుటూరు టోల్‌ప్లాజా, మార్కాపురం వద్ద కుంట, దర్శిలో ప్రతి మంగళవారం బస్సులు తనిఖీలు చేస్తున్నాం. బస్సులలో నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తాం.


కంభంలో అరటి మొక్కల పొలాలలో నిలిచిన నీరు


దోర్నాలలో నీటిలో మునిగిన మిరప


రాచర్లలో రంగనాయకస్వామి ఆలయం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ

పంటకు తంటా!

● భారీ వర్షాలతో 6,935 హెక్టార్లలో నష్టం ● ప్రాథమికంగా గుర్తించిన వ్యవసాయశాఖ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఐదు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలతో 6,935.36 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లాలోని 15 మండలాల పరిధిలోని 140 గ్రామాలకు చెందిన 8,428 మంది రైతులకు చెందిన పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రామికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం. జిల్లాలో ఇంకా వర్షం వీడకపోవడంతో ఈ పంట నష్టాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. పెద్దారవీడు మండలంలో 13 గ్రామాలకు చెందిన 1309 మంది రైతులు, మార్కాపురం మండలంలో 3260 మంది, తర్లుబాడు మండలంలో 99 మంది, మర్రిపూడి మండలంలో 420 మంది, పొదిలి మండలంలో 185 మంది, కొనకనమిట్ల మండలంలో 50 మంది, దొనకొండ మండలంలో 420 మంది, కురిచేడు మండలంలో 365 మంది, రాచర్లలో 425 మంది, గిద్దలూరు మండలంలో 405 మంది, బేస్తవారిపేట మండలంలో 278 మంది రైతులకు చెందిన పంటలు వర్షాలు నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పుల్లలచెరువు 35 మంది, యర్రగొండపాలెం 162 మంది రైతులు, వెలిగండ్ల 1013 మంది రైతులు, కొత్తపట్నం మండలంలో ఇరువురు రైతులకు చెందిన పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పత్తి 5179.4 హెక్టార్లు, మొక్కజొన్న 102.06 హెక్టార్లు, సజ్జ 1553.98 హెక్టార్లు, జొన్న 5.42 హెక్టార్లు, వేరుశనగ 94.5 హెక్టార్లలో వర్షాలకు పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి నివేదించారు.


కొండపి తహసీల్దార్ కార్యాలయంలో కూలిన కారు షెడ్డు

ఉద్యానపంటలకు స్వల్ప నష్టం

కాగా భారీ వర్షాలతో ఉద్యాన పంటలకు స్వల్ప నష్టం వాటిల్లినట్లు ఉద్యానవనశాఖ అధికారి గోపీచంద్ తెలిపారు. మిరప 70 హెక్టార్లు, మిర్చి, కూరగాయలు 60 హెక్టార్లు, పూలు 1.20 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. పొలాల్లోని పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ చేయడం వల్ల మొక్కలు వడిలిపోవడం జరిగిందన్నారు.

జిల్లాలో 40.9 మి.మీ. వర్షపాతం నమోదు


గిద్దలూరులో ఉధృతంగా ప్రవహిస్తున్న సగిలేరు నది

జిల్లాలో భారీ వర్షం కురిసింది. శుక్రవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 40.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా కొండపి మండలంలో 126.4 మి.మీ. వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా త్రిపురాంతకం మండలంలో 5.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. సింగరాయకొండ 114.6, కొత్తపట్నం 113.4, ఒంగోలు రూరల్ 80.6, ఒంగోలు అర్బన్ 80.6, టంగుటూరు 72.6, జరుగుమల్లి 64.6, గిద్దలూరు 59.4, కంభం 57.2, రాచర్ల 56.6, చీమకుర్తి 49.6, పామూరు 48.8, సంతనూతలపాడు 45.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. వెలిగండ్ల 45.2, మర్రిపూడి 44.2, కొమరోలు 44.2, పొన్నలూరు 43.2, బేస్తవారిపేట 42.6, అర్ధవీడు 40.2, హనుమంతునిపాడు 40.0, పీసీపల్లి 34.8, కనిగిరి 31.6, కొనకనమిట్ల 26.8, మార్కాపురం 20.8, పెద్దారవీడు 20.2, సీఎస్‌పురం 20.0, నాగులుప్పలపాడు 17.0, దొనకొండ 15.2, తర్లుబాడు 14.8, దర్శి 14.6, పుల్లలచెరువు 13.2, మద్దిపాడు 11.2, దోర్నాల 10.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.


మార్కాపురం మండలంలోని రామచంద్రాపురం వద్ద పత్తి పొలంలో నిలిచిన వర్షపు నీరు

దెబ్బతిన్న పత్తి, మిరప

మార్కాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం వేకువజాము నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి నియోజకవర్గంలో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షంతో నీటమునిగి దెబ్బతిన్న పంటలను వ్యవసాయ, ఉద్యానశాఖాధికారులు పరిశీలించారు. గడిచిన 24 గంటల్లో డివిజన్ వ్యాప్తంగా 393.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

4,357 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

మార్కాపురం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 4,357 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు ఏడీఏ డి.బాలాజీనాయక్ తెలిపారు. ప్రధానంగా 41 గ్రామాల్లో 4,753 మంది రైతులు వర్షం ప్రభావంతో దెబ్బతిన్నట్లు గుర్తించారు. వీటిల్లో ప్రధానంగా పత్తి పంట దాదాపు పూర్తిగా దెబ్బతిన్నట్లు చెబుతున్నారు. వాణిజ్య పంటల్లో మిరప, పొగాకు కొద్దిమేర దెబ్బతినింది. అక్కడక్కడా నీళ్లు నిలిచిన చోట కొద్దిగా పాడయ్యాయి. ఉద్యాన పంటల్లో బొప్పాయిలో ఒక్క రోజుకు మించి నీరు నిల్వవుంటే ఇబ్బందులు పడాల్సివుంటుందని మార్కాపురం హెచ్‌వో రమేష్ పలు గ్రామాల్లో పర్యటించి సూచనలిచ్చారు.

పత్తికి తీవ్ర నష్టం

గిద్దలూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా 4 రోజులుగా కురుస్తున్న వర్షం రైతులను నట్టేటా ముంచింది. మండలంలోని కొమ్మునూరు, వేములపాడు, బ్రాహ్మణపల్లి, పరిసర గ్రామాల పరిధిలో సాగైన పత్తి పొలంలో వర్షపు నీరు నిలిచి పోయింది. సుమారు 250 హెక్టార్ల మేర పత్తి పంటకు నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమిక నివేదిక ఇచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో ఆముదం, మిర్చి, పొగాకు, వరి పొలాల్లో నీరు నిలిచింది. నీరు నిలిచిన పొలాలను సహాయ వవ్యవసాయ సంచాలకులు రాజశ్రీ, మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పరిశీలించారు

వచ్చే ఐదురోజులు సిబ్బందికి సెలవులు రద్దు

ఒంగోలు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు విద్యుత్తుశాఖను అప్రమత్తం చేసినట్లు ఎస్‌ఈ కట్టా వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే సమయంలో సిబ్బందికి వచ్చే ఐదు రోజుల్లో సెలవులు లేవని తెలిపారు. అందరు వారి ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉండాలని కోరారు. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. తడి బట్టలను సర్వీస్ వైర్లపై, జీఐ వైర్లపై వేయొద్దని చెప్పారు.


పుట్టలోని నాగయ్యా.. లేచి రావయ్యా!

● నేడు నాగులచవితి పండుగ ● సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు

ఒంగోలు కల్చరల్, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి): అనేక పర్వదినాలకు నెలవు కార్తీకమాసం. అందుకే అన్ని మాసాలలోకి కార్తీకమాసం ఎంతో శ్రేష్ఠమైనదని పెద్దలు చెబుతారు. ఈ కార్తీకమాసం ప్రారంభం మొదలు చివరి వరకు ఎన్నో పర్వదినాలు వస్తాయి. కార్తీకమాసం ప్రారంభమైన మరుసటి రోజు అంటే విదియ రోజు 'భగినీ హస్తభోజనం' పర్వదినమైతే, నాలుగవ రోజు అంటే కార్తీక శుద్ధ చవితిని 'నాగుల చవితి' పర్వదినంగా జరుపుకోవటం అనాదిగా వస్తున్న ఆచారం. మహిళలు ఎంతో ప్రాధాన్యమిచ్చే ఈ నాగులచవితి పర్వదినం రోజున వారు పుట్టలో పాలుపోసి అత్యంత భక్తిశ్రద్ధలతో నాగేంద్రుని ఆరాధిస్తారు.

నాగులచవితి రోజున ఉదయాన్నే పుట్టలో ఆవుపాలు పోసి, నాగేంద్రుని అత్యంత భక్తితో పూజించి, చలిమిడి, అరటిపళ్లు నైవేద్యం పెట్టాలి. అనేక చోట్ల పిల్లలు దీపావళి రోజున మిగిలిన టపాసులను నాగులచవితి రోజున పుట్టదగ్గర కానీ, ఇంటి దగ్గర కానీ కాలుస్తారు. ఈ రోజున పుట్టచుట్టూ ప్రదక్షిణ చేస్తూ నూకని పుట్టు చుట్టూ చల్లుతారు. 'నూకని నువ్వు తీసుకుని రూకలు మాకివ్వు తండ్రీ' అని ఈ సందర్భంగా గతంలో పెద్దలు ప్రార్థించేవారు. ఆ విధంగా చేసిన తర్వాత ఆ పుట్టదగ్గర ఉన్న పుట్టమన్ను చెవులకి పెట్టుకోవాలి.

ఎక్కువ పాలు పోయొద్దు


నాగులచవితి రోజున సహజంగా గ్లాసు నిండా

ఆవుపాలు తీసుకుని పుట్టలో పోస్తుంటారు. ఈ విధంగా వందలాది మంది పోయటం వల్ల ఆ పుట్టలో పాము ఉంటే ఆ పాలధాటికి దానికి హాని కలుగుతుంది. అందువల్ల కేవలం రెండు లేక మూడు చెంచాల ఆవుపాలను పుట్టలోపోసి మిగిలిన వాటిని నైవేద్యం పెట్టి ఇంటికి తెచ్చుకుని నాగేంద్రుని ప్రసాదంగా తాగాలి.

నగరంలో అనేక పుట్టలు

నగరంలో రంగారాయుడు చెరువు పక్కనున్న పుట్టదగ్గర, ఐశ్వర్యనగర్‌లో ఉన్న పుట్టదగ్గర అదేవిధంగా సంతపేట, అన్నవరప్పాడు, భాగ్యనగర్ మొదలైన ప్రదేశాల్లో ఉన్న పుట్టలదగ్గర మహిళలు ఎక్కువగా పాలుపోయటం, పూజలు చేయటం జరుగుతుంది. సీతారాంపురంలోని వరాల నాగేంద్రస్వామి దేవస్థానం, రంగారాయుడు చెరువుదగ్గర ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం , స్కందగిరిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం మొదలైన చోట్ల ప్రత్యేక పూజలు చేయనున్నారు. నాగులచవితిని దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రదేశాల్లో పుట్టవద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యము లేకుండా చూడటానికి కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఏర్పాట్లు చేశాయి. పుట్టదగ్గరకు వచ్చే భక్తులకు అవసరమైన ఆవుపాలు, నాగేంద్రుని ప్రతిమ మొదలైనవి అక్కడే అమ్మేందుకు కొంతమంది వ్యాపారులు కూడా సిద్ధమవుతున్నారు.

స్నేహితులను కాపాడి.. డైట్ విద్యార్థి గల్లంతు!

● యర్రగుడిపాడు జంక్షన్ వద్ద ఘటన

చీమకుర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సరదాగా ఈతకెళ్లి ప్రమాదంలో చిక్కుకున్న ఇద్దరు మిత్రులను కాపాడి విద్యార్థి గల్లంతైన ఘటన శుక్రవారం మండలంలోని తొర్రగుడిపాడు సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతనూతలపాడు మండలం మైనంపాడులోని జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో టీచర్ ట్రైనింగ్ కోర్సు రెండవ సంవత్సరాన్ని చదువుతున్న ముగ్గురు యువకులు పూర్ణచంద్రుడు, కాకి అరవింద్(19), స్టాలిన్... భారీ వర్షాల వల్ల విద్యాలయానికి సెలవు కావటంతో షికారుకు వెళ్లామనుకున్నారు. చీమకుర్తి కొండల్లో పోలీస్ ఫైరింగ్ క్యాంప్‌కు పైభాగాన కొండల నుంచి జాలువారుతున్న జలపాతాలు సుందరంగా ఉన్నాయని ముగ్గురు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. రుద్రవరం, లక్ష్మీపురం దాటగానే యర్రగుడిపాడు, తొర్రగుడిపాడుల మధ్య బ్రిడ్జిపై ప్రవహిస్తున్న ముదిగొండి వాగును చూసి బండిని ఇవతలి ఒడ్డుపై ఆపారు. ఇంతలో పూర్ణచంద్రుడు, స్టాలిన్ లోతు చూద్దామని వాగులో దిగి నడుస్తూ అవతల ఒడ్డుకు చేరుకుంటున్న క్రమంలో అదే వాగులో గడ్డిమోపుతో బైక్‌పై వెళ్తున్న వారికి దారి ఇద్దామని పక్కకి జరిగారు. వాగు ప్రవాహం పెరగటంతో ఇద్దరు మిత్రులు బ్రిడ్జిపై నుంచి వాగులోకి జారిపడి కొట్టుకుపోతున్నారు. ఇవతలివైపు ఒడ్డు నుంచి చూస్తున్న అరవింద్ ఒక్క ఉదుటున వాగులోకి దూకి మిత్రులను రక్షించే ప్రయత్నం చేశాడు. ఇద్దరు మిత్రులను ఒడ్డుకు చేర్చి తాను మాత్రం బ్రిడ్జి పక్కనే లోతుగా ఉన్న వాగులో గల్లంతయ్యాడు. ఘటనా స్థలాన్ని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవో ప్రసన్న, తహసీల్దార్ బ్రహ్మయ్య, డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు పరిశీలించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ దళాలను రప్పించి గల్లంతైన యువకుని ఆచూకి కోసం ప్రయత్నాలు ప్రారంభించారు.

రెవెన్యూ ఉద్యోగుల సస్పెన్షన్

విధినిర్వహణలో అలసత్వం వహించినందుకు ముదిగొండివాగు వద్ద విధుల్లో ఉన్న వీఆర్‌వో విజయలక్ష్మి, వీఆర్‌ఏ గోవింద్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.

యువకునికి కోసం వెదుకులాడుతున్న రెస్క్యూ టీం



కాకి అరవింద్ (ఫైల్)

గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం

● రూ.6లక్షల నగదు, గృహోపకరణాలు బుగ్గిపాలు

దొనకొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గ్యాస్ లీకై సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధమైంది. ఈఘటన శుక్రవారం మండలంలోని పోలేపల్లి ఎస్సీ కాలనీలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన మురికిపూడి బాలమరియమ్మ భర్త 14 సంవత్సరాల క్రితం మృతిచెందాడు. ఇద్దరు కుమారులైన రాజు, ప్రతాప్‌లతో కూలి పనులు చేసుకుంటూ పూరింట్లో జీవిస్తోంది. ఉదయం మరియమ్మ గ్యాస్ పొయ్యిపై వంట పనులు పూర్తిచేసి బయటకు వచ్చి కూర్చుంది. కొంతసేపటికి గ్యాస్ లీకై సిలిండర్ పేలటంతో ఒక్కసారిగా మంటలు పైకి లేచాయి. అనుకోని ఈ ఘటన నుంచి స్థానికులు తేరుకొని మంటలార్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ ప్రమాదంలో మూడురోజుల్లో జరిగే కుమారుడి నిశ్చితార్థ వేడుకలు, వచ్చే నెలలో జరిగే వివాహం నిమిత్తం సమకూర్చుకొని పెట్టెలో దాచుకున్న రూ.6 లక్షల నగదు, గృహోపకర వస్తువులు అగ్నికి బూడిదయ్యాయి. కుమారుడు ప్రతాప్ ధైర్యంచేసి తగలబడుతున్న ఇంట్లోకి వెళ్లి నగదు ఉన్న పెట్టెను బయటకు తెచ్చాడు. అప్పటికే అందులోని రూ.500 నోట్లు దగ్ధమయ్యాయి. సంఘటనా స్థలాన్ని తహసీల్దార్ బి.రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునరెడ్డి, వీఆర్వో కాశయ్య పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొని రూ.6లక్షల నగదుతో కలిపి మొత్తం రూ.7.95 లక్షలు నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ఎస్ఐ త్యాగరాజు సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబానికి తక్షణసాయం బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేసినట్లు తహసీల్దార్ తెలిపారు.


అగ్ని ప్రమాదంలో కాలిన రూ.500 నోట్ల కట్టలు

కలెక్టర్‌ను కలిసిన కందుకూరు ఎమ్మెల్యే

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ రాజాబాబును కందుకూరు శాసనసభ్యుడు ఇంటూరి నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం కలెక్టర్ రాజాబాబును కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తన నియోజకవర్గంలోని సమస్యలపై చర్చించారు.



గిద్దలూరు ఆలయంలో చోరీ

● వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 15 కిలోల వెండి అపహరణ ● సీసీ కెమెరాలు కట్ చేసి తస్కరణకు పాల్పడిన వైనం

గిద్దలూరు టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : దేవుడికే దొంగలు శఠగోపం పెట్టారు. దేవుడికి అలంకరించిన వెండి వస్తువులన్నీ దోచుకెళ్లారు. సీసీ కెమెరాలను కట్ చేసి చోరీకి పాల్పడ్డారు. గిద్దలూరు పట్టణంలోని రాచర్ల రోడ్డులోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. దేవుడి ఒంటిపై ఉన్న 15 కిలోల వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. దీని విలువ సుమారు రూ. 24 లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. దేవాలయానికి ఉన్న తాళాలను దొంగలు పగులగొట్టి సీసీ కెమెరాల తీగలను కట్ చేసి కెమెరాలు పని చేయకుండా చేసి గుడిలోకి చొరబడి స్వామి విగ్రహంపై ఉన్న 15 కిలోల వెండి ఆభరణాలను దోచుకుని వెళ్లారు. పక్కనే బీరువా ఉన్నప్పటికీ అందులో స్వామి అలంకార ఆభరణాలు ఉన్నప్పటికీ అవి తెరచుకోకపోవడంతో వాటిజోలి వెళ్లలేదు. శుక్రవారం మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు, అర్బన్ సీఐ కె.సురేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఒంగోలు నుంచి డాగ్‌స్క్వాడ్ క్లూస్ టీమ్ దొంగతనం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించింది.


దొంగతనం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మార్కాపురం డీఎస్పీ నాగరాజు, సీఐ సురేష్

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

FLAT FOR SALE

"దీపావళి.. ఆఫర్.. SSS HOMES వారు ఒంగోలు", కర్నూలు రోడ్డు, శ్రీసరస్వతి కాలేజీ ఎదురు రోడ్డులో మాచే నూతనంగా నిర్మించిన అపార్టుమెంట్లో 2BHK ఫ్లాట్స్ (1230 Sft) కలవు. తక్షణం గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్నవి. దీపావళి ఆఫర్ కేవలం 30 రోజులు మాత్రమే త్వరపడండి. SSS HOMES సంప్ర॥ Mob: 97039 98899, 75694 76242.

AJO-241136

HOUSE FOR SALE

ఒంగోలు, కర్నూల్ రోడ్, మహాలక్ష్మి కళ్యాణ మండపం ఎదురు రోడ్‌లో శ్రీ కృష్ణనగర్‌లో 20 గదులలో 2019లో నిర్మించిన దక్షిణం ఫేస్ గల 2BHK ఇండిపెండెంట్ హౌస్ అమ్మకమునకు కలదు. SSS Homes, 97039 98899, 75694 76242.

AJO-241138

ప్లాట్లు అమ్మబడును

అమరావతి రాజధాని, తాటికొండ(మం), రావెళ్ళ దగ్గర కొత్తలే అవుట్‌లో ఇంటి స్థలాలు, రామాయపట్నం పోర్టు దగ్గర ప్లాట్లు, పొలాలు అమ్మబడును. సంప్ర॥ 7032178599, 9704250705.

AJO-240990

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావలసినవారు, పేపరు పంపిణీ విషయంలో సమస్యలు ఉన్నా సంప్రదించండి
సర్క్యులేషన్ మేనేజర్ : 9985411484

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఇప్పుడు మీ ఆత్మీయులకు, ప్రకటనల ద్వారా మరింత చేరువకండి.
వివాహ, షష్టిపూర్తి, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
ఉద్యోగ, వ్యాపార, లీగల్ ప్రకటనలు,
శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి
మరియు అన్నిరకాల ప్రకటనలు కొరకు సంప్ర॥

ఒంగోలు : 99854 11071, 95053 05888, 97036 18694, 96525 55752, 99854 11483
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11071
గిద్దలూరు : 99859 21358

DTP ఆపరేటరు కావలెను ఆంధ్రజ్యోతి
WANTED
సీనియర్ / జూనియర్
DTP ఆపరేటరు
(యువకులకు మాత్రమే)
విద్యార్హత : ఇంటర్
అనుభవం : కమర్షియల్ అడ్వర్‌టైజ్‌మెంట్స్‌ను ఫొటోషాప్, గ్రాఫిక్స్ నందు ఆకర్షణీయంగా (తెలుగు/ఇంగ్లీషు) డిజైన్ చేయగలిగిన డి.టి.పి. ఆపరేటర్లు కావలెను.
జీతం : అర్హత, అనుభవమును బట్టి ఆకర్షణీయమైన జీతము.
ఇంటర్వ్యూ తేది : 25-10-2025
సమయం : 10.30 AM to 2 PM
అర్హత అనుభవం కల అభ్యర్థులు పూర్తి బయోడేటా వివరాలతో మాదిరి డిజైన్లతో వెంటనే సంప్రదించండి
★ DTP ఆపరేటరు : ఒంగోలు యూనిట్ కార్యాలయం నందు పనిచేయవలసి వుంటుంది.
బ్రాంచ్ మేనేజర్
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, చీరాల రోడ్, త్రోవగుంట గ్రామం, ఒంగోలు రూరల్ మం.
సెల్: 99854 11481, 99854 11071

హమ్మయ్య తెరపిచ్చింది..!

- జలదిగ్బంధంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు
- నీటిలోనే శివారు కాలనీలు
- పలువురు పునరావాస కేంద్రాలకు తరలింపు
- నగరంలో పర్యటించిన జేసీ గోపాలకృష్ణ, పలువురు అధికారులు



జలదిగ్బంధంలో ఇరిగేషన్ కార్యాలయం

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వానకు నగరవాసులకు కష్టాలు తప్పలేదు. గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా ముసురుతో కూడిన భారీ వర్షం నగరాన్ని ముంచెత్తింది. కాగా శుక్రవారం కాస్తంత తెరపివ్వడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. ప్రధానంగా సైడు కాలువల్లో పూడికతీత పనులు సక్రమంగా చేయకపోవడంతో వర్షపు నీరు పోయే మార్గం కరువైంది. దీంతో కొద్దిపాటి వాన కురిస్తేనే చెరువులా మారే నగరం, నాలుగు రోజులుగా కురుస్తున్న వానలకు ప్రధాన వీధులన్నీ జలమయం అయ్యాయి. అలాగే ప్రగతిభవన్, ఆడిట్ ఆఫీస్, వ్యవసాయశాఖ కార్యాలయం, డ్వామా, ఇరిగేషన్ కార్యాలయాలతోపాటు పలు కాలనీలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కార్యాలయాల్లోకి అడుగుపెట్టే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు విధులకు వెళ్ళేందుకు ఇక్కట్లు తప్పలేదు. ఇదిలా ఉండగా, శివారుకాలనీల్లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఇళ్ళలోకి చేరిన వర్షపు బయటకు పంపేందుకు నానా అగచాట్లు పడ్డారు. అలాగే జీజీహెచ్ ఎదురు మెయిన్‌రోడ్, పీవీఆర్ క్రీడా మైదానం, ఏబీఎం కాలేజీ గ్రౌండ్, దారావారితోట, రైల్వే స్టేషన్, శర్మాకాలేజీరోడ్ తదితర ప్రాంతాల్లో నీరు చేరి చెరువులను తలపించాయి. ఇక శివారుకాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై జేసీ గోపాలకృష్ణ, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మధు, ఎంఈ ఐశయ్య తదితరులు పర్యటించారు. ఈ సందర్భంగా జగజ్జీవన్‌రామ్ కాలనీలో ముంపు కష్టాలు పడుతున్న 150మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. 18వ డివిజన్ పరిధిలోని చెరుకొమ్ముపాలెం వద్ద నల్లవాగు పొంగిపొర్లడంతో ఆ కాలనీ వాసులను పునరావాస కేంద్రాలకు తరలించారు. అలాగే వారికి ఆహారం, తాగునీరు ఏర్పాట్లు చేయాలని జేసీ అధికారులను ఆదేశించారు.



చెరువుకొమ్ముపాలెంలో స్థానికుల సమస్యలను తెలుసుకుంటున్న జేసీ గోపాలకృష్ణ, మేయర్ సుజాత

కొండపి ప్రాంతంలో దంచికొట్టిన వాన

- పొంగిన వాగులు, ఏరులు
- అట్లేరు, ముసిలో భారీ ప్రవాహం
- ఐదు గంటలపాటు నిలిచిన రాకపోకలు

కొండపి, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): కొండపి మండలంలో అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం రాత్రి 7 గంటల నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. దీంతో కొండపి, మర్రిపూడి, జరుగుమల్లి, టంగుటూరు మండలాల్లోని వాగులు పొంగాయి. కొండపి మద్దులూరు మధ్యన ఉన్న అట్లేరు, ముసీ చప్టాలపై నుంచి నీరు ప్రవహించింది. ఈ మార్గంలో వాహనాల రాకపోలకు ఐదు గంటలపాటు అంతరాయం ఏర్పడింది. కొండపి, పెట్లూరు మార్గంలో తాటాకులపాలెం-చినకండ్లగుంట గ్రామాల మధ్యన వాగులో నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో ఈవైపు కూడా శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. కె.ఉప్పలపాడు-ఎం.నిడమలూరు గ్రామాల మధ్య ముసి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఎవరూ అటువైపు వెళ్లకుండా సీఐ సోమశేఖర్ బ్రిడ్జిపై అడ్డంగా కంప వేయించి పర్యవేక్షణకు పోలీసు సిబ్బందిని నియమించారు. చోడవరం వద్ద నల్లవాగుపై నిర్మించిన చప్టాపై నుంచి నీరు ప్రవహించింది. మిట్టపాలెం-పెరిదేపి గ్రామాల మధ్యన పెద్ద చెట్టు రోడ్డుకు అడ్డంగా కూలిపోవడంతో సమాచారం అందుకున్న కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్ ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగింప చేసి వాహన రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. కామేపల్లి-జరుగుమల్లి గ్రామాల మధ్యన వాగులు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో ఈమార్గంలో కూడా రాకపోకలకు కొన్ని గంటలపాటు అంతరాయం ఏర్పడింది. కొండపి మండలంలోని వాగుల వద్ద పరిస్థితిని తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, కొండపి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉన్నం రామ్మోహన్, రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షించారు. జరుగుమల్లి మండలంలోని వాగుల వద్ద ప్రమాద నివారణ చర్యలను తహసీల్దార్ పి.మురళి, తమశాఖ సిబ్బందితో పర్యవేక్షించారు. మధ్యాహ్నం నుంచి వాగుల్లో నీరు తగ్గుముఖం పట్టడంతో వాహన రాకపోకలు సాగాయి. కొండపి తహసీల్దార్ కార్యాలయంలో భారీ వేపచెట్టు కొమ్మ మొదలులో చీలి తహసీల్దార్ కారు నిలిపి ఉంచే రేకుల షెడ్డుపై పడింది. అయితే గురువారం రాత్రి కావడంతో ప్రమాదం తప్పింది. రేకుల షెడ్డు కూలిపోయింది.

నారుమడుల్లో చేరిన వర్షపు నీరు

అట్లేరు, ముసి పరివాహక ప్రాంతాల్లో సాగు చేసిన నారుమడులలోకి వర్షపు నీరు చేరింది. పెరిదేపి, కొండపి, అనకర్లపూడి, చోడవరం గ్రామాలలో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో నారు మడులు దెబ్బతింటాయని యజమానులు ఆందోళన చెందుతున్నారు.

లోతట్టు కాలనీలు జలమయం

టంగుటూరు(కొండపి): టంగుటూరు గ్రామ పంచాయతీలోని పలు కాలనీల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. కారుమంచి, ఆలకూరపాడు గ్రామాల్లోని కాలనీలు జలమయమయ్యాయి. టంగుటూరు గ్రామ పంచాయతీలోని వెస్ట్ కాలనీలోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరిందని, తక్షణమే మోటార్ల ద్వారా తొలగించాలని సీపీఐ నియోజకవర్గ నాయకుడు ప్రభాకర్‌రావు, కాలనీవాసులు శుక్రవారం తహసీల్దార్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

కొణిజేడు- మర్లపాడు రోడ్డులో కుంగిన బ్రిడ్జి

కొణిజేడు చెరువుకు నీరు అధికంగా చేరింది. దీంతో చెరువు నిండి, అలుగు ద్వారా నీరు ఉధృతంగా ప్రవహించడంతో కొణిజేడు-మర్లపాడు ఆర్అండ్‌బీ రోడ్డులో నిర్మించిన బ్రిడ్జి శుక్రవారం కుంగిపోయింది. దీంతో ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయాన్ని ఇరు గ్రామాల ప్రజలు మంత్రి స్వామి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే పరిశీలించాలని ఆయన అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

పొన్నలూరు మండలంలో..

పొన్నలూరు: భారీ వర్షాలతో మండలంలోని వాగులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామాల్లో రోడ్లపై వర్షపు నీరు చేరి కాలువలను తలపిస్తున్నాయి. మట్టిరోడ్లపై బురద, నీటి కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

పొగనారు తోటలకు నష్టం

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలో పొగనారు తోటలకు నష్టం వాటిల్లింది. లేత పొగనారు మడులు దెబ్బతిన్నాయి. ముదురు తోటల్లో నారు అమ్ముడుపోని పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది మండలంలో దాదాపు 300 ఎకరాల్లో నారుమడులు పెంచుతున్నారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ఎర్రనేలల్లో పదును ఎక్కువైంది. దుక్కి దున్ని పొగాకు నాట్లు వేసే సమయంలో వర్షాలు కురిశాయి. దీంతో ఎర్రనేలల్లో పొగనాట్లు ఆలస్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ కారణంగా పొగనారు కొనేవారు రావడంలేదని పెంపకందారులు చెబుతున్నారు. ఈ లోపు నారు ముదిరి పనికిరాకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కొండపి- పెరిదేపి గ్రామాల మధ్యన వాగును దాటుతున్న ప్రయాణికులు

బాధితుడికి ఆపన్నహస్తం



మంత్రి స్వామితో సుమంత్

సింగరాయకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ప్రమాదంలో చేయి కోల్పోయిన యువకుడికి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కృత్రిమ చేయి ఏర్పాటు చేయించి అండగా నిలిచారు. వివరాల్లోకెళ్తే.. మండలంలోని శానంపూడి గ్రామానికి చెందిన సత్యాల సుమంత్ 2024 డిసెంబరులో విద్యుదాఘాతానికి గురయ్యారు. ఆయన కుడిచేయి పూర్తిగా కాలిపోయింది. ఆ యువకుడు ఇటీవల మంత్రి స్వామిని కలిసి కృత్రిమ చేయి ఏర్పాటుకు సహాయం చేయాలని కోరారు. స్పందించిన మంత్రి వెంటనే మంగళగిరి రోటరీ క్లబ్ వారితో మాట్లాడారు. దీంతో క్లబ్ తరఫున సుమంత్‌కి కృత్రిమ చేయిని ఏర్పాటు చేయించారు. శుక్రవారం సుమంత్ టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో మంత్రి స్వామిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

కర్నూలు ప్రమాదంపై మంత్రి దిగ్భ్రాంతి

టంగుటూరు (కొండపి): కర్నూలు జిల్లాలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధం ఘటనపై రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బస్సు ప్రమాదంలో పలువురు చనిపోవడం తనను తీవ్రంగా కలిచివేసిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. శుక్రవారం కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్ దాచర్ల వెంకటరమణయ్య నాల్గవ డివిజన్‌లోని మస్టర్ పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాలలోనూ విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తగా కార్పొరేషన్ తరుపు నుంచి రెయిన్ కోట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే ప్రజల ఆరోగ్యం కోసం ప్రతి నిత్యం పనిచేస్తున్న కార్మికులు వ్యక్తిగత ఆరోగ్యంపైనా దృష్టి సారించాలన్నారు. అలాగే ప్రతి కార్మికుడు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీ భూపాల్‌రెడ్డి, డాక్టర్ వైష్ణవి పాల్గొన్నారు.

28న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు : వైసీపీ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్‌కాలేజీలను ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 28వ తేదీన నియోజకవర్గకేంద్రాల్లో నిరసన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, చుండూరి రవిబాబు, కసుకుర్తి అదెన్న, కేవీ.రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, బొట్లా రామారావు, లంకపోతు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో రోడ్లు జలమయం

మద్దిపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మద్దిపాడులోని పలు అంతర్గత రహదారులు జలమయం అయ్యాయి. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. మద్దిపాడు లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరి తీవ్ర అవస్థలు పడ్డారు. అలాగే కడియాల యానాదయ్య ఉన్నత పాఠశాలలో నీరు చేరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. డ్రైనేజీలో నీరు కూడా రోడ్లపైకి రావడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లింది. సీతారాంపురం హైవే పక్కన భారీగా వర్షపునీరు చేరింది.

నాలుగు గేట్లు ఎత్తివేత

ఎగువన భారీగా వర్షాలు కురవడంతో గుండ్లకమ్మ ప్రాజెక్టులోకి 9 క్యూసెక్కులు రాగా, నీటిని నాలుగు గేట్లు ద్వారా బయటకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. ప్రాజెక్టులో 23.90 మీటర్ల లెవెల్ నీరు నిల్వ ఉందన్నారు. పైనుంచి వరద నీరు వచ్చే కొద్దీ ఒకటి రెండు గేట్లు ఎత్తే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

పీజీ ఫలితాల్లో శ్రీహర్షిణి విద్యార్థుల సత్తా



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిధిలో జరిగిన పీజీ పరీక్షా ఫలితాల్లో ఒంగోలులోని శ్రీ హర్షిణి పీజీ కళాశాల విద్యార్థులు యూనివర్శిటీ స్థాయిలో విజయకేతనం ఎగురవేశారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విభాగంలో కొల్లి హేమ, సీహెచ్.మహిత 8.6/10తో ప్రథమ స్థానంలో నిలిచారు. 48 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 43మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్‌లో గుంటుపల్లి నాగరాణి 7.84, రావులపల్లి మౌనిక 7.63, ఎమ్మెస్సీ కంప్యూటర్‌లో కె.యామిని 8.9, కె. వెంకటకీర్తి 8.79శాతంతో ప్రథమ, ద్వితీయస్థానం సాధించారు. కంప్యూటర్స్ విభాగంలో 65మందికి 64మంది విద్యార్థులు ప్రథమశ్రేణిలో పాసయ్యారు. ఎమ్మెస్సీ గణితవిభాగంలో గోకతోటి పుష్పలత 8.76, తుళ్ళిబల్లి సంపత్ 8.6, అలాగే 30 మంది పరీక్షకు హాజరు కాగా 29మంది ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను చైర్మన్ గోరంట్ల రవికుమార్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గోరంట్ల కవిత, డీన్ ఆంజనేయులు, అధ్యాపకులు సుబ్బారావు, బాబు, సలోమన్, రవికాంత్‌రెడ్డి, క్యాంపస్ ఇన్‌చార్జి ప్రతాప్, దిలీష్, శివకుమార్ పాల్గొన్నారు.

క్విస్‌లో వర్క్‌షాప్ ప్రారంభం



ఎంవోయూ పత్రాలను అందుకుంటున్న నిర్వాహకులు

ఒంగోలు విద్య, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మెకానికల్, సివిల్ విభాగం ఆధ్వర్యంలో నాన్ డిస్ట్రక్టివ్‌టెస్టింగ్ టెక్నాలజీ(ఎన్‌డీటీ) టెక్నాలజీపై రెండు రోజుల వర్క్‌షాపు ప్రారంభమైంది. ఈ సందర్భంగా పుదుచ్చేరికి చెందిన శ్రీసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎన్‌డీటీఅండ్ ఇన్‌స్పెక్షన్ సర్వీసెస్ సంస్థ ప్రతినిధి అబుల్ కలామ్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. శ్రీసాయి ఇన్‌స్టిట్యూట్, క్విస్ ఇంజనీరింగ్ కళాశాలల మధ్య వివిధ అంశాలపై అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఎంవోయూ ద్వారా విద్యార్థుల నైపుణ్యాల అభివృద్ధి పెంపునకు దోహదపడుతుందని క్విస్ విద్యా సంస్థల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, వైస్‌చైర్మన్ శ్రీగాయత్రిదేవి తెలిపారు. ప్రిన్సిపాల్ హనుమంతరావు, డీన్ సత్యమోహన్, భార్గవ్, హెచ్‌వోడీలు సమీర్‌కుమార్, జయకృష్ణ, నవనీత్‌కృష్ణన్ పాల్గొన్నారు.

2న కళామిత్ర మండలి వార్షికోత్సవం

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కళామిత్ర మండలి వార్షికోత్సవం, అదేవిధంగా మండలి వెంకటకృష్ణారావు శతజయంతి వేడుకలు నవంబరు 2వ తేదీన ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరుగుతాయని సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఒంగోలులో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం అంకమ్మరావు మాట్లాడుతూమాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణకు నూనె వెంకాయమ్మ వెంకటరత్నం స్మారక జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేయటంతోపాటు తొమ్మిదిమందికి కళామిత్ర ప్రతిభా పురస్కారాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తేళ్ల అరుణ, నాగభైరవ ఆదినారాయణ, నాళం నరసమ్మ, బీరం అరుణ, యూవీ.రత్నం తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాలపాడు గ్రామాభివృద్ధికి కృషి

నాగులుప్పలపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్దిరాలపాడు గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ప్రవాస భారతీయులు నెప్పల సుబ్బారాయుడు, శారద దంపతులు పేర్కొన్నారు. విదేశాల నుంచి స్వగ్రామం మద్దిరాలపాడుకు వచ్చిన వారికి స్థానిక నెప్పలకాలనీవాసులు బత్తుల ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఎన్నారైలు నెప్పల సుబ్బారాయుడు శారద దంపతులు తమ ట్రస్టు ద్వారా 126 ఎస్సీ కుటుంబాలకు స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు నిర్మించి ఇచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో ఎరమాల నాగేశ్వరరావు, బరకం వెంకటేశ్వర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సీసీఎస్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

ఒంగోలు క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ వి.హర్షవర్ధనరాజు శుక్రవారం తనిఖీ చేశారు. అక్కడ రికార్డులు పరిశీలించారు. అదేవిధంగా సిబ్బంది విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీసీఎస్ సీఐ జగదీష్, ఎస్ఐ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మిరప పొలాల్లో వర్షపు నీటిని తొలగించాలి

నాగులుప్పలపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మిరప పొలాల్లో ఉన్న వర్షపు నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని ఉద్యానశాఖ ఏవో డి.సంధ్య సూచించారు. శుక్రవారం చదలవాడ, పోతవరం గ్రామాల్లో సాగు చేసిన మిరప పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షం తగ్గిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. ఆమె వెంట సిబ్బంది నిఖిల్, ప్రగతి, రైతులు ఉన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు



ముదిగొండవాగు వద్ద కాపలా ఉన్న పోలీసులు



చిలకపాడులో ఇనగలేరు వద్ద..



కొత్తకోట వాగును పరిశీలిస్తున్న అధికారులు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- సహాయక చర్యల్లో అధికారులు

సంతనూతలపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా చిలకపాడు, మద్దులూరు, మాచవరం, వేములపాడు, ఎనికపాడు, గుమ్మళంపాడు మధ్యలో ప్రవహించే ఇనగలేరు వాగు గత మూడు రోజులుగా జోరుగా ప్రవహిసుండంతో శుక్రవారం ఎంపీడీవో డి.సురేష్‌బాబు పరిశీలించారు. వాగు ఉధృతి తగ్గేవరకు వాహనదారులు ఎవరూ వెళ్లకుండా కాపలా ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఒంగోలు-మంగమూరు మధ్యన ఉన్న నల్లవాగు ఉధృతి కూడా తగ్గకపోవడంతో ఎస్ఐ అజయ్‌బాబు, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రజలను అప్రమత్తం చేసి గస్తీ ఏర్పాటు చేశారు.

ఇక సంతనూతలపాడులోని త్రిపురాంతకస్వామి ఆలయం సమీపంలోని పెద్ద చెరువు అలుగు పొంగి పారుతోంది. ఆలయం లోపలి ప్రాంగణం అంతా వర్షపునీటితో నిండిపోయింది. దీంతో కార్తీక మాసం సందర్భంగా జరిగే పూజలు ఆగిపోయాయి. గర్భగుడిలోనూ నీటిఊటతో నిండిపోయింది. ఆలయం ఈవో నారాయణరెడ్డి మోటార్ల ద్వారా వర్షపునీటిని బయటకు వెళ్లగొట్టారు. దీంతో కార్తీక మాస పూజలు ఆగిపోవడంతో, ఆలయం వద్దకు వచ్చిన భక్తులు తీవ్ర నిరాశతో ఇళ్లకు వెనుదిరిగారు.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: మండల పరిధిలో గత వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షం ధాటికి వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. నాగులుప్పలపాడు-తిమ్మనపాలెం రహదారిలోని కొత్తకోట, హనుమాపురం వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో శుక్రవారం ఆ దారిలో ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందిపడ్డారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి జోసఫ్‌కుమార్, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆయా వాగులను పరిశీలించారు. చదలవాడ రామన్న చెరువుకట్ట దెబ్బతిన్న ప్రాంతంలో చెరువులోని నీరు జాతీయ రహదారిపైకి చేరాయి. దీంతో ప్రత్యేకాధికారి జోసఫ్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్ఐ రజియాసుల్తానా, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో రవికుమార్ పరిశీలించారు. చెరువు నీటిని రెండు ప్రాంతాల్లో ఎక్స్‌కవేటర్‌తో మళ్లించే పనులను పర్యవేక్షించారు. ఇక నాగులుప్పలపాడు తహసీల్దార్ కార్యాలయం ముందు వర్షపు నీరు చేరింది. ప్రత్యేకాధికారి జోసఫ్‌కుమార్ మండల కార్యాలయంలో స్థానిక అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్థానిక ఇంకొల్లురోడ్డులోని ఎస్టీ కాలనీలోకి వరదనీరు చేరడంతో స్థానికులను జడ్పీ హైస్కూల్‌లోని పునరావాస కేంద్రానికి తరలించారు. ఉప్పుగుండూరు-మాచవరం గ్రామాల మధ్య ఉన్న పొలాల్లోకి వరదనీరు చేరి చెరువులా తలపిస్తున్నాయి. మండల పరిధిలో సాగు చేసిన మిరప, మినుము పొలాల్లోకి వర్షపు నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముదిగొండ వాగు వద్ద పహరా

ఒంగోలు(రూరల్): గుత్తికొండవారిపాలెం దగ్గర గల ముదిగొండి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో శుక్రవారం రాకపోకలు నిలిచిపోయాయి. ఉన్నతాధికారులు ముదిగొండి చప్టా వద్ద పోలీసులను కాపలా ఉంచారు. కాగా రూరల్ తహసీల్దార్ వాగును పరిశీలించారు. ఆయన వెంటన ఆర్ఐ శ్రీనివాసరావు, డీటీ అశోక్ ఉన్నారు.

కొత్తపట్నంలో నీట మునిగిన పంటలు



మాట్లాడుతున్న డీఏవో శ్రీనివాసరావు

కొత్తపట్నం: భారీ వర్షాలకు రైతులు కోలుకోలేని దెబ్బతిన్నారు. పంటలు చేతికి అందే సమయంలో కురుస్తున్న వర్షాలు రైతులను నిలువునా ముంచేశాయి. కొత్తపట్నం మండలంలో సాగులో ఉన్న వేరుశనగ, వరి, చేమ, కూరగాయలు, ఆకు కూరలు వర్షపు నీటిలో మునిగిపోయాయి. కొత్తపట్నం పల్లెపాలెంలో వేరుశనగ పంట కోత దశకు రాగా రేపోమాపో పీకుదామని అనుకుంటుండగా వర్షాల దెబ్బకు పొలాల్లో మోకాలు లోతులో నీరు ఉండిపోయింది. ఇక అల్లూరు ప్రాంతంలో వరి పైర్లు వర్షం నీటిలోనే మునిగి పోయి ఉన్నాయి. తీర ప్రాంతంలోని ఇసుక భూముల్లో కూరగాయలు, ఆకుకూరల సాగు కూడా పూర్తిగా దెబ్బతిని పోయింది. చేమదుంపల పంట కూడా పలు గ్రామాల్లో నీటి మునిగిపోయింది. కాగా కె.పల్లెంపాలెంకు పోయే బీచ్ రహదారి మొ త్తం నీటితో నిండిపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఎస్టీ, ఎస్టీకాలనీలవాసులు తిండికి అవస్థలు పడుతున్నారు.

పొలాలను పరిశీలించిన అధికారులు

మండలంలో నీట మునిగిన పంట పొలాలను శుక్రవారం డీఏవో శ్రీనివాసరావు, ఏవో కిషోర్‌బాబు పరిశీలించారు. నీట మునగిన వేరుశనగ, వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఏపీఎంఐపీ పీడీ సీహెచ్.శ్రీనివాసులు, జిల్లా ఉద్యానశాఖ అధికారి గోపీచంద్ ఈతముక్కల, రాజుపాలెం గ్రామాల్లో పర్యటించారు. దెబ్బతిన్న పూలసాగు, ఇతర పంటలను పరిశీలించారు.

గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ కమిటీ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒంగోలులోని గోల్డ్‌మర్చంట్స్ అసోసియేషన్ హాలులో శుక్రవారం రాత్రి జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిరిగి తాతా ప్రసాద్ మరోసారి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా పేర్ల రమేష్, కోశాధికారిగా బొమ్మిశెట్టి శంకర్, గౌరవాధ్యక్షులుగా వేమూరి సూర్యనారాయణలను, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు.



అధ్యక్షుడు ప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఆహార పొట్లాల పంపిణీ

కొత్తపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొత్తపట్నంలోని గంగమ్మకాలనీ వాసులకు శుక్రవారం రాత్రి ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో కాలనీలోని ఎస్టీ కుటుంబాలు ఆహారం కోసం పడుతున్న ఇబ్బందులను గుర్తించిన చర్చి ఫాస్టర్లు ఆహార పొట్లాలను సమకూర్చారు. వీటిని ఎస్ఐ వేముల సుధాకర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. మోటుమాల పాస్టర్ సర్వేపల్లి శామ్యూల్, కొత్తపట్నం పాస్టర్ విజేంద్రబాబు, పాదర్తి పాస్టర్ సురేష్ పేదలి ఆకలి తీర్చేందుకు ప్రయత్నించటం అభినందనీయమని ఎస్ఐ సుధాకర్ కొనియాడారు.







అవీ..ఇవీ



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి ఓంకార్

మంచి ప్రవర్తనను అలవరచుకోవాలి

● జూనియర్ సివిల్ న్యాయాధికారి ఓంకార్

గిద్దలూరు టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మంచి ప్రవర్తన అలవాటు చేసుకోవడం వలన భవిష్యత్తు బాగుంటుందని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సబ్ జైలును ఆయనతో పాటు అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.భరత్ చంద్ర తనిఖీ చేశారు. అనంతరం సబ్ జైలులో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో వారు పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా న్యాయాధికారి ఓంకార్ మాట్లాడుతూ అడవిలో జంతువులను వేటాడం, చంపడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కె.రవిప్రకాశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్మించాలి

● బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

మార్కాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్మించాలని, ప్రైవేటుకు అప్పజెప్పే చర్యలను మానుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జానకి ప్రసాద్ డిమాండ్ చేశారు. బీఎస్పీ ఆధ్వర్యంలో దళిత, ప్రజా సంఘాలతో కలిసి ముందుగా స్థానిక కోర్టు సెంటర్ నుంచి నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ఆందోళన నిర్వహించారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 590ని వెంటనే రద్దు చేయాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని కార్యాలయ ఏవో రవీంద్రారెడ్డికి అందించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ కె.పుష్పాంజలి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సమాఖ్య నాయకులు చింతగుంట్ల బాబు, నూతలపాటి రాజు, బూదాల కాశయ్య, ఎనిబెర జానీ, రాచేటి ప్రసాద్, బోయలపల్లి దాసు తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరపి లేని వర్షాలు

కంభం, అర్ధవీడు మండలాల్లో ప్రవహిస్తున్న వాగులు

పలు గ్రామాల మధ్య నిలిచిపోయిన రాకపోకలు



కంభం మండలం రావిపాడు బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో పహరాలో పోలీసులు

కంభం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) :కురుస్తున్న భారీ వర్షాలకు కంభం, అర్ధవీడు మండలాలలోని పలు వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా కంభం మండలంలోని ఎర్రబాలెం, రావిపాడు గ్రామాల బ్రిడ్జిల మీదుగా నాలుగు అడుగులకు పైగా గుండ్లకమ్మ వాగు ప్రవహించడంతో గిద్దలూరు, కంభం మండల ప్రజలు ఎర్రబాలెం మీదుగా అర్ధవీడు మండలంలోని నాగులవరం, బోగోలు, మొహిద్దీన్‌పురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

అలాగే రావిపాడు బ్రిడ్జిపై నుంచి గురువారం అర్ధరాత్రి నుంచి గుండ్లకమ్మ వాగు ప్రవహిస్తుండడంతో కంభం, రావిపాడు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కంభం మండలం పెద్ద నల్లకాల్వ గ్రామ సమీపంలో గిద్దలూరు నుంచి తురిమెళ్ళ మీదుగా కంభంకు వెళ్ళే ప్రధాన రహదారిపై నిర్మించిన బ్రిడ్జిపై నుంచి నల్లవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పోలీసులు వాహనాలను నిలిపివేశారు. ఎర్రబాలెం, రావిపాడు, పెద్దనల్లకాల్వ బ్రిడ్జీలను పరిశీలించిన కంభం ఎస్సై నరసింహారావు వాహనాలు, ప్రజలు బ్రిడ్జీలు దాటకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. వర్షాలు ఉధృతంగా పడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లలో నుంచి బయటకు రావద్దని, అత్యవసరమైతేనే బయటకు వచ్చి పనులు ముగించుకుని త్వరగా వెళ్లాలని సూచించారు.



కంభంలో వరద నీటిలో ఉన్న వరిచేను

వాగులన్నీ కంభం చెరువు వైపు

కాగా ఎర్రబాలెం గుండ్లకమ్మ, అర్ధవీడులోని జంపలేరు, నల్లవాగు అన్నీ ఉధృతంగా ప్రవహిస్తూ కంభం చెరువులో కలుస్తుండడంతో రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వరిపంట నీట మునక

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు ఉప్పొంగడంతో కంభం మండలంలో 50ఎకరాలకు పైగా వరి పంట నీటమునిగిందని కంభం మండల వ్యవసాయ అధికారి షేక్ మహమ్మద్ తెలిపారు. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. వర్షాలు ఆగి వాగులు ఉధృతి తగ్గితే వరి పంటలో నిలిచిన నీటిని బయటకు పంపే మార్గాలను రైతులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ వర్షాలు మరో రెండు రోజులు ఇలాగే కొనసాగితే పంట నష్టం పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

రాచర్ల: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గురువారం రాత్రి కురిసిన వర్షానికి చోళవీడు వద్ద గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా సోమిదేవిపల్లి సమీపంలోని పగిడి వాగు ఉగ్రరూపం దాల్చింది. భారీ వర్షాలతో పత్తి, కంది, పొగాకు వంటి పంట పొలాలు నీట మునిగాయి. సోమిదేవిపల్లి గ్రామ సచివాలయం జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో సచివాలయ సిబ్బంది విధులకు తీవ్ర ఆటంకం కలిగింది. సత్యవోలు సచివాలయ పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. పురాతన అద్దె భవనం కావడం వలన స్లాబ్ నుంచి వర్షపు నీరంతా కార్యాలయాన్ని తడిపివేసింది. సచివాలయ ఫర్నిచర్ కంప్యూటర్లు నీటిలో తడవకుండా ఒక టేబుల్‌పై పెట్టి తీవ్ర ఇబ్బందులతో సిబ్బంది విధులు నిర్వహించారు. ఎప్పుడు వర్షాలు పడినా మా పరిస్థితి ఇంతేనని సచివాలయ సిబ్బంది వాపోయారు. ఎడవల్లి గ్రామ సమీపంలో గోవిందప్ప వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. ప్రస్తుతం రామాపురం, మేడంవారిపల్లి, ఒద్దులవాగుపల్లి గ్రామాల్లో దాదాపు 250 హెక్టార్ల పత్తి పంట నీట మునిగింది.

దెబ్బతిన్న పంటల పరిశీలన

కొనకనమిట్ల : వర్షాలకు దెబ్బతిన్న పంటలను శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు పరిశీలించారు. మండలంలోని మునగపాడు, వెలిగండ్ల, నాగరాజుకుంట తదితర గ్రామాలలో మినుము, బొబ్బర, పత్తి పంటలను ఆయన పరిశీలించారు. కురుస్తున్న వర్షాలతో పత్తి, మినుము, బొబ్బర్లు తదితర పంటలు దెబ్బతిన్నాయని రైతులు శ్రీనివాసరావు దృష్టికి తీసుకొచ్చారు. మునగపాడు గ్రామంలో దెబ్బతిన్న పత్తిపంటను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ప్రకాష్‌రావు, వ్యవసాయ విస్తరణ అధికారి విక్రమ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



చోళవీడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ వాగు

జేపీచెరువులో కూలిన మట్టిమిద్దె

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ప్రభావంతో మండలంలోని జేపీచెరువు గ్రామానికి చెందిన కాకర్ల శేషయ్య మట్టి మిద్దె గురువారం రాత్రి కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వలన మిద్దె బాగా నాని పడిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు.



జేపీ చెరువులో వర్షాలకు నాని కూలిన మట్టిమిద్దె

నిండిన కడపరాజుపల్లె చెరువు

● మునిగిన తిమ్మాపురం పంట పొలాలు

పెద్ద దోర్నాల : మూడు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షానికి మండలంలోని నీటి వనరులన్నీ జలకళను సంతరించుకున్నాయి. శుక్రవారం కడపరాజుపల్లె చెరువు నిండి అలుగు ద్వారా వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో కడపరాజుపల్లె, తిమ్మాపురం గ్రామాలకు చెందిన పంట పొలాలు నీట మునిగాయి. ఈ వరదనీరు పొలాల గుండా ప్రవహిస్తూ ఎర్రవాగుకు చేరడంతో ఎన్నడూ లేనంతగా పొంగి ప్రవహిస్తోంది. దీంతో అరటి, మిరప, పత్తి పైర్లు నీట మునిగాయి. కడపరాజుపల్లెలో సుమారు యాభై ఎకరాలు, తిమ్మాపురంలో వంద ఎకరాలకు పైగా మిర్చి నీట మునిగింది. వరద ప్రవాహం చూస్తుంటే ఎప్పటికి తగ్గుతుందో చెప్పలేని పరిస్థితి కనబడుతోందని బాధిత రైతులు తెలిపారు.

మొక్కజొన్న పంట పరిశీలన

మండలంలోని నల్లగుంట్ల గ్రామంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను ఏవో జవహర్ లాల్ నాయక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కోత దశలో ఉన్న పంటను, కల్లాల్లో ఆర బోసిన కంకులను ఆయన పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వానలు పూర్తిగా తగ్గిన తర్వాత కోతలు చేయాలని, ఆరబోతలో తీసుకోవాలసిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.

కంభంకు రాకపోకలు బంద్

తర్లుపాడు: బొడిచర్ల వద్ద ఉన్న గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహించటంతో కంభం వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. తర్లుపాడు నుంచి కంభం వెళ్లే రహదారిలో ఈ గుండ్లకమ్మ వాగు ఉంది. ఈ రహదారి గుండా బొడిచర్ల, బొందలపాడు, సూరెపల్లె గుండా కంభం వరకు వాహనదారులు రాకపోకలు సాగిస్తారు. బస్సులు కూడా నిలిచిపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుండ్లకమ్మ వద్ద పోలీసులు పహరా కాస్తున్నారు.



దోర్నాలలో పొంగి ప్రవహిస్తున్న ఎర్రవాగు



భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు

చెరువులకు చేరిన వరద నీరు

క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు



నికరంపల్లి వద్ద భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి సబ్ కలెక్టర్, తహసీల్దార్, ఏడీఏ, అధికారులు

మార్కాపురం రూరల్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు మండలంలో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. గుండ్లకమ్మ నదికి వరద నీరు వస్తుండటంతో మండలంలోని భూపతిపల్లి, మాల్యవంతులనిపాడు, పెద్దనాగులవరం, వేమలకోట గ్రామాల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు, పోలీసులు ప్రజలను అప్రమత్తం చేశారు. వాహనాలు, ప్రజల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. కోలభీమునిపాడు, తిప్పాయపాలెం, బోడపాడు, వేమలకోటతో పాటు గ్రామాలలో చెరువులను నీరు చేరింది.

దెబ్బతిన్న పంటల పరిశీలన

మండలంలోని నికరంపల్లి, వేమలకోట గ్రామాల పరిధిలో వర్షానికి దెబ్బతిన్న పంటలను ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, తహసీల్దార్ చిరంజీవి, వ్యవసాయ శాఖ ఏడీఏ బాలాజీనాయక్‌లు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. పత్తి పంటలో నిలిచిన వర్షపు నీటిని ఎక్స్‌కవేటర్‌తో తొలగింపజేశారు.

తెగిన కట్టకు మరమ్మతులు చేయిస్తాం

రాచర్ల : తెగిన ఎర్రగుంట కట్టకు త్వరలో మరమ్మతులు చేయిస్తామని మండల తహసీల్దార్ ఎల్. వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ఎస్. వెంకట రామిరెడ్డి అన్నారు. భారీ వర్షాల కారణంగా వర్షపు నీరు కుంటకు చేరి కట్ట నీటి ప్రవవాహానికి గురై తెగిపోవడంతో శుక్రవారం వారు పరిశీలించారు. కట్ట బలంగా లేకపోవడంతో నీటి ప్రవాహం ఉధృతి అధికమై తెగిపోయిందని వారన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో మరమ్మతులు చేపడతామని వారు రైతులకు తెలిపారు. గిద్దలూరు ఇరిగేషన్ అధికారి రామారావు వారి సిబ్బంది ఆకవీడు, చిన్నగానిపల్లి, ఎడవల్లి, గుడిమెట్ట, పాలకవీడు తదితర గ్రామాలకు సంబంధించిన చెరువులను, వాటి తూములను పరిశీలించారు.



తెగిన ఎర్రకుంట కట్టను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

పంటల పరిశీలన

పొదిలి: మండలంలోని మాదారిరెడ్డిపాలెంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ శ్రీనివాసరావు శుక్రవారం కంది, సజ్జపంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న సజ్జ, కంది పంటలను పరిశీలించారు. వర్షం తగ్గిన వెంటనే నష్టం అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు చెప్పారు.

పంట పొలాల్లో నీరు లేకుండా చూసుకోవాలి

ఎర్రగొండపాలెం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు సాగు చేసిన పంట పొలాల్లో నీటి తడులు లేకుండా చూసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి ఆదిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బోయలపల్లి, గురిజేపల్లిలో సాగు చేసిన ఉల్లి, పత్తి, బొప్పాయి ఇతర పంటలను ఆయన పరిశీలించారు.

రంగనాయకస్వామి ఆలయంలో నేడు ప్రత్యేక పూజలు బంద్

రాచర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానంలో శనివారం జరగవలసిన ప్రత్యేక పూజలు నిలిపివేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య శుక్రవారం తెలిపారు. వర్షాల వలన రంగస్వామి గుండానికి వరద నీరు ఉధృతంగా చేరుతుందని, తద్వారా ఆలయంలోని రోడ్డుపై వంతెనల వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున, దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందుల దృష్ట్యా ప్రత్యేక పూజలు నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు, భక్తులు సహకరించాలని ఆయన కోరారు.

శివారు కాలనీలలో కమిషనర్ పర్యటన

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పట్టణంలోని శివారు కాలనీలో కమిషనర్ డీవీఎస్ నారాయణరావు శుక్రవారం పర్యటించారు. సుందరయ్య కాలనీలో రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని మళ్లించాలని, రోడ్లపక్కన ఉన్న చిల్ల చెట్లు తొలగించాలని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులకు ఆదేశాలు జారీ చేశారు.

జగదాంబకు శుక్రవారం పూజలు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని మార్కాపురంలోని శ్రీ జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆంజనేయ శర్మ, వరుణ్‌తేజ శర్మలు జగదాంబ, మార్కండేశ్వర స్వాములకు అభిషేకాలు, అర్చనలు, అలంకరణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో జగదాంబ



ఉధృతంగా ప్రవహిస్తున్న సగిలేరు, ఎనుమలేరు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం సామాన్య జనాన్ని అతలాకుతలం చేస్తోంది. గిద్దలూరు ప్రాంతంలో ఓ మోస్తరు నుంచి భారీగా వర్షాలు పడుతున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం అంతా ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. కంది, పత్తి, మిరప, టమోటా పంటలలో వర్షం నీరు చేరి దిగుబడులపై తీవ్ర ప్రభావం పడేటట్లుగా కనపడుతోంది. ఇంకా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంటుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గిద్దలూరు ప్రాంతం నుంచి ప్రవహించే సగిలేరు, ఎనుమలేరు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొండపేట సమీపంలోని ఎన్టీఆర్ కాలనీకి వెళ్లేందుకు సగిలేరువాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిపివేశారు.

గలిజేరుగుళ్ల చెరువుకు గండి

● చెన్నుపల్లె గ్రామానికి రాకపోకలు బంద్

బేస్తవారపేట,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): వర్షాలకు బేస్తవారపేట మండలంలో పలు కుంటలు,చెరువులకు నీరు పుష్కలంగా చేరింది.కోనపల్లె ఆటవీ ప్రాంతంలో కురిసిన వర్షాలు గలిజేరుగుళ్ల చెరువుకు నీరు చేరి గండి పడింది.దీంతో సమీప నేరెళ్లవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. చెన్నుపల్లె గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. గలిజేరుగుళ్ళ, చెన్నుపల్లె, పీవీపురం, జెన్నివారిపల్లె గ్రామాలకు చెందిన రైతులు సాగు చేసిన మొక్కజొన్న, కంది, సజ్జ పంటలు నీట మునిగాయి.వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు మార్కాపురం వెలిగొండ ప్రాజెక్టు సబ్ కలెక్టర్ ఎం.వెంకట శివరామిరెడ్డి, తహసీల్దార్ జితేంద్ర, ఎంపీడీవో రంగనాయకులు,ఇరిగేషన్ అధికారులు ఆ గ్రామాలను సందర్శించి ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

రాచర్ల: పత్తి, వరి, పొగాకు రైతులు పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా అన్నారు. శుక్రవారం ఆయన మేడంవారిపల్లి, రామాపురం గ్రామాల్లో పత్తి పంటను పరిశీలించారు. పంటపొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తులకు 100 రోజుల జైలుశిక్ష

గిద్దలూరు టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తులకు గిద్దలూరు కోర్టు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చింది. కంభం, బేస్తవారపేట పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని గుర్తించి పోలీసులు గిద్దలూరు కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయాధికారి భరత్‌చంద్ర వారికి శిక్ష ఖరారు చేశారు. కంభం మండలంలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి 100 రోజులు (3నెలల 10 రోజులు) జైలు శిక్ష విధించారు. అంతేకాకుండా ఒక్కొక్కరికి రూ.15వేలు జరిమానా విధించారు. మరొకరికి 60 రోజుల జైలు శిక్ష, రూ.15వేలు జరిమానా విధించారు. మరో ముగ్గురికి ఒక్కొక్కరికి రూ. 10వేలు జరిమానాతోపాటు ఒకరికి 22 రోజులు, మరొకరికి 15 రోజులు, ఇంకొకరికి 19 రోజులు జైలు శిక్ష విధించారు. బేస్తవారపేట మండలంలో మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరికి 22 రోజుల పాటు జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 10వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి

త్రిపురాంతకం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా త్రిపురాంతకం శ్రీ బాల త్రిపురసుందరీదేవి అమ్మవారిని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలి

పెద్ద దోర్నాల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వాన్ని కోరింది. టీఎన్‌యూఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మార్కాపురం డివిజన్ టీఎన్‌యూఎస్ అధ్యక్షుడు రెహమాన్ మాట్లాడుతూ ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ చూపి సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

మద్యం అధిక ధరలకు అమ్మితే చర్యలు

రాచర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మద్యం షాపుల్లో మద్యం అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని గిద్దలూరు ఎక్సైజ్ సీఐ జయరావు అన్నారు. రాచర్ల, అనుములపల్లి గ్రామాల్లోని వెంకటేశ్వర శ్రీ కృష్ణ బ్రాందీ షాపులను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. షాపుల్లో ఉన్న మద్యం, వాటి వివరాలు నిర్వహణ అడిగి తెలుసుకున్నారు.

బ్రిడ్జికి తాత్కాలిక మరమ్మతులు చేపడతాం

పెద్ద దోర్నాల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):గ్రామానికి ప్రజలు రాకపోకలు సాగించేందుకు బ్రిడ్జికి తాత్కాలిక మరమ్మతులు చేపడతామని పంచాయతీ రాజ్ ఈఈ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.మండలంలోని గంటవానిపల్లె గ్రామం వద్ద ఉన్న చిన్నపాటి బ్రిడ్జి తీగలేరు వరదనీటి ఉధృతికి దెబ్బతిన్న నేపథ్యంలో శుక్రవారం బ్రిడ్జిని పరిశీలించారు. రూ. 5లక్షల నిధులతో త్వరలోనే మరమ్మతులు చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీఈ ప్రసాద్, ఏఈ సుబ్బారెడ్డి,వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వీడని వర్షం

- దెబ్బతింటున్న పంటలు
- ఆందోళన చెందుతున్న రైతులు



వెలిగండ్ల: రాళ్ళపల్లి వాగు వద్ద గస్తీ నిర్వహిస్తున్న ఎస్ఐ కృష్ణపావని



దర్శి: వర్షానికి రంగుమారిన పత్తికాయలు

దర్శి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతింటున్నాయి. భారీ నష్టం సంభవించే పరిస్థితి నెలకొననుండటంతో ఏం చేయాలో పాలుపోక రైతులు అల్లాడుతున్నారు. దర్శి ప్రాంతంలో సాగు చేసిన పత్తి కాయలు కాస్తున్నాయి. పత్తి బయటకు తీసే సమయంలో ఎడతెరపి లేని వర్షం కురవటంతో తడిసి రంగు మారుతుంది. పత్తి తోటలు అధికవర్షానికి ఉరకెత్తిపోతున్నాయి. అలాగే, లేత పొగతోటలు కూడా దెబ్బతింటున్నాయి. వర్షం ఇంతటితో ఆగకుంటే బొప్పాయి, మొక్కజొన్న, కంది పంటలు కూడా దెబ్బతిని భారీ నష్టం సంభవించే ప్రమాదముంది. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన దానిమ్మ తోటలు కూడా దెబ్బతింటున్నాయి. కాయలకు వైరస్ తెగుళ్ల సోకుతున్నాయి. అన్నిరకాల పంటలు దెబ్బతింటుండటంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు

భారీ వర్షానికి దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు శుక్రవారం పరిశీలించారు. మండలంలోని బసిరెడ్డిపల్లి, చందలూరు గ్రామాల్లో సాగుచేసిన పత్తి, మొక్కజొన్న, మిరప, కంది పంటలను వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధానాధికారి డాక్టర్ పి.సంధ్యారాణి, ఏడీఏ బాలాజీనాయక్, ఏవో కె.రాధ తదితరులు పరిశీలించారు. పంటల పరిస్థితిని అంచనా వేశారు. నష్టాన్ని తగ్గించేందుకు పలు సూచనలు చేశారు. వర్షపునీరు పొలాల్లో నిల్వ ఉండకుండా బయటకు పంపాలని సూచించారు. మొక్కలు అధిక తేమకు ఎర్రబడి ఎండిపోయే ప్రమాద ఉన్నందున యూరియా లేదా పోటాషియం ఎరువులు వేసుకోవాలని సూచించారు. నైట్రేట్, మెగ్నీషియం, సల్ఫేట్ మందులను పిచకారి చేయాలని తెలిపారు. తేమశాతం అధికంగా ఉన్నందున పైర్లకు తెగుళ్ల సోకే అవకాశం ఉన్నందున సూచించిన మందులను పిచకారీ చేసుకొని పంటలను కాపాడుకోవాలని కోరారు.



దర్శి: బసిరెడ్డిపల్లిలో తడిచిన పత్తిని పరిశీలిస్తున్న వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధానాధికారి డాక్టర్ సంధ్యారాణి, ఏడీఏ బాలాజీనాయక్

దెబ్బతిన్న మెట్ట పైర్లు

కురిచేడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని మెట్టపైర్లు దెబ్బతిన్నాయి. ప్రధానంగా పత్తి పంట ఎక్కువగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని దేకనకొండ గ్రామాన్ని గురువారం సాయంత్రం జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు పరిశీలించి రైతులతో మాట్లాడారు. అధిక వర్షాలకు పొలాల్లో నీరు నిలవడంతో పాటు పత్తి కాయలు కుళ్ళిపోయాయని రైతులు తెలిపారు. కాయల నుంచి బయటకు వచ్చిన పత్తి నల్లగా మారిందని వ్యవసాయాధికారికి చూపారు. దేకనకొండ గ్రామంలో సాగుచేసిన 400 ఎకరాలలో పత్తి దెబ్బతిని నష్టపోయినట్లు రైతులు తెలిపారు. ఈసందర్భంగా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు రైతులకు పలు సూచనలు చేశారు. పొలాల్లో నిలచిన వర్షపు నీటిని చిన్న కాలువల ద్వారా బయటకు పంపాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటించి పంటలు కాపాడుకోవాలన్నారు. ఆయనవెంట మండల వ్యవసాయాధికారి సంపత్‌కుమార్ ఉన్నారు.



కురిచేడు: కుళ్లిపోయిన పత్తి కాయలను జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావుకు చూపుతున్న దేకనకొండ గ్రామస్థులు

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

వెలిగండ్ల, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పందువగండి చెరువు, రాళ్ళపల్లి, నాగులవరం, గోకులం ప్రాంతాలల్లో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తహసీల్దార్ ఎన్.వాసు, ఎస్ఐ కృష్ణపావని ముందుజాగ్రత్తగా చప్టాల వద్ద సిబ్బందిని కాపలా ఉంచారు. ఈవర్షాలకు మెట్ట పొలాల్లో వర్షం నీరు నిలబడటంతో పైర్లు ఉరకెత్తుతున్నాయి కంది పంట, సజ్జ పంట, పొగాకు నారుమళ్ల దెబ్బతిన్నాయి. మండలంలోని మరపగుంట్ల గ్రామానికి చెందిన మత్తిరెడ్డి శ్రీను 25 ఎకరాల్లో బొప్పాయి, 18 ఎకరాల్లో నల్ల పుచ్చ సాగు చేశారు. పంట కోత దశకు వచ్చేదశలో ఈవర్షానికి పంట మొత్తం దెబ్బతింది. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన వేడుకుంటున్నారు. వర్షాలకు గోకులం గ్రామంలో నాగిరెడ్డికి చెందిన ఇంటి గోడ శుక్రవారం ఉదయం కూలిపోయింది. ఆసమయంలో పరిసర ప్రాంతాల్లో ఎవరూలేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇంటి యజమాని ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు.

మండలంలోని పూలికుంట్ల రాళ్ళపల్లి, మోటుపల్లి, వెలిగండ్ల, మొగళ్ళూరు గ్రామాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న సజ్జ పంటను శుక్రవారం కనిగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు జైనులాబ్దిన్ పరిశీలించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 840 హెక్టర్లలో సజ్జ పైరు దెబ్బతిందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి టి.శిల్పా, టీడీపీ మండల అధ్యక్షుడు ఇంద్రభూపాల్‌రెడ్డి, కేసరి రమణారెడ్డి, మీనిగ కాశయ్య, కర్నాటి భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పామూరు: భైరవకోన జలపాతం వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

భైరవకోన జలపాతంలోకి అనుమతించొద్దు!

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు భైరవకోన జలపాతానికి కొండలపై నుంచి ఉధృతంగా నీరు వస్తోంది. ఈక్రమంలో జలపాతాన్ని సందర్శించేందుకు మరో మూడురోజులపాటు పర్యాటకులను అనుమతించవద్దని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం తహసీల్దార్ హుసేన్, ఎస్ఐ ఎం.వెంకటేశ్వర నాయక్‌తో కలిసి ఆర్డీవో భైరవకోన క్షేత్రాన్ని సందర్శించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న జలపాతాన్ని, క్షేత్రానికి వెళ్లేదారిలో చప్టాపై నుంచి ప్రవహిస్తున్న నీటిని పరిశీలించారు. నీటి ఉధృతి తీవ్రంగా ఉండటంతో భక్తులు, పర్యాటకులను వర్షాలు తగ్గేవరకు అనుమతించవద్దని ఆర్డీవో ఆదేశించారు. కార్యక్రమంలో ఈవో వి.వంశీకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు పాల్గొన్నారు. అలాగే, పామూరు మండలంలోని మోపాడు రిజర్వాయర్‌ను పరిశీలించారు. మరో నాలుగురోజులపాటు వర్ష ప్రభావం ఉంటుందని వాతవరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో పెట్టుకొని అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, ఇరిగేషన్ ఏఈ ప్రసాద్, రిజర్వాయర్ నీటి సంఘం ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లు చుంచు కొండయ్య, ఎం.నరసింహారావు, వీఆర్వోలు ఎం.శ్రీను, రామాంజనేయులు, ఏ.సుధాకర్ తదితరులు ఉన్నారు.



అధ్వానంగా గ్రామీణ రహదారులు

- చినుకుపడితే చిత్తడిగా మారుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ముండ్లమూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలుగ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. చిత్తడిగా మారడంతో రహదారులపై ప్రయాణం చేయలేక వాహనచోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. పలువురు జారిపడి గాయపడుతున్నారు. గ్రామాల్లోని వీధులు కూడా బురదమయమై నడవలేని విధంగా ఉన్నాయి. ఈదర నుంచి వయా అయోధ్యనగర్, వేములబండ వచ్చే ప్రధాన రహదారి బురదమయమైంది. పొలాలకు వెళ్ళే రైతులతో పాటు ఇతర గ్రామాలకు వెళ్ళే వాహనచోదకులు ఈ రహదారిపై ప్రయాణం చేస్తూ నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. గురువారం ఒక్కరోజే 20 మంది వాహన చోదకులు కిందపడ్డారు. ఈ రహదారిపై నిత్యం వందల మంది దర్శి, ముండ్లమూరు పట్టణాలకు వెళ్తూ ఉంటారు. రెడ్డినగర్ నుంచి వయా బసవాపురం, శ్రీనివాసనగర్ వెళ్ళే ప్రధాన రహదారి కూడా దారుణంగా ఉంది. పెద్దపెద్ద గోతులు పడ్డాయి. ఆ గోతుల్లో గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు నీరు నిలబడటంతో ప్ర యాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గోతుల్లో నీరు నిలబడటం వల్ల వాహనచోదకులు వేగంగా వచ్చి గోతుల్లో పడి క్షతగాత్రుల వుతున్నారు. బసవాపురం గ్రామంలోని ప్రతి వీధి చిత్తడిగా మార డంతో కాలుతీసి కాలు పెట్టలేని పరిస్థితి నెలకొంది. శ్రీనివాసనగర్ వెళ్ళే రహదారి కూడా గోతులమయమైంది. పసుపుగల్లు, పెద ఉల్లగల్లు, వేముల, వేములబండ, పులిపాడు, పూరిమెట్ల, ఈదర లోని ప్రధాన రహదారులు బురద మయమయ్యాయి. బొప్పూడి వారిపాలెంలో వర్షపు నీరు పలు వీధుల్లో నిలబడటంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా ఈదర - అయోధ్యనగర్ రహదారి



బసవాపురం - రెడ్డినగర్ మార్గంలో గోతుల్లో నిలచిన వర్షపు నీరు



చిత్తడిగా బసవాపురంలోని ప్రధాన వీధి



గుంటిగంగ సన్నిధిలో అన్నదాన సత్రం

- ప్రారంభించిన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి , డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

తాళ్లూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన గుంటిగంగ సన్నిధిలో గంగమ్మను దర్శించుకునే భక్తులకు అన్నదానం నిర్వహించేందుకు సత్రం నిర్మించటం సంతోషకరమని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గుంటిగంగాభవాని ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ కొసనా గురుబ్రహ్మం ఆధ్వర్యంలో శ్రీగుంటిగంగమ్మ అన్నదాన సత్రం ట్రస్ట్ నిర్మించిన సత్రాన్ని శుక్రవారం ఎంపీ మాగుంట, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గంగమ్మను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అన్నదానం చేపట్టేందుకు ఉన్న సత్రాలు తిరునాళ్ల సమయంలో మాత్రమే ఉపయోగంలో ఉంటున్నాయి. దీంతో ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ కొసనా గురుబ్రహ్మం దాతల సహకారంతో అన్నదానం సత్రం నిర్మాణం తలపెట్టారు. లక్షలాది రూపాయల నిధులు సమకూర్చి సత్రం నిర్మాణం పూర్తి చేయటం అభినందనీయమన్నారు. గంగమ్మను దర్శించుకునే భక్తులకు ఈ సత్రంఎంతో ఉపయోగంలో ఉంటుందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్నదానం నిర్వహించాలన్నారు.

ముందుగా గుంటిగంగమ్మ ఆలయంలో ఎంపీ మాగుంట, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్, నారపుశెట్టి పాపారావు, కొసనా గురుబ్రహ్మం, పిచ్చయ్యలు ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బ్రాహ్మణజారి కామేశ్వరశర్మ గోత్రనామ పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, దర్శి ఏఎంసీ ఛైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు మేడం వెంకటేశ్వరరెడ్డి, బి.ఓబుల్ రెడ్డి, మానం రమేష్‌బాబు, గొల్లపూడి వేణుబాబు, ఆర్.వెంకట్రావు, ఐ.శ్రీనివాసరెడ్డి కాశిరెడ్డి, రాయుడు, ఐవీ రమణారెడ్డి, పి.రమణారెడ్డి, రామకోటిరెడ్డి, వీసీరెడ్డి, ఖాసీం సైదా, తదితరులు పాల్గొన్నారు.



గుంటిగంగమ్మ అన్నదానసత్రాన్ని ప్రారంభించిన ఎంపీ మాగుంట, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ఓటర్ల రివిజన్ నిరంతర ప్రక్రియ



మాట్లాడుతున్న జాన్సన్, పాల్గొన్న రెవెన్యూ అధికారులు, రాజకీయపార్టీల ప్రతినిధులు

దర్శి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఓటర్ల రివిజన్ కార్యక్రమం నిరంతరం జరుగుతుందని దర్శి నియోజకవర్గ ఎలక్ట్రోల్ అధికారి జాన్సన్ అన్నారు. చేర్పులు, మార్పుల్లో అధికారులు, సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గస్థాయి రెవెన్యూ అధికారులు, రాజకీయపార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతిపౌరుడు తమ పేరును ఓటర్ల జాబితాలో చేర్చుకొని ఓటుహక్కు పొందాలన్నారు. బీఎల్‌వోలు ఓటర్ల రివిజన్‌ను పారదర్శకంగా నిర్వహించాన్నారు. ఇంటింటి సర్వే జరుగుతున్నందున రాజకీయ పార్టీలు బీఎల్‌వోలకు సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, రెవెన్యూ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పంటల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి

దొనకొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు బయటకు పంపేలా రైతులు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్ సూచించారు. శుక్రవారం మండలంలోని దొండపాడు, పెద్దన్నపాలెం, ఆరవల్లిపాడు, వద్దిపాడు, పడమటి వెంకటాపురం గ్రామాల్లో పత్తి, కంది పంటలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పంటల్లో నిలచిన నీరు బయటకు పంపి మూడు గ్రాముల కాపరాక్సీ క్లోరైడ్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పత్తిలో పూత, పిందె రాలకుండా 1.5 గ్రాములు బోకాక్స్ పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎస్.వెంకటరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు ధనరాజ్, లక్ష్మణరావు, సురేంద్రగౌడ్, విన్నీబాబు, కమల పాల్గొన్నారు.

వైభవంగా వీర్లంకమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో ప్రతిష్ఠించిన వీర్లంకమ్మ

ముండ్లమూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని వీర్లంకమ్మ విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఉదయం వైభవంగా జరిగింది. గత మూడు రోజులుగా గణపతి హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని గ్రా మంలో ఊరేగింపు నిర్వహించారు.

మిరపకు సోకే తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కనిగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మిరపకు సోకే తెగుళ్ళ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యాన అధికారి విష్ణుప్రియ అన్నారు. మండలంలోని యడవల్లి గ్రామంలో వివిధరకాల కూరగాయల పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తెగుళ్ళ నివారణకు సూక్ష్మధాతువల మిశ్రమాన్ని లీటర్ నీటికి 5గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. ప్రస్తుతం ఆకుమచ్చ, కాయకుళ్ళు, బూజు తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. వీటినివారణకు ముందు జాగ్రత్తగా లీటర్ నీటిలో 2.5 గ్రాముల సాఫ్ మందులు కలిపి రెండుసార్లు పిచికారి చేయాలన్నారు.

మురికికూపంగా రోడ్లు

తాళ్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్లు వాగులను తలపిస్తున్నాయి. మురుగు కాలువలు పూడికతీతలు తీయక పోవటంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుగ్రామాల్లో మురుగునీటికి తోడు వర్షపు నీరు కలిసి రోడ్లపై ప్రవహించటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. తూర్పుగంగవరం గ్రామంలో తాళ్లూరు వెళ్లే మార్గంలో ఆంజనేయస్వామి గుడి మలుపు వద్ద నుంచి మురుగు కాల్వలు లేకపోవటంతో రోడ్డు జలమయమైంది. వాగుల తూములు పూడిపోవటంతో నీరు చప్టాలపై ప్రవహిస్తుండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులవద్ద పోలీసులు పహారా కాస్తున్నారు. కొర్రపాటిపాలెం, శివరాంపురం గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు పరిశీలించారు.

దర్శి విద్యార్థులకు రాష్ట్రస్థాయి పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

దర్శి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో జరిగిన రెజ్లింగ్ పోటీల్లో స్థానిక గురుకుల పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. ఎన్‌టీఆర్ జిల్లాలో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగిన ఈ పోటీల్లో ఏ.జోసఫ్, జస్వంత్, పి.రాము, ఎం.వెంకి, తదితరులు కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు అభినందించారు.

డ్రైనేజీలో వ్యర్థాల తొలగింపు

పామూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు పట్టణంలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీల్లో నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి ఎక్స్‌కవేటర్‌తో డ్రైనేజీల్లో చెత్తాచెదారాన్ని తొలగించి మురుగు నీరు ముందుకు ప్రవహించేవిధంగా చర్యలు చేపట్టారు. మయూరి లాడ్జి వద్ద ఎక్స్ కవేటర్‌తో గుంతను తీసి వ్యర్థాలు తొలగించారు. ఎన్జీవో కాలనీ ఏరియాలోనూ డ్రైనేజీల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌బాబు, బీజేపీ మండల అధ్యక్షుడు ఉమ్మడి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మృతి

ముండ్లమూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదర గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నాగమల్లి వెంకయ్య(62) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం తన స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, కోడిగ మస్తాన్ రావు, జంపాని శ్రీనివాసరావు, మక్కెన రత్తయ్య, సర్పంచ్ వంగల పద్మావతి శ్రీనివాస రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

వైద్యానికి ఆర్థికసాయం

పామూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంకాలమ్మవీధికి చెందిన బత్తుల వెంకటేష్‌కు వైద్యావసరాల కోసం మానవత సంస్థ ఛైర్మన్ కె.రామిరెడ్డి, అధ్యక్షుడు వి.వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో టి.వెంకటేశ్వర్లు, టి.రమేష్, కె.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

28న మెగా జాబ్ మేళా

పామూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఈటీఎస్‌అండ్‌పీల్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈనెల 28న మెగా జాబ్‌మేళా జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 8008822821, 7997151082 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

కపాస్ కిసాన్ యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలి

● సీసీఐ మేనేజర్ రాజేంద్ర షా

బాపట్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) జనరల్ మేనేజర్ రాజేంద్ర షా కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2025-26లో పత్తిపంటకు సీసీఐ మద్దతు ధర పొందాలంటే.. కపాస్ కిసాన్ మొబైల్ యాప్‌లో నమోదు కావాలన్నారు. ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకున్న రైతులు మొబైల్ ఫోన్ నంబరుకు వచ్చే ఓటీపీ ద్వారా లాగిన్ కావాలన్నారు. మద్దతు ధరకు విక్రయానికి యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని చించారు.

పట్టాలెక్కనున్న అమృత్ 2.0



నరసరావుపేటలోని కత్తవ చెరువు

చేపట్టాల్సిన పనులు ఇలా..

- నీటి పథకాల విస్తరణ, చెరువుల ఆధునికీకరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం.
- రానున్న 25 ఏళ్లలో పెరిగే జనాభాకు అనుగుణంగా తాగు నీటి పథకాల విస్తరణ.
- 24/7 నీటిని సరఫరా చేసే దిశగా నీటి పథకాల అభివృద్ధి, మురుగునీటి సమస్యలపై దృష్టి సారించడం.
- పట్టణాల్లో భూగర్భ జలాల పెంపు, చెరువుల పూడిక తీత, కట్టల పటిష్ఠత, వీటిపై వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం.
- పట్టణాల్లో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సెంటు స్థలం కాలనీలకు తాగు నీటి సరఫరా, పైపులైన్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, గృహాలకు కుళాయి కనెక్షన్లు.

పురపాలక సంఘాల్లో అమృత్ 2.0 పథకం పనులు పట్టాలెక్కనున్నాయి. రెండు సార్లు వాయిదా పడిన టెండర్లు ఎట్టకేలకు తిరిగి నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో టెండర్లు నిర్వహించేందుకు పబ్లిక్ హెల్త్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. రానున్న నాలుగు రోజుల్లో టెండర్లు నిర్వహించనున్నట్లు సదరు అధికారులు తెలిపారు. రూ.975.56 కోట్లు వ్యయంతో పనులు చేపట్టనున్నారు. పనులకు వినియోగించే మెటీరియల్ కొత్త ప్రామాణిక రేట్లు ప్రకారం టెండర్ నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

- టెండర్ నిర్వహణకు అనుమతి
- రూ.975.56 కోట్లతో పనులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని గుంటూరు నగరంతో సహా మునిసిపాలిటీల్లో అమృత్ పథకం కింది 54 పనులకు రూ.975.56 కోట్ల వ్యయం చేయనున్నారు. ఈ పనులన్నింటిని ఒకే టెండర్ కింద (మిగతా 8వ పేజీలో)



అమృత్ పథకంలో ప్రతిపాదించిన పిడుగురాళ్ల చెరువు

మున్సిపాల్టీల వారీగా అమృత్ 2.0 నిధులు ఇలా..

మునిసిపాల్టీ	నిధులు (కోట్లలో)
నరసరావుపేట	29.42
చిలకలూరిపేట	161.30
దాచేపల్లి	49.62
పిడుగురాళ్ల	36.26
గురజాల	18.62
సత్తెనపల్లి	0.72
మాచర్ల	37.53
గుంటూరు	381.03
మంగళగిరి,తాడేపల్లి	68.21
తెనాలి	61.61
పొన్నూరు	22.10
చీరాల	32.98
బాపట్ల	25.32
రేపల్లె	45.74
అద్దంకి	5.10



వేమూరు: బూతుమల్లిలో నీట మునిగిన వరి పైరు



రేపల్లె : మోకాళ్ళోతులో ఉన్న బస్టాండ్ రోడ్డు

ఎండ.. వాన

కళ్లు చెదిరేలా ఎండ.. అంతలోనే నల్లని కారు మబ్బులు కమ్మేయడం. ఆపై ఆకాశం గర్జించినట్లు మేఘాలు నీటిని కుమ్మరిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా ఈ విచిత్ర పరిస్థితి గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అత్యధికంగా పల్నాడు జిల్లాలో అక్కడక్కడ కనిపించింది. శుక్రవారం కూడా పలు ప్రాంతాల్లో ఇదే విధంగా ఎండ మండించగా అంతలోనే భారీగా వర్షం పడింది. మళ్లీ అంతలోనే వర్షం ఆగిపోగా సూర్యుడు దర్శనమిచ్చాడు. క్లౌడ్ బరెస్ట్ అయిందా అన్నట్లు అక్కడక్కడ భారీగా వర్షం పడింది. వాన పడదని బయటకు వచ్చిన ప్రజలు కుంభవృష్టిలా పడిన చినుకులతో తడిసిముద్దయ్యారు. వర్షంతో కొన్ని ప్రాంతాల్లోని వీధులు చెరువుల్లా మారగా మరికొంత దూరంలో ఆ ఆనవాళ్లు లేవు. ఈ విచిత్ర పరిణామాలతో రైతులు నిండామునిగారు. చేతికంది వచ్చిన వరి, పత్తి తదితర పైర్లు నీట మునిగాయి. కొన్ని రోజులుగా కురుస్తోన్న వర్షాలతో దిగుబడులు తగ్గిపోతా యని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- క్లౌడ్ బరస్ట్‌ను తలపించేలా వానలు
- వరి పైరుకు రోజురోజుకు పెరుగుతున్న నష్టం
- 27 నుంచి మళ్లీ వర్షాల హెచ్చరికతో రైతుల్లో వణుకు
- నిజాంపట్నంలో కొనసాగుతున్న మూడో నెంబరు హెచ్చరిక



జలమయమైన రేపల్లె మున్సిపల్ ఆఫీస్ రోడ్డు

(బాపట్ల, రేపల్లె, ఆంధ్రజ్యోతి) అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావంతో శుక్రవారం కూడా కొన్ని ప్రాంతాల్లో వర్షం పడింది. మరికొన్ని ప్రాంతాల్లో ఎండ కాసింది. మూడు రోజులుగా వదలకుండా వర్షం పడగా శుక్రవారం ఉదయం సూర్యుడు కనిపించాడు. దీంతో వర్షం పోయిందని రైతులు సంతోషించారు. పంట నష్టం కొంత తగ్గుతుందని ఆశపడ్డారు. అయితే వారి సంతోషం క్షణకాలం కూడా నిలువలేదు. ఎండ వచ్చిందనుకునేలోపే భారీగా వర్షం పడింది. శుక్రవారం సాయంత్రం వరకు ఇదే తరహా పరిస్థితి కనిపించింది. మధ్యాహ్నం లోపు కురిసిన వర్షాలకు పట్టణాలు, గ్రామాలు (మిగతా 8వ పేజీలో)



2024లో చిలకలూరిపేట వద్ద జరిగిన బస్సు ప్రమాదం (పాత చిత్రం)

ట్రావెల్స్‌.. టెర్రర్

కర్నూలు ఘటనతో ఉలికిపాటు

- బస్సు ప్రయాణంపై భయాందోళనలు
- ప్రైవేటు సర్వీసులపై కొరవడిన నిఘా
- నిబంధనలు కఠినంగా ఉండాలంటున్న ప్రయాణికులు

నిబంధనలు గాలికి...

ట్రావెల్స్ బస్సులకు సంబంధించి 2024 ఏప్రిల్లో ఏఐఎస్ 119 గైడ్‌లైన్స్ అందుబాటులోకి తెచ్చింది. అయితే నిర్వాహకులు వాటికి పాతరేస్తున్నారు. పరిమితికి మించి విండోలు క్లోజ్ చేసి అదనపు సీట్లు వేస్తున్నారు. వెనుక సర్వీస్ డోరు తొలగిస్తున్నారు. ఐదు ఎమర్జెన్సీ విండోలు ఉండాలి కానీ పట్టించుకోవడంలేదు. ఇద్దరు డ్రైవర్లు ఉండాలి. నిర్ణీత సమయాన్ని అనుసరిస్తూ వారు డ్రైవింగ్ చేయాలి. అలాగే ఫిట్‌నెస్ పరీక్షలు జరగాలి. అయితే ఇవేవీ అమలు కావడం లేదు. కొందరు అధికారులు మామూళ్ల మత్తులో ట్రావెల్స్ బస్సులను పట్టించుకోవడం లేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ట్రావెల్స్ ఫిట్‌నెస్‌లపై వివరాల కోసం ఆంధ్రజ్యోతి ప్రతినిధి ఆర్టీవో రామకృష్ణారెడ్డిని సంప్రదించగా వాటికి సంబంధించిన వివరాలు తమ వద్ద ఉండవని సమాధానమిచ్చారు.

చీరాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆకర్షణీయ రంగులు, విద్యుత్ దీపాల వెలుగుల్లో కనిపించే ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణాలపై భయాందోళనలు నెలకొంటున్నాయి. గతంలో ఎన్నో ఘటనలు చోటుచేసుకున్నా అటు ట్రావెల్స్ నిర్వాహకులు.. ఇటు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాల పరంపర కొనసాగుతోంది. కర్నూలు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న బస్సు దహనం ఘటన నిదర్శనంగా కనిపిస్తోంది. రైళ్లలో రిజర్వేషన్లు దొరక్క, ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేక పోవడంతో ఎక్కువమంది ట్రావెల్స్‌పై ప్రయాణాలకు మొగ్గుచూపుతున్నారు. ఇదే అదునుగా వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం నగరాలకు ట్రావెల్స్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడుపుతున్నారు. ఆయా బస్సులు ప్రమాదాల బారిన పడుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లో వాటినే ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. ఎలాగోలా సర్దుకుంటే తొందరగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చన్న ప్రయాణికులు ఆశతో ట్రావెల్స్ నిర్వాహకులు జేబులు నింపుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో కొన్ని ట్రావెల్స్ నిర్వాహకులు నిబంధనలకు పాతర వేస్తున్నారు.

తప్పించుకునే అవకాశం మృగ్యం..

ట్రావెల్స్ బస్సుల్లో ఏదైనా ప్రమాదం జరిగితే తప్పించుకునే అవకాశం ఉండటం లేదు. దీంతో ప్రయాణికులు బస్సులోనే సజీవ దహనం అవుతున్న సంఘటనలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. 2024 మే 15 తెల్లవారుజామున చీరాల నుంచి హైదరాబాదు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు పర్చూరు చిలకలూరిపేట మధ్య టిప్పర్ లారీని ఢీకొట్టి మంటలు చెలరేగి ఆరుగురు సజీవ దహనమయ్యారు. తాజాగా కర్నూలులో జరిగిన ఘటనలో 20 మంది సీట్లలోనే కాలిపోయారు. ఇలా ప్రమాదాలు జరిగినప్పుడు బస్సులో పొగలు వ్యాపించి ఎటువెళ్లాలో, ఎలా తప్పించు కోవాలో తెలియని పరిస్థితుల్లో మంటల్లో మాడిమసైపోతున్నారు. ఎమర్జెన్సీ డోర్‌లో నుంచి అందరూ తప్పించుకోలేక పోతున్నారు. దీంతో మహిళలు, పిల్లలు,వృద్ధులు మృతి చెందుతున్నారు. అద్దాలు పగలగొట్టడానికి కావాల్సిన పరికరాలు అందుబాటులో లేకపోవడం కూడా మృతుల సంఖ్య పెరగడానికి కారణమని తెలుస్తుంది.

కొత్తపేట ఎన్నిక వాయిదా

పిటిషనర్ వాదనకు హైకోర్టు సమర్థన ● తదుపరి ఉత్తర్వులు అందేవరకు నిలుపుదల

కొత్తపేట(చీరాల), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ ఎన్నిక వాయిదా పడింది. వచ్చే నెల 3న ఎన్నికకు సంబంధించి ఇటీవల ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే సమయాభావం, ప్రకృతి విపత్తులతో అభ్యంతరాలు తెలుపుతూ గ్రామస్థులు గురువారం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న హైకోర్టు శుక్రవారం పిటిషనరు వాదనను సమర్థించింది. ఈక్రమంలోనే మధ్యంతర స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఎన్నికల ప్రక్రియను నిలుపుదల చేయాలని ఎన్నికల సంఘం సూచించింది. అయితే తన నుంచి నామినేషన్ స్వీకరించలేదని శుక్రవారం స్వతంత్ర్యఅభ్యర్థి చుండూరు వాసు పంచాయతీ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. మరికొందరు వాసుకు మద్దతు తెలుపుతూ ఆందోళనలో పాల్గొన్నారు. సీఐ నాగభూషణం వారికి సర్ది చెప్పేందుకు యత్నిం చగా వారి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఎన్నికలు అధికారులు కార్యాలయం నుంచి వెళ్లిపోవడంతో ఆందోళనకారులు అక్కడ నుంచి వెళ్లి పోయారు.

జలసంధిపై చట్ట ప్రకారం న్యాయం చేస్తాం

విచారణాధికారిగా జేసీ నియామకం ● మత్స్యకారులకు మేలు చేస్తామన్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈపూరుపాలెం రొంపేరు జలసంధి సమస్యపై చట్టప్రకారం నిబంధనలు అనుసరించి న్యాయం జరిగేలా చూస్తామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. జలసంధి వివాదంపై ఏర్పాటైన కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకారులకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీఆర్‌జడ్ ఉల్లంఘనపై పరిశీలిస్తామన్నారు. న్యాయస్థానం సూచించిన నేపథ్యంలో బూర్ల వెంకట్రావు వాదనను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్‌ను విచారణాధికారిగా నియమిస్తామన్నారు. సున్నితమైన ఈ అంశాన్ని త్వరగా పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వానికి సహకరించాలని ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. అనుమతి లేకుండా రాస్తారోకోలు, నిరసనలతో ప్రజలకు ఇబ్బంది కలిగించరాదన్నారు. సమావేశంలో డీఆర్‌వో జి.గంగాధర్ గౌడ్, ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, మత్స్యశాఖ డీడీ గాలి దేవుడు, జలవనరుల శాఖ ఈఈ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎస్పీ బి.ఉమామహేశ్వర్

ప్రభుత్వం దృష్టికి విపత్తుల నష్టం

● ఆదుకుంటామని రైతులకు ఆనందబాబు హామీ

వేమూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విపత్తుల నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి ఆదుకుంటామని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు రైతులకు భరోసా ఇచ్చారు. వాయుగుండం ప్రభావంతో వర్షాలతో కోతకు సిద్ధమవుతున్న వరి నష్టపోగా శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. మండలంలోని జంపని, బూతుమల్లి, వేమూరు తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ క్రమంలో పడిపోయిన పైరు, చేలల్లో నీరు నిలిచిందని తాము నష్టపోతామని రైతులు ఎమ్మెల్యేకు తెలిపారు. అనంతరం ఆనందబాబు విలేకర్లతో మాట్లాడుతూ వీడని వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. గత సంవత్సరం నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుందన్నారు. ఇటీవల వరదలతో లంక ప్రాంతాల రైతులకు కూడా అపార నష్టం జరిగిందని, వారిని కూడా ప్రభుత్వం ఆదుకుందున్నారు. ప్రస్తుతం ఏర్పడిన నష్టంపై అధికారుల ద్వారా సర్వే నిర్వహించి నివేదికలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి ఆదుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీల, ఏవో ప్రేమ్‌సాగర్, టీడీపీ పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ అమ్మిశెట్టి కిశోర్‌కుమార్, నీటి సంఘం అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు వరప్రసాద్, వేమూరి శేషుబాబు, బండారు సూరిబాబు, కన్యధార తాతాజీ, చావలి సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు, యలవర్తి సురేంద్ర, గంటా శ్రీనివాసరావు, అన్నే ప్రసాద్ పాల్గొన్నారు.



వర్షాలకు దెబ్బతిన్న వరికంకులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ముంపు సమస్యలపై మౌనం

● గుండ్లకమ్మ బాధితుల గోడు పట్టించుకోని పాలకులు

అద్దంకి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయి దశాబ్ద కాలం అవుతుంది. అయినా ఇంకా ముంపు గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదు. ప్రభుత్వాలు మారుతున్నా ముంపు గ్రామాల ప్రజలు గోడు పాలకులకు పట్టడంలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో ముంపు గ్రామాల సమస్యల పరిష్కారంపై కొంతమేర కదలిక వచ్చింది. వైసీపీ హయాంలో పూర్తి నిర్లక్ష్యం చూపారు. కూటమి ప్రభుత్వంలో అయినా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని గుండ్లకమ్మ బాధితులు ఆశించారు. అయితే 16 నెలలుగా అధికారులు కాలయాపనతో సరిపెట్టారు. సమస్యలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి ముంపు గ్రామాల ప్రజలు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో మంత్రి ఆదేశాలతో అధికారులు హడావుడి చేసి ముంపు గ్రామాల్లో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఆ తర్వాత ప్రాజెక్టు అధికారులతో మంత్రి సమావేశం కూడా ఏర్పాటు చేశారు. కానీ ఇంతవరకు సమస్యలు పరిష్కారం కాలేదు. గ్రామాల పునరావాస కాలనీల్లో ఆలయాల నిర్మాణాలు, శ్మశాన స్థలాల కేటాయింపు జరగలేదు. తాగునీటి వసతి అంతంతమాత్రంగానే ఉంది. ముంపు గ్రామాల పేరుతో పాతగ్రామాల్లో వసతుల గురించి కూడా పట్టించుకోవడంలేదు. ఇళ్ల శిథిలావస్థకు చేరి నివాసయోగ్యంగా లేవు. పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పన జరగలేదు. దీంతో ఇళ్ల నిర్మాణం చేసుకునే అవకాశం లేకుండా పోయిందని బాధితులు వాపోతున్నారు. ధేనువకొండలో చాలా మందికి ఇళ్ల స్థలాల కేటాయించలేదు. కొందరికి పరిహారం కూడా అందలేదు. తిమ్మారెడ్డిపాలెంవాసులకు స్థలాల కేటాయించినా పునరావాస కాలనీలో మౌలిక వస తుల కల్పన జరగలేదు. మణికేశ్వరంలో ఎస్సీకాలనీ వాసులకు ఇళ్ల స్థలాల కేటాయింపు జరగలేదు.



తిమ్మారెడ్డిపాలెం గ్రామం వ్యూ

టైరుపగిలి ఫ్లైఓవర్‌పై కారు బోల్తా



దెబ్బతిన్న కారు

పంగులూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుండి విజయవాడకు వెళుతున్న కారు టైరు పగలడంతో ముప్పవరం ఫ్లైఓవర్‌పై తిరగబడింది. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో విజయవాడకు వెళుతున్న కారు టైరుపగలడంతో ఒంగోలువైపు రహదారిలోకి పడిపోయింది. కారులో ప్రయాణిస్తున్న వారు ఎలాంటి గాయాలు లేకుండా బయటపడటంతో ఊపిరిపీల్చుకున్నారు. ఘటనతో ఒంగోలువైపు వెళ్లే రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా హైవే సిబ్బంది సకాలంలో చర్యలు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ఒంగోలు క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి పెళ్ళూరు-వాసేపల్లిపాడు మధ్య పొలాల్లో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు శుక్రవారం ఒంగోలు తాలుకా పోలీసులు గుర్తించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 55ఏళ్ళు ఉంటుందని, లేత బూడిద రంగు ప్యాంట్, బ్లూ కలర్ కట్‌బనీయన్ ధరించి ఉన్నాడు. వివరాలు తెలిసినవారు 9121104780, 9121102127 సెల్ నంబర్లను సంప్రందిచాలని తాలుకా సీఐ విజయకృష్ణ కోరారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ఒంగోలు క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఒంగోలు నగరం హౌసింగ్‌బోర్డ్ కాలనీలో శుక్రవారం జరిగింది. స్థానిక నగర శివారు ప్రాంతంలో ఉండే ఓ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుకునే నలుగురు విద్యార్థులు హౌసింగ్ బోర్డు కాలనీలో రేకుల ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. అయితే ఇంటిలో ఎవరూ లేని సమయంలో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన బాపట్ల దిగ్విజయ్‌సాయిమణికంఠ (22) ఇనుప కమ్మీకి టవల్‌తో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేయగా వారు ఒంగోలు వచ్చి తమ కుమారుడి మృతదేహాన్ని తీసుకెళ్లారు. విద్యార్థి మృతికి గల కారణం తెలియాల్సి ఉంది.

పట్టాలెక్కనున్న అమృత్ 2.0

(5వ పేజీ తరువాయి)

నిర్వహిస్తారు. అయా పనులు పూర్తి చేస్తే పురపాలక సంఘాల్లో తాగు, మురుగు నీటి కష్టాలు తీరుతాయి.

చామ్ పద్ధతిలో పనులు

రాష్ట్రంలోనే తొలిసారిగా అమృత్ పథకం 2.0 కింద ప్రగతి పనులను నూతన విధానంలో చేపనున్నారు. రాయితీ హైబ్రీడ్ యాన్యుటీ మోడల్(చామ్) కింద పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధానంలోనే టెండర్లు నిర్వహిస్తున్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో వినియోగించిన పీపీపీ తరహాలోనే చామ్ విధానం కూడా ఉంది. 50 శాతం నిధులు ప్రభుత్వం ఇస్తుంది. 50 శాతం నిధులు కాంట్రాక్టర్ భరించాలి. సదరు సంస్థ ఖర్చు చేసే నిధులను వడ్డీతో కలిపి 40 వాయిదాల్లో ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రముఖ నిర్మాణ రంగ సంస్థ ప్రతిపాదించిన పనులు స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. సదరు సంస్థ టెండరు దాఖలు చేసేందుకు సమాయత్తమవుతున్నట్లు 15, 16 ఆర్థిక సంఘం నిధులు కూడా ఖర్చు చేస్తారు. మునిసిపాల్టీలు కూడా నిర్ణయించిన నిధులను వినియోగించాల్సి ఉంది.

అర్హులందరికీ ఇళ్లు మంజూరుచేయాలి

హౌసింగ్ అధికారులతో ఎమ్మెల్యే ఏలూరి సమీక్ష



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పీఎంఏవై 2.0 గ్రామీణ్ పథకంపై ఎమ్మెల్యే ఏలూరి సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో మంజూరయ్యే పక్కా ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అధికారులు తీసుకోవలసిన జాగ్రత్తలను ఏలూరి వివరించారు. అంతేగాకుండా ఎంపీడీవో తహసీల్దార్, హౌసింగ్ అధికారులు సమన్వయంతో కలిసి పనిచేసి అధికంగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునే విధంగా కృషి చేయాలన్నారు. అదేవిధంగా గ్రామాలలో పార్టీ నాయకులు లబ్ధిదారులకు అవగాహన కలిగించాలని, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పేద కుటుంబాలకు మంజూరుచేసే ఇళ్ల నిర్మాణాలను విజయవంతం చేసే దిశగా నాయకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ఖాదర్‌వలి, తహసీల్దారు ప్రశాంతి, ఎంపీడీవో వై.శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ రాహుల్, పార్టీ నాయకులు, కామేపల్లి హరిబాబు, షేక్ రజాక్, కామినేని జనార్దన్, తాటి నాగేశ్వరరావు, కాకోలు వెంకటేశ్వర్లు, మిన్నెకంటి రవికుమార్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మండలంలోని ఏలూరి క్యాంపు కార్యాలయంలో 125 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. రూ.75 లక్షల విలువైన చెక్కులను నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన నాయకుల సమక్షంలో బాధితులకు అందజేశారు.

పోలియో రహిత సమాజమే రోటరీ లక్ష్యం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రోటరీ, ఆరోగ్యశాఖ అధికారులు

పర్చూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పోలియో రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు రోటరీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా రోటరీ, వైద్యశాఖ సమన్వయంతో ప్రజలకు పోలియో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోటరీ, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల నుంచి బొమ్మల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, ప్రధాన కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, కోటా హరిప్రసాద్, కోమటి ఆంజనేయులు, పాబోలు ఉదయభాస్కర్, కేఎస్‌ఆర్‌కే ప్రసాద్, నాగబైరు శ్రీనివాసారావు, పోలిశెట్టి చంద్రశేఖర్ రావు, కాసా అశోక్ కుమార్, పాబోలు వెంకన్న పాల్గొన్నారు.

పంగులూరులో...

పంగులూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : పోలియోరహిత సమాజమే లక్ష్యంగా ప్రపంచవ్యాప్తంగా రోటరీక్లబ్ విశిష్టసేవలు అందిస్తోందని పంగులూరు రోటరీక్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బత్తుల వీరనారాయణ అన్నారు. పంగులూరులో ప్రపంచ పోలియో నివారణ దినోత్సవం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో రోటరీ హెల్త్‌క్యాంప్ ఇన్‌చార్జ్ వీరరాఘవయ్య, కోశాధికారి షేక్ కాలేషావలి, సీపీఎం నాయకుడు నాగబోయిన రంగారావు, తలపనేని రామారావు, రోటరీ ప్రతినిధులు గుర్రం ఆంజనేయులు, చిలుకూరి ప్రసాదనాయుడు, ఏఎన్‌ఎం ఈవ్ ఎ.రాణి, అంజమ్మ, సంధ్య, లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

- గుండ్లకమ్మ ముంపు గ్రామాలను సందర్శించిన జేసీ గోపాలకృష్ణ

మద్దిపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయర్ పునరావాసకాలనీలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. శుక్రవారం మద్దిపాడు, ఘడియపూడి, బూరేపల్లి కాలనీలను ఆయన సందర్శించారు. ఆయా కాలనీవాసులతో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఘడియపూడి కాలనీకి శ్మశానస్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ వెంటనే శ్మశాన స్థలం కోసం అవసమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఆదిలక్ష్మిని ఆదేశించారు. బూరేపల్లి కాలనీలో పెండింగ్ పట్టాలు, ప్యాకేజీలు అందించాలని గ్రామస్థులు జేసీని కోరారు. మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ పాఠశాల వద్ద ఆగి స్కూలులోకి వెళ్లేందుకు మెరక తోలించాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతి, ఆర్ఐ రమణయ్య, సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు, అన్నమనేని సుబ్బారావు, ఏడుగుండ్ల సత్యనారాయణ, చింతల శ్రీనివాసరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎండ.. వాన

(5వ పేజీ తరువాయి)

జలమయమయ్యాయి. గురువారం వరకు పడిన వర్షంతో ఎక్కడికక్కడ పొలాలు నీటితో నిండిపోయాయి. పల్నాడు జిల్లా పరిధిలో వాగులు ఉధృతంగా ప్రవహించాయి. పల్నాడులో అధిక వర్షాలు పత్తి, మిర్చి రైతులను దారుణంగా దెబ్బతీశాయి. డెల్టాలో వరి రైతుల వెన్ను విరిచాయి. గురువారం పడిపోయిన విస్తీర్ణం కంటే రెట్టింపు చేలు నేలవాలాయి. ముసురు పట్టి ఉండటంతో కంకులు కూడా తాలుగా మారిపోతాయని రైతులు తెలిపారు. నేలవాలిన చేలల్లో ఎకరాకు రెండు నుంచి ఐదు బస్తాల వరకు దిగుబడిలో నష్టం ఏర్పడుతుందని రైతులు చెబుతున్నారు. పడిపోయిన వరిని పైకిలేపి కట్టించేందుకు ప్రయాస పడుతున్నారు. అల్పపీడనం బలహీనపడినా, వాతావరణంలో మార్పులు లేకపోవడంతో నిజాంపట్నం హార్బర్‌లో శుక్రవారం కూడా మూడో నెంబరు ప్రమాద హెచ్చరికను కొనసాగించారు. వాతావరణ శాఖ నుంచి సమాచారం వచ్చేవరకు అదే కొనసాగుతుందని పోర్టు అధికారులు చెప్పారు. అయితే సముద్రంలో వేటపై ఆంక్షలు ఇంకా సడలించలేదని, ఎవరూ సముద్రంలోకి వెళ్లటానికి వీలులేదని అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటికే రైతులు కుదేలవగా ఈ నెల 27 నుంచి మళ్లీ భారీ వర్షాల హెచ్చరికలు వాతావరణ శాఖ చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధికారులు అప్రమత్తం..

వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో పల్నాడు జిల్లా పరిధిలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే మండల కేంద్రాల్లో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేయగా వాటిని కొనసాగించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కాగా శుక్రవారం పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. పలు గ్రామాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లే అవకాశాలు ఉన్నందున ప్రజలు అటు వైపు వెళ్లరాదని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా పిల్లేరు, పొటేళ్ల వాగు పరివాహక ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు. కృష్ణానదీ పరివాహక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఆయా గ్రామాల వీఆర్‌ఏలు వారి వారి గ్రామాల్లో ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని అధికారులకు అందించాలంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. కాగా వీడని వర్షాలతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి మొక్కలు ఎర్రబారాయని, వేరు కుళ్ళు పడ్డాయని, ఏపుగా పెరిగిన పత్తి వర్షపు నీటితో పూత, పిందె రాలి పోతుందని సాగుదారులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ధర లేక ఇబ్బందులు పడుతుండగా అధిక వర్షాలు మరింత ఇబ్బందుల్లోకి నెట్టి వేస్తున్నాయని తెలిపారు.

6,800 ఎకరాల్లో పంట నష్టం

మూడు రోజుల నుంచి బాపట్ల జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు శుక్రవారం సాయంత్రానికి శాంతించాయి. పంట నష్టాలపై ప్రాథమిక గణన చేపట్టిన వ్యవసాయశాఖ జిల్లాలో 6,800 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు తేల్చింది. భారీ వర్షాలతో 74 గ్రామాల పరిధిలో 5,010 మంది రైతులకు నష్టం వాటిల్లిందని అంచనా వేవారు. తుది నివేదికలో ఈసంఖ్య దాదాపు 11,000 ఎకరాల వరకు ఉండొచ్చని సమాచారం. జె. పంగలూరు మండలంలో 2,500 ఎకరాల్లో మినుము, మార్టూరు మండలంలో 1,200 ఎకరాల్లో మినుము, పత్తికి 750 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ తేల్చింది. ఇంకొల్లు మండల పరిధిలో పత్తి, మినుము కలిపి దాదాపు 750 ఎకరాల్లో పంట దెబ్బతిన్నది. రేపల్లె నియోజకవర్గంలో శుక్రవారం ఈదురుగాలులతో కూడిన వర్షంపడింది. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులు, పలు కాలనీలు జలమయ్యాయి. బస్సులు కూడా కదలకపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్టాండ్‌కే పరిమితమయ్యారు. చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం, రేపల్లె మండలాల్లో అధికవర్షం పడింది. చెట్లు, విద్యుత్‌స్థంబాలు నేలవాలాయి.

వీడని వర్షంతో ఆందోళన

గుంటూరు, తెనాలి, పొన్నూరు, పెదనందిపాడు తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. రాజధాని ప్రాంతంలోని గ్రామాలు, మంగళగిరి, తాడేపల్లి పట్టణాల్లో కూడా రోడ్లు వర్షపు నీటితో నిండాయి. ప్రధాన రోడ్లతో పాటు పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచి రోడ్లపై ప్రవహించాయి. ఇప్పటికే పత్తి, మినుము, సోయాబీన్, మొక్కజొన్న కోతదశలో ఉండగా వీడని వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరప నాట్లు వేసిన రైతులు మొక్కలు నీటిలో నానుతుండడంతో ఉరకెత్తి చనిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొన్నూరులో మధ్యాహ్నం వరకు ఏకధాటిగా కురిసిన వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

స్థానిక సంస్థల బలోపేతం

ఆ దిశగా ప్రభుత్వం అడుగులు

వచ్చేనెల 1 నుంచి డీడీవో కార్యాలయాలు ప్రారంభానికి సన్నాహాలు

పంచాయతీల క్లస్టర్ విధానం రద్దు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్థానిక సంస్థలను బలోపేతం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామపంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టింది. ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలు క్లస్టర్ విధానంలో పనిచేస్తుండగా దానిని రద్దు చేసి స్వతంత్ర యూనిట్లుగా ఏర్పాటు చేయడం ద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా పంచాయతీల్లో ఇప్పటికే మండల స్థాయిలో డిప్యూటీ ఎంపీడీవోలు ఉండగా డివిజనల్ స్థాయిలో డివిజనల్ పంచాయతీ అధికారులు ఉన్నారు. ఇప్పుడు వారితో పాటు ప్రాంతీయ అభివృద్ధి అధికారులు (డీడీవో) కార్యాలయాలను ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీలను ఆ కార్యాలయ పరిధిలోకి తెచ్చే విధంగా చర్యలు చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యం కావడంతో పాటు పంచాయతీలకు రావాల్సిన నిధులను కూడా దారిమళ్లించింది.



దీంతో జిల్లాలో 729 గ్రామపంచాయతీలు అంధకారంలోకి వెళ్లాయి. అయితే ప్రస్తుతం ఆయా పంచాయతీల్లో మెరుగైన పాలనను అందించేందుకు చర్యలు తీసుకున్నారు. పంచాయతీల వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సహకారంతో గ్రామాలభివృద్ధికి నిధులను సమకూర్చే విధంగా చూస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తి సాధించే విధంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. అందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకోవడంతో రానున్న రోజుల్లో గ్రామపంచాయతీల ద్వారా మెరుగైన పాలనను అందించడమే కాకుండా ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు వీలుగా చర్యలు చేపట్టారు.

చీరాల రైల్వేస్టేషన్‌లో ఎస్కలేటర్ సేవలు ప్రారంభం

అవీఇవీ

- 1, 2 ప్లాట్ ఫాంలపై ఏర్పాటు



ప్రారంభమైన ఎస్కలేటర్ సేవలు

చీరాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : చీరాల రైల్వే స్టేషన్ ఆధునికీకరణలో భాగంగా ఎస్కలేటర్ సేవలను శుక్రవారం అధికారులు ప్రారంభించారు. ప్లాట్ ఫాం నెం. 1, 2 లలో ఈ సేవలు ఇకపై అందనున్నాయి. ఈక్రమంలో స్థానిక రైల్వే బోర్డు సభ్యులు, బీజేపీ నేతలు ఆయా సేవలతో పాటు ప్రయాణికుల వెయిటింగ్ హాలును పరిశీలించారు. వీరిలో బండారుపల్లి హేమంత్‌కుమార్, మువ్వల వెంకటరమణ, అరవపల్లి కుమార్, భరణీ, రాంబాబు, దేవరాజ్, పి భరణి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయండి

వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్



నాయకులతో మాట్లాడుతున్న కరణం వెంకటేష్

రామకృష్ణాపురం(చీరాల), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం రామకృష్ణాపురంలోని క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అంతకుముందు కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కనిగిరిలో చిట్టీల పేరుతో మోసం

మరికొంత వడ్డీలకు తీసుకుని.. రూ.8 కోట్లతో ఉడాయింపు

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు



సీఐ ఖాజావలికి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కనిగిరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణంలో కొందరు పెద్ద మనుషుల్లా చలామణి అవుతూ మోసాలకు పాల్పడుతున్నారు. ఓ సంఘం రాష్ట్ర కార్యదర్శి పదవిలో ఉన్న వ్యక్తి చిట్టీలు వేసి దాదాపు రూ.8 కోట్లతో ఉడాయించిన వైనం వెలుగుచూసింది. దీంతో బాధితులు లబోదిబో మంటూ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. మారెళ్ళ ఉమాకాంత్ పట్టణంలో దాదాపు 300 మంది రూ.2లక్షల నుంచి రూ.10లక్షల చిట్టీలు వేస్తుంటారు. విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి సోదరుడైన ఉమాకాంత్‌ను నమ్మి అందరూ మోసపోయినట్లు తెలుస్తుంది. చీటీలు వేసి మోసపోయిన వారు కొందరైతే, అప్పులిచ్చి మోసపోయినవారు మరికొందరున్నారు. ఈనెల 17 నుంచి కనపడకుండా పోవడంతో బాధితులకు అనుమానం వచ్చింది. ఉమాకాంత్ కుటుంబసభ్యుల వద్దకు బాధితులు వెళ్ళి విచారించగా సరైన సమాధానం చెప్పలేదు. తమకు సంబంధం లేదన్నట్లు మాట్లాడటంతో బాధితుల్లో ఆందోళన మొదలైంది. వారం రోజులుగా బాధితులు అతనికి ఫోన్ చేసినా అందుబాటులోకి రాలేదు. దీంతో బాధితులు సీఐ ఖాజావలిని కలసి ఫిర్యాదు చేశారు. కాగా ఉమాకాంత్ కుటుంబసభ్యులు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అతను కనిపించకుండా వెళ్ళిపోయాడని ఫిర్యాదు చేయటం గమనార్హం.

రేకుల ఇంటిలో అగ్నిప్రమాదం



కాలిపోయిన సామగ్రి

ఒంగోలు క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రేకుల ఇంటిలో అగ్నిప్రమాదం జరిగి లక్ష రూపాయలు ఆస్తినష్టవ వాటిల్లింది. ఈ సంఘటన ఒంగోలు నగరం సంతపేట ఆంజనేయస్వామి దేవాలయంలో సమీపంలో వివరాలలోకి వెళితే.. వినోదరాయినిపాలెంనకు చెందిన ఎర్రిచర్ల శారద టైలరింగ్ పనులు చేసుకుంటూ సంతపేటలో రేకుల ఇంటిలో తన సోదరుడితో కలిసి నివాసం ఉంటున్నారు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వకపోతే సోదరి శారదను వేదిస్తుంటాడు. దీంతో గురువారం రాత్రి కూడా డబ్బులు అడగ్గా తన వద్ద లేవని ఇంట్లో నుంచి పక్కఇంటికి వెళ్ళింది. వెంటనే ఆమె సోదరుడు కూడా అతని స్నేహితులతో కలిసి బయటకు వెళ్ళిపోయాడు. కొద్దిసేపటికి ఇంట్లో మంటలు రావడంతో శారదను పక్కింటి వారు పిలిచి చెప్పారు. అప్పటికే ఇంట్లో ఉన్న 10 బస్తాలు వడ్లు, బీరువా, డబుల్ కాట్ మంచం, టీవీ ఇంకా గృహోపకరణలు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపకదళం వచ్చి మంటలను ఆర్పివేశారు. సుమారు లక్షరూపాయాలు నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపారు.

సింగరాయకొండలో వర్ష బీభత్సం

పాకలలో రాష్ట్రంలోనే అత్యధికంగా 147.5మి.మీ వర్షపాతం

జలమయంగా మారిన లోతట్టు ప్రాంతాలు

తీరప్రాంత గ్రామాల్లో పర్యటించిన జడ్పీ సీఈవో, తహసీల్దార్







వర్షపునీటిని ఎక్స్‌కవేటర్ సహాయంతో బయటకు పంపిస్తున్న అధికారులు, బస్టాండ్ ప్రాంగణంలో నిలిచిన వర్షపునీరు, అప్పాపురం గిరిజనకాలనీలో పర్యటిస్తున్న తహసీల్దార్ రాజేష్

సింగరాయకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజుల నుంచి మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు భారీ వర్షం పడింది. శుక్రవారం ఉదయం 7 గంటలకు మండలంలోని పాకల గ్రామంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 147.5 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్ష బీభత్సం దాటికి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణమంతా నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. వర్షపు నీరు బయటకుపోక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని పాతపోస్టాఫీస్ వీధి, భైరాగిమన్యం, అరుణాకాలనీల్లో పల్లపు ప్రాంతాల్లోని పలు గృహాల్లోకి వర్షపు నీరుచేరడంలో ప్రజలు అవస్థలు పడ్డారు. సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలో లోతట్టుప్రాంతమైన ఎస్టీకాలనీ అప్పాపురంలో వర్షపు నీరు భారీగా నిలిచింది. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక టీడీపీ నేతలు వారికి భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఊళ్లపాలెం పంచాయతీ పరిధిలోని బేసిన్ పల్లెపాలెంలో వర్షపు నీరు బయటకు వెళ్లే వీలులేక వీధులన్నీ జలమయంగా మారాయి. పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని ఆంజనేయస్వామి గుడి ప్రహరీ గోడ కుప్ప కూలింది. జడ్పీ సీఈవో చిరంజీవి, తహసీల్దార్ ఎస్‌బీవీ రాజేష్ తీరప్రాంత గ్రామాలైన పాకల, ఊళ్లపాలెంతోపాటు సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని అప్పాపురంలో పర్యటించారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు.

అవీ..ఇవీ..

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

పంగులూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పంగులూరులో శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బత్తుల వీరనారాయణ, క్యాంప్ ఇన్‌చార్జ్ చిలుకూరి వీరరాఘవయ్య తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని స్థానిక రోటరీక్లబ్ ప్రాంగణంలో పెదకాకానికి చెందిన శంకర్ నేత్రాలయం, రోటరీక్లబ్‌ఆఫ్ పంగులూరు వారు సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉచిత కంటి వైద్యశిబిరం ఉదయం 8.30 గంటలకు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పంగులూరు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

చేపల చెరువు వేలం వాయిదా

బల్లికురవ, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వైదన గ్రామ పంచాయతీకి చెందిన చెరువులలో చేపలు వేసి పెంచుకోనేందుకు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి బి. ప్రసాదరావు, మండల డిప్యూటీ ఎంపీడీవో సుమతిల పర్యవేక్షణలో వేలం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం వరకు సమయం ఉండగా చేపల చెరువు వేలం పాట పాడేందుకు పాటదారులు ఎవరు రాలేదు. దీంతో అధికారులు సాయంత్రం వరకు వేచి చూసి మరో మారు వేలం పాట పెడతామని వాయిదా వేశారు. రెండు సంవత్సరాల కాలానికి రెండు చెరువులలో చేపలు వేసుకునే వీలు ఉందని నీరు కూడా పూర్తి స్థాయిలో ఉందని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. మరో మారు పాట పెడతామని ఆసక్తి కలిగిన వారు సకాలంలో హాజరుకావాలని కోరారు.

పేకాట స్థావరంపై పోలీసులు దాడి

- 8 మంది జూదరులు అరెస్ట్
- రూ. 4 వేలు స్వాధీనం

జాండ్రపేట(చీరాల), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జాండ్రపేట సీతానగరంలోని పేకాట స్థావరంపై వన్‌టౌన్ సీఐ సుబ్బారావు ఆదేశాల మేరకు ఎస్సై రాజ్యలక్ష్మీ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 8 మంది జూదరులను అరెస్ట్ చేసి వారి నుండి రూ.4 వేలు స్వాధీనం చేసుకున్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

డీఎస్పీ ఎండీ మొయిన్



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ మొయిన్

వేటపాలెం(చీరాల), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్టేషన్‌లో కేసులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని డీఎస్పీ ఎండీ మొయిన్ అన్నారు. శుక్ర వారం రూరల్ సిఐ పంతగాని శేషగిరిరావుతో కలిసి వేటపాలెం పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలు నిర్వహించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. విధుల్లో సిబ్బంది అలసత్వం వీడాలని సూచించారు. పలు సూచనలు చేశారు. ఎస్సై పెనుమాల జనార్ధన్, స్టేషన్ సిబ్బంది అధికారుల వెంట ఉన్నారు.

పురుగుమందు తాగిన వ్యక్తి మృతి

అద్దంకి, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలో బాధపడుతూ పురుగు మందు తాగిన వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకొంది. మండలంలోని గోవాడకు చెందిన కాకాని మస్తాన్(55) అనారోగ్య సమస్యలతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను చికిత్స నిమిత్తం అద్దంకి ప్రాథమిక వైద్యశాలకు అక్కడి నుంచి ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అక్కడ మృతిచెందాడు. రిమ్స్ నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. మస్తాన్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వాహనాల బ్యాటరీలు అపహరణ


బ్యాటరీల అపహరణకు గురైన ట్రాక్టర్, జేసీబీ

అద్దంకి, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తదామావారి పాలెంలో నామ్ రోడ్డు వెంబడి ఖాళీ ప్రదేశంలో నిలిపి ఉంచిన వాహనాల బ్యాటరీలు అపహరణకు గురయ్యాయి. స్థానికుల కథనం మేరకు తిమ్మాయపాలేనికి చెందిన కాశయ్య, నాగులపాడుకు చెందిన శేషగిరిరావులు తమ ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ అద్దంకిలోని కొత్త దామావారిపాలెం వద్ద ఖాళీస్థలంలో ఉంచారు. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తు తెలియని వ్యక్తులు మూడు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌లోని బ్యాటరీలను అపహరించుకు పోయారు. ఆనవాళ్లను బట్టి మూడు చక్రాల ఆటోలో వచ్చిన దొంగలు బ్యాటరీలు అపహరించుకు పోయినట్లు భావిస్తున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

బల్లికురవ, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో మూడురోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయని పంటలు సాగు చేసిన రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఏవో మాట్లాడుతు పంటలలో వర్షపు నీరు ఉంటే వెంటనే బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే వరి పంట మునక వేస్తే ఎకరాకు 30 కిలోల యూరియా, 15కిలోల పొటాష్‌లను పైపాటుగా వేయాలన్నారు. మొక్క జోన్న పంటకు కూడా యూరియా వేసుకోవచ్చు అన్నారు. మెట్ట పంటల్లో తెగుళ్ల వ్యాపించే ప్రమాదం ఉందని రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.


అద్దంకి బల్లికురవ రోడ్డులో రహదారిపైకి వచ్చిన నీరు, కొత్తపాలెం వద్ద నీటమునిగిన మిరప, చందలూరు వాగుపై ప్రహిస్తున్న నీరు, పంగులూరులో వర్షాలకు తడిచిన మినుము ఓదెలు

భారీవర్షాల బీభత్సం

- పొంగిపొర్లిన వాగులు
- పొలాల్లో నిలిచిన వర్షపునీరు
- పూర్తిగా నానిపోయిన మినుము

బల్లికురవ : మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీవర్షాల ధాటికి గ్రామాలలో ఉన్న వాగులు, చెరువులు పూర్తిస్థాయిలో నిండి పొంగి పొర్లుతున్నాయి. కొంత కాలం నుంచి నీరు లేక ఒట్టిపోయిన వాగులు, వంకలు సైతం నీటితో కళకళలాడుతున్నాయి. గ్రామాలలో వర్షపు నీటి ఉధృతితో వీధులు జలమయమయ్యాయి. బల్లికురవ-అద్దంకి రోడ్డులో అంబడిపూడి వద్ద చెరువు అలుగు ఉధృతంగా రావడంతో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తహసీల్దార్ రవినాయక్ సూచనల మేరకు గ్రామ టీడీపీ నాయకులు దద్దాల అంజయ్య యంత్రంతో వాగును శుభ్రం చేయించారు. అలానే వీర్లచెరువు అలుగు పారడంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటిసంఘం అధ్యక్షులు దర్శి రామస్వామి అధికారులతో దగ్గర ఉండి పరిశీలించారు. కొత్తపాలెం గ్రామం వద్ద తూర్పు వాగు ఉధృతితో పంట పొలాలు నీట మునిగాయి. గుంటుపల్లి అసిస్టు కాలనీ వద్ద వర్షపు నీటితో గృహాలలోకి నీరు చేరడంతో రెవెన్యూ అధికారులు నీరు బయటకు పంపే చర్యలు చేపట్టారు. అలానే కొణిదెన - గంగపాలెం గ్రామాల మధ్య నేలచప్టాలో వర్షపు నీరు నిలబడడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వైదన, కొప్పెరపాడు, చెన్నుపల్లి, ముక్తేశ్వరం గ్రామాలలో ఉన్న చెరువులు భారీ వర్షాల వలన పూర్తిగా నిండాయి. మరో వారం రోజులు వర్షాలు ఇదేమాదిరిగా కురిస్తే పంటలకు నష్టంతో పాటు గ్రామాలలో గృహాలలోకి కూడా నీరు చేరే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

● నీటమునిగిన పొలాలు

పంగులూరు : అల్పపీడన ప్రభావంతో గురు, శుక్ర వారాలలో ఎడతెరపు లేకుండా కురుస్తున్న వర్షాలకు పొలాలు నీటమునగగా, వాగులు పొంగి ప్రవహించాయి. మండలంలోని చందలూరు ఊరవాగు వంతెనపై పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచి పోయాయి. పలు గ్రామాలలో సాగులో ఉన్న మినుము పంటకు తీవ్రనష్టం వాటిల్లింది. కోతదశలో ఉన్న మినుము పంట చేతికి దక్కదని కొండమూరు, ముప్పవరం, అలవలపాడు, రేణంగివరం, బూదవాడ గ్రామాల రైతులు వాపోతున్నారు. నిత్యం పడుతున్న వర్షంతో పొలాల్లో గడ్డిపెరిగి బీడుగా మారాయని, వ్యవసాయ పనులు నిలిచిపోవడంతో రబీ పంటసాగు ఆలస్యం అవుతుందని రైతులు భావిస్తున్నారు. గురువారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షపాతం 2.5. సెంటీమీటర్లుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

● అండర్‌పాస్ వద్ద భారీగా నిలిచిన నీరు

ఉప్పుటూరు(పర్చూరు) : అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. జాతీయ రహదారి అధికారులు ముందుచూపు చర్యలు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. దీనిలో భాగంగా పర్చూరు మండల పరిధిలోని ఉప్పుటూరు గ్రామంలో 167ఏ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన అండర్ పాస్ సరైన ముందుచూపు చర్యలు చేపట్టక పోవడం భారీగా నీరుచేరింది. దీంతో ఈ మార్గం ద్వారా రాకపోకలు సాగించాల్సిన ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కొద్దిపాటి వర్షం కురిసినా అండర్‌పాస్‌లో నీరు చేరుతుండడంతో సమస్య జటిలంగా మారింది. ప్రస్తుతం ప్రజలు పడుతున్న సమస్యను దృష్టిలో పెట్టుకొని డ్రైన్ కాలువ ద్వారా నీటిని వెలుపలికి పంపించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

● మినుము పైరుకు అపార నష్టం

పంగులూరు : ఎడతెరపి లేకుండా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మినుము పంటకు తీవ్రనష్టం వాటిల్లిందని ఏవో డి.సుబ్బారెడ్డి తెలిపారు. సాగులో ఉన్న 2,500 ఎకరాల్లో మినుము పంటకు నష్టం వాటిల్లినట్లు ఉన్నతాధికారులకు ప్రాథమికంగా నివేదించనున్నట్లు ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని కొండమూరు, రేణంగివరం గ్రామాలలో వర్షానికి దెబ్బతిన్న మినుము పైరును స్థానిక రైతులతో కలసి శుక్రవారం పరిశీలించారు. అధిక వర్షంతో కోత దశకు చేరుకున్న మినుము పైరులో కాయకు బూజు వచ్చి రంగుమారడం, మొలకరావడంతో పాటు పూతరాలడం గుర్తించినట్లు తెలిపారు. నష్ట నివేదికపై ఉన్నతాధికారుల అనుమతి వచ్చిన వెంటనే సాగులో ఉన్న ప్రతి ఎకరాను పరిశీలించి నష్టం అంచనాలను రూపొందించనున్నట్లు తెలిపారు.

మార్టూరు : మూడు నాలుగురోజుల నుంచి అల్పపీడన ప్రభావంతో మండలంలో కురిసిన భారీ వర్షాలకు మినుము, పత్తి పంట దెబ్బతింది. వాటిలో మినుము పంట పూర్తిగా దెబ్బతింది. మండలంలో మినుము పైరును బొల్లాపల్లిలో 520, ద్రోణాదులలో 337, కోలలపూడిలో 64 ఎకరాలలో సాగు చేశారు. ఆగస్టు నెలలో పంటను సాగు చేశారు. ప్రస్తుతం కురిసిన భారీ వర్షాలకు మినుము పంటలో నీళ్ల నిలిచాయి. బయటకు వచ్చిన మినుము విత్తనాలు తడిసి బూజుపట్టేదశ కు చేరాయి. రైతులు ఎకరాకు రూ.20 వేలను పెట్టుబడిగా పెట్టారు. దీంతో మండలంలో వెయ్యి ఎకరాలలో మినుము పంట దెబ్బతిన్నట్లు ఏవో ప్రాథమిక అంచనా రిపోర్టులో పంపించారు. అదేవిధంగా మండలంలోని మార్టూరు, రాజుపాలెం గ్రామాలలో వేసిన 600 ఎకరాలలోని పత్తి పంట కూడా దెబ్బతిన్నట్లు రైతులు చెబుతున్నారు ఇదే విధంగా మరింతగా వర్షాలు కొనసాగితే పత్తిపంట పూర్తిగా దెబ్బతింటుందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ మేరకు ప్రాథమిక అంచనా రిపోర్టును కూడా అధికారులు పంపించారు. ఇదిలా ఉండగా శుక్రవారం బొల్లాపల్లి, తాటివారిపాలెం గ్రామాలలో రైతులతో కలిసి దెబ్బతిన్న మినుము పంటను ఏవో లావణ్య పరిశీలించారు. ఇక రైతు సంఘం నాయకులు వీరవల్లి కృష్ణమూర్తి మినుము పంట రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

● పొంగి పొర్లుతున్న వాగులు వంకలు

వేటపాలెం(చీరాల) : కొద్ది రోజులుగా కురుస్తున్న అకాల వర్షం శుక్రవారం అదే జోరుతో కుమ్మరించింది. వాగులు వంకలు వర్షపు నీళ్లతో పొంగి పొర్లాయి. ఇళ్లల్లో నుంచి ప్రజలకు బయటకు రావడానికి నానా ఇబ్బందులు పడ్డారు. రహదారులు, డ్రయిన్‌లు నిండాయి. దీంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. అలాగే పలుచోట్ల దారి మళ్లించాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే స్థానిక పరిస్థితులు ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు కలెక్టర్ డా.వినోద్‌కుమార్ దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు గురు, శుక్ర వారాలు చినగంజాం, వేటపాలెం, చీరాల, ఇంకొల్లు కారంచేడు మండలాల అన్ని విద్యాలయాలకు సెలవు ప్రకటించింది. మరో అల్పపీడనం పొంచిఉన్నట్లు అధికారులు తెలుపడంతో ప్రజలు భీతిల్లుతున్నారు.

● నీటమునిగిన వరిపొలాలు

చినగంజాం : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని మున్నంవారిపాలెం గ్రామ సమీపంలోని మట్టిగుంట వాగుకు వరద రావడంతో ఆప్రాంతంలో నీటమునిగిన వరి పంట పొలాలను పర్చూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ లవన్న శుక్రవారం పరిశీలించారు. మట్టిగుంట వాగుకు వరద రావడంతో మున్నంవారిపాలెం ప్రాంతంలో 30 ఎకరాల్లో వేసిన వరి పంట నీట మునిగింది. వరద నీటిని త్వరతగతిన బయటకు పంపే విధంగా రైతులతో సమావేశం నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కలెక్టర్ ఏవో ఆర్.చంద్రశేఖర్‌ని ఆదేశించారు. వేసిన పంట దెబ్బతినకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.


చినగంజాంలో సిబ్బందికి సూచనలిస్తున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి లవన్న, పర్చూరు అండర్‌పాస్ వద్ద నిలిచిన నీరు

రహదారిపై గోతులతో వాహన చోదకులకు ఇక్కట్లు

అద్దంకి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో పెద్ద గొయ్యి పడడంతో వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. భవానిసెంటర్ నుంచి రేణింగవరం రోడ్డు కూడలిలో పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో నామ్ రోడ్డులో ప్రయాణించే వాహనాలతో పాటు రేణింగవరం రోడ్డు వైపు మలుపు తిరిగే వాహనాల చోదకులు కూడా ఇబ్బంది పడుతున్నారు. అదే సమయంలో రేణింగవరం రోడ్డులోని కల్వర్టుకు కూడా గోతి ఏర్పడి ఇనుపచువ్వలు బయట పడ్డాయి. దీంతో ఒక వైపు పెద్ద గొయ్యి, మరో వైపు కల్వర్టుకు ఏర్పడ్డ గోతితో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు.


అద్దంకి భవానీసెంటర్‌లో ఏర్పడిన గొయ్యి, రేణింగవరం దారిలో ఊచలు తేలిన కల్వర్టు

నాణ్యమైన మద్యం విక్రయానికి ప్రభుత్వం చర్యలు

- చీరాలలో ఎక్సైజ్ అధికారులతో పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే


అధికారులతో కలిసి సురక్ష యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కల్తీ మద్యాన్ని నియంత్రించి నాణ్యమైన సరుకు అందించేందుకు రాష్ట్రప్రభుత్వం అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. శుక్రవారం పట్టణంలో ఒంగోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత నాగరాజు, బాపట్ల డీపీఈవో (ఎఫ్ఏసీ) వెంకటేశ్వర్లుతో కలిసి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సురక్ష యాప్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 104 ఏ4 షాపులు, బార్లులో యాప్ వినియోగిస్తున్నట్లు తెలిపారు. బెల్ట్ షాపులపై ఇప్పటికే ఉక్కుపాదం మోపినట్లు వివరించారు. అక్రమ మద్యం వివరాలను టోల్ ఫ్రీ నెం.14405కు అందించాలన్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. వారి వెంట సీఐ నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, తదితర సిబ్బంది ఉన్నారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి తీవ్ర గాయాలు


గాయపడ్డ బాలుడు

చెరుకూరు/ అడుసుమల్లి (పర్చూరు), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పిచ్చికుక్కల దాడిలో పలువురు తీవ్రంగా గాయపడిన ఘటన పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు, అడుసుమల్లి గ్రామాల్లో శుక్రవారం చోటుచేసుకుంది. చెరుకూరులోని నలుగురు వ్యక్తులను పిచ్చికుక్క గాయపరచగా, అడుసుమల్లిలో మరో నలుగురు వ్యక్తులను కరిచాయి. దాడివిషయం తెలియడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు. క్షతగాత్రులను స్థానికంగా ఉన్న చెరుకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నందించారు. వీధి కుక్కలతోపాటు, పిచ్చికుక్కలు దాడిచేసి గాయపరుస్తున్నాయని కుక్కల బెడద నుండి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు. పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలియజేసినా, పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు దృష్టిసారించి వీధికుక్కలను అడవి ప్రాంతాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గృహనిర్మాణాన్ని విజయవంతం చేయండి : ఎమ్మెల్యే

ఇంకొల్లు, అక్టోబరు 24,(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతో పెద్దఎత్తున గృహనిర్మాణ కార్యక్రమం చేపడుతోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నిబంధనల మేరకు ఎంట్రీ చేయడం ద్వారా ఎటువంటి లోపాలు లేకుండా ప్రగతి సాధించవచ్చన్నారు. డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సమీక్షలో హౌసింగ్ డీఈ ఖాదర్‌వలి, తహసీల్దారు శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాసరావు అధికారులు పాల్గొన్నారు. నాగండ్ల టూ పావులూరు రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పరిశీలించారు. నిర్మాణపు పనులలో నాణ్యతను పరిశీలించారు. నాగండ్ల, పావులూరు, నక్కలపాలెం, కొత్తపాలెం గ్రామాల ప్రజలు ఏలూరికి ఘనంగా స్వాగతం పలికారు. ఏళ్లతరబడి ఈ రహదారిలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని కూటమి ప్రభుత్వంలో మీ సహకారంతో నూతనంగా బీటీ రోడ్డు నిర్మించడం సంతోషదాయకమన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల అధ్యక్షులు నాయడు హనుమంతరావు, ఇంకొల్లు పీఏసీఎస్ ఛైర్మన్ కరి శ్రీనివాసరావు, ఆయా గ్రామాల స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా మస్తాన్ శ్రీధర్ బాధ్యతలు


డిప్యూటీ ఎంపీడీవోను అభినందిస్తున్న ఎంపీడీవో వరూధిని, సిబ్బంది

అద్దంకిటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మండల డిప్యూటీ ఎంపీడీవోగా మస్తాన్ శ్రీధర్ శుక్రవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. వేటపాలెం మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై అద్దంకి మండలం డిప్యూటీ ఎంపీడీవో బాధ్యతులు చేపట్టారు. నూతనంగా విధులలో చేరిన మస్తాన్ శ్రీధర్‌కు ఎంపీడీవో బి.వరూధిని, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.



గుండ్లకమ్మ వంతెనకు పొంచి ఉన్న ముప్పు

- రెండు దశాబ్దాలుగా తాత్కాలిక మరమ్మతులతోనే సరి
- చినుకు పడితే మొదటికి వస్తున్న సమస్య


గుండ్లకమ్మ వంతెనపై ఏర్పడ్డ గోతులు

అద్దంకి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ నదిపై ఉన్న వంతెన వద్ద ఎప్పు డు ఏ ప్రమాదం జరుగుతుందో అని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. అద్దంకి- దర్శి రోడ్డులో అద్దంకి పట్టణం సమీపంలో గుండ్లకమ్మ నదిపై సుమారు ఐదు దశాబ్దాల క్రితం వంతెన నిర్మించారు. అయితే రెండు దశాబ్దాల క్రితం కొన్ని కారణాలతో వంతెన కుంగింది. దీంతో కొంతకాలం పాటు రాకపోకలు నిలిపివేశారు. అనంతరం తాత్కాలిక మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరిం చారు. దీంతో రెండు దశాబ్దాలుగా రాకపోకలు సాగిస్తునే ఉన్నారు. అయితే వంతెనపై తరచూ గోతులు పడడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. దీంతో శిథిలావస్థకు చేరిన వంతెనపైనే ప్రజలు రాకపోకలు సాగిస్తు న్నారు. వంతెనకు చేసిన మరమ్మతులు చిన్నపాటి వర్షం కురిసినా, వెంటనే మరలా పూర్వ స్థితికి చేరుతోంది. తారు రోడ్డుపై గోతులు పడ్డ విధంగానే వంతనపై కూడా గోతులు పడ్డాయి. శ్లాబులో వేసిన ఇనుప చువ్వలు కూడా బయటపడ్డాయి. దీంతో రాక పోకలకు వాహనచోదకులు ఆందోళన చెందు తున్నారు. అయితే ఏ సమయంలో కూలు తుందో అని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఒక వేళ జరగరానిది ఏదైనా జరిగి వంతనపై రాకపోకలకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి గుండ్ల కమ్మ నదిపై కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలని వాహన చోదకులు, పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


గోతుల వెంబడి వెళుతున్న వాహనాలు

ఇంకొల్లులో పోలియోపై అవగాహన ర్యాలీ

ఇంకొల్లు,అక్టోబరు 24,(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని రోటరీక్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలియోపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పల్స్‌పోలియోపై గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కలిపించారు. పోలియోను తరిమికొట్టాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు బలగం కోటేశ్వరరావు, కార్యదర్శి అలవల రాఘవరెడ్డి, కోశాధికారి గోరంట్ల నాగేశ్వరరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. శుక్రవారం కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్ దాచర్ల వెంకటరమణయ్య నాల్గవ డివిజన్‌లోని మస్టర్ పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాలలోనూ విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తగా కార్పొరేషన్ తరుపు నుంచి రెయిన్ కోట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే ప్రజల ఆరోగ్యం కోసం ప్రతి నిత్యం పనిచేస్తున్న కార్మికులు వ్యక్తిగత ఆరోగ్యంపైనా దృష్టి సారించాలన్నారు. పనిచేసే సమయంలో తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి కార్మికుడు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని ఆదేశిం చారు. కార్యక్రమంలో ఏసీ భూపాల్‌రెడ్డి, డాక్టర్ వైష్ణవి పాల్గొన్నారు.

శోక సంద్రంలో గోళ్లవారిపల్లి

వింజమూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంతో మండలంలోని గోళ్లవారిపల్లి శోకసముద్రంలో మునిగింది. గ్రామంలో గోళ్ల మాలకొండయ్య, సుశీల దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు. మాలకొండయ్యది వ్యవసాయ కుటుంబం. వీరి కుమారుడు రమేష్ చిరుద్యోగం చేస్తూ బెంగళూరులో ఉంటున్నాడు. అక్క కుమార్తెనే రమేష్ పెళ్లి చేసుకున్నాడు. బస్సు ప్రమాదంలో రమేష్ కుటుంబం సజీవదహనం అయింది. ఈ విషాద సంఘటనతో గ్రామం మూగబోయింది.

● ఎంపీ వేమిరెడ్డి పరామర్శ

మృతుడు రమేష్ కుటుంబాన్ని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. అలాగే ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రూ.3లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. కర్నూలు బస్సు దుర్ఘటన కలిచి వేసిందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ఒక ప్రకటనలో తెలిపారు. మృతుల ఆత్మలకు శాంతి కలగాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు.

● వెంకయ్య దిగ్భ్రాంతి

వెంకటాచలం : బస్సు ప్రమాదంపై పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద బాధిత కుటుంబాలను ఫోన్ ద్వారా పరామర్శించారు. కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ సహా ఇతర అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడిన ఆయన ప్రస్తుత పరిస్థితిపై ఆరాతీశారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో మాట్లాడి పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతోనూ ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు.

రమేష్ కుటుంబాన్ని ఆదుకుంటాం...

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



రమేష్ తల్లిని ఓదారుస్తున్న ఎమ్మెల్యే కాకర్ల


వింజమూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోళ్ల వారిపల్లెలో బస్సు ప్రమాదంలో మృతి చెందిన గోళ్ల రమేష్ కుటుంబాన్ని శుక్రవారం ఉదయం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంఘటన ఎలా జరిగింది.. కుటుంబ వివరాలపై కలెక్టర్, ఎస్పీతో ఫోన్ ద్వారా మాట్లాడి డీఎన్ఏ టెస్టులకు సంబంధించిన ఏర్పాట్లు చేసేలా చూడాలని తెలిపారు. గ్రామం నుంచి కుటుంబ సభ్యులను కర్నూలుకు పంపించేందుకు ప్రభుత్వ వాహనంతోపాటు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఈ సంఘటన జరగడం చాలా దురదృష్టకరమని, రమేష్ కుటుంబాన్ని అన్నీ విధాలా ఆదుకుంటామన్నారు. టీడీపీలో క్రియాశీలకంగా ఉన్న కుటుంబానికి ప్రభుత్వపరంగా సాయం చేస్తామన్నారు. తానూ కూడా సొంత కుటుంబంలా చూసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మా... నేను సేఫ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంలో మృత్యుంజయుడిగా నెల్లూరు వేదాయపాలెం పరిధిలోని వెంకటరెడ్డి నగర్‌కు చెందిన ముసులూరి శ్రీహర్ష నిలిచారు. వెంకటరెడ్డి నగర్‌కు చెందిన హనుమంతరావు, ఉమాదేవి సంతానం శ్రీహర్ష. ఇంజనీరింగ్‌లో మెకానికల్ పూర్తి చేసి మూడేళ్ల క్రితం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడ్డారు. దీపావళికి నెల్లూరుకు వచ్చిన శ్రీహర్ష పండుగ ముగిసిన తర్వాత వీసా పనిపై తల్లిదండ్రులను తీసుకొని ఈ నెల 22 రాత్రి హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడ పనులు చూసుకొని 23 రాత్రి తల్లిదండ్రులు నెల్లూరుకు, శ్రీహర్ష కర్నూలు మీదుగా బెంగళూరుకు బయలుదేరారు. శుక్రవారం ఉదయం హనుమంతరావు దంపతులు ఇంటికి చేరుకున్నారు. శ్రీహర్ష బెంగళూరుకు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు ఆవేదనకు అద్దూ లేకుండా పోయింది. అయితే కొద్ది సేపటికే శ్రీహర్ష తల్లిదండ్రులకు ఫోన్ చేసి నేను క్షేమంగా ఉన్నాను. చిన్న గాయాలు తగిలాయి....కర్నూలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాను... మీరు ఆందోళన చెందకండి .. అని ధైర్యం చెప్పాడు. దీంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

బస్సు ప్రయాణం

భయం..భయం !



● మూలపడ్డ స్పీడ్ లేజర్ గన్‌లు

గతంలో వేగంగా వెళుతున్న వాహనాలకు రవాణాశాఖ అధికారులు స్పీడ్ లేజర్ గన్‌లను ఉపయోగించి కేసులు నమోదు చేసేవారు. అయితే గత రెండేళ్లుగా ఈ గన్‌లు మూలన పడటంతో కేసులు నమోదు కావడంలేదు. దీంతో బస్సులు రోడ్డుపై గంటకు 80 కిలోమీటర్ల స్పీడుతో వెళ్లాల్సి ఉంటే 100 నుంచి 120 కి.మీ వేగంతో దూసుకు పోతున్నాయి.

- రోడ్లపై అతివేగంగా ప్రైవేట్ ట్రావెల్స్
- నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యం
- ఆలిండియా పర్మిట్లతో అధికారుల చేతులకు సంకెళ్లు
- వేగం వైపే ప్రయాణికుల మొగ్గు
- అదే బాటలోనే ఆర్టీసీ...

● ఫిట్‌నెస్ సంగతేంటి ?

వాహన ఫిట్‌నెస్‌కు సంబంధించి భద్రత పరంగా ఉండాల్సిన నిబంధనలను వాహనదారులు పాటిస్తున్నారా...? లేదా..? అని వాహనాన్ని చూసినప్పుడు మాత్రమే తెలుస్తుంది.కానీ ఈశాన్య రాష్ట్రాలకు వాహనాలు వెళ్లకుండానే ఫిట్‌నెస్‌లు పొందే అవకాశాన్ని ఈశాన్యరాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కల్పిస్తున్నాయి. దీంతో వాహనదారులు భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేసి వాహనాలను రోడ్లపై తిప్పుతున్నారు.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాద ఘటన బస్సుల్లో ప్రయాణించేవారికి భయాన్ని పుట్టించింది. ఈ ఘటనలో నెల్లూరు జిల్లాకు చెందిన పదిమంది ప్రయాణం చేస్తుండగా, ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సజీవదహనం అయ్యారు. నలుగురు క్షేమంగా బయటకు రాగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. జిల్లా నుంచి రోజూ వందల సంఖ్యలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం, చెన్నై, విజయవాడ ప్రాంతాలకు వెళుతుంటాయి. ఈ బస్సుల్లో ఎన్ని బస్సులకు పర్మిట్‌లు ఉన్నాయి, ఎన్ని బస్సులు ఫిట్‌నెస్ కలిగి ఉన్నాయి అన్న దానిపై ప్రజలకు కానీ, అధికారులకు కానీ స్పష్టత లేదు.

అధికారుల చేతులకు సంకెళ్లు

ఆల్‌ఇండియా టూరిస్ట్ పర్మిట్ రాకముందు ప్రతీ వాహనం ఎక్కడ నుంచి ఎక్కడికి తిరగాలి అనేదానిపై స్పష్టత ఉండేది. ఉదాహరణకు నాగాలాండ్‌లో రిజిస్ట్రేషన్ అయిన వాహనం ఆ రాష్ట్రంలో బయలుదేరి పక్కరాష్ట్రాలకు వెళ్లి తిరిగి ఆరాష్ట్రానికే వెళ్లాలన్న నిబంధనలు గతంలో ఉండేది. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకు వచ్చిన ఆల్‌ఇండియా టూరిస్ట్ పర్మిట్ విధానంతో ఏ వాహనం ఎక్కడైనా రిజిస్టర్ చేసుకొని ఏ రాష్ట్రంలో అయినా తిప్పుకోవచ్చు. దీంతో వాహనాలపై అధికారులకు పట్టు తగ్గిపోయింది. కొత్తగా వచ్చిన సాఫ్ట్‌వేర్‌తో కేసులు రాసినా కూడా గతంలోలా ఆన్‌లైన్ వ్యవస్థలో వేరే ట్రాన్‌సెక్షన్ జరగకుండా అడ్డుకునే పరిస్థితి లేదు. మనరాష్ట్రంలో తిరుగుతన్న 90 శాతం వాహనాలు ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ అయినవే. వాటిపై ఏవైనా చర్యలు తీసుకోవాలంటే రిజిస్ట్రేషన్ అథారిటీ కలిగిన ఈశాన్యరాష్ట్రాల అధికారులే తీసుకోవాలి. దీంతో రాష్ట్రంలో రవాణాశాఖ అధికారుల చేతికి పూర్తిగా సంకెళ్లు పడ్డాయి.

భద్రతా ప్రమాణాలేవీ ?

ప్రమాదం జరిగినప్పుడు అందులో నుంచి బయట పడటానికి కావాల్సిన భద్రతా ప్రమాణాలను ప్రైవేటు వాహనాలు పాటించడం లేదు. ఉదాహరణకు ఎమర్జెన్సీ డోరు ఉన్నా డోరు పక్కనే సీటు ఉండటం, అగ్నిమాపక పరికరాలను బస్సుల్లో ఉంచుకోక పోవడం, బస్సు మధ్య భాగంగా ప్రయాణికులు నడిచేందుకు సరిపడా స్థలం లేకపోవడం, డ్రైవర్ క్యాబిన్‌లో రెండవ డ్రైవర్ నిద్రించేందుకు బెడ్‌లు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు దిగడానికి ఇబ్బందిగా ఉంటుంది. ఇలా ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో ప్రమాదం సంభవించినప్పుడు సురక్షితంగా బస్సులో నుంచి బయటకు వచ్చేందుకు అవకాశం ఉండడం లేదు.

ఆర్టీసీ బస్సులూ అంతే..

ఆర్టీసీ బస్సుల్లోనూ ప్రస్తుతం ప్రయాణం భయంగా ఉందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నాయుడుపేట వద్ద ఆర్టీసీ బస్సుల్లో మంటలు వ్యాపించడం ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేశాక ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగింది. అయితే బస్సుల సంఖ్య పెరగక పోవడంతో ఉన్న బస్సులనే మరమ్మతులు చేసి రోడ్లపై అధికారులు తిప్పుతున్నారన్న ఆరోపనలు ఉన్నాయి. ఈ క్రమంలో అవి ఎప్పు డు ఏ ప్రమాదానికి గురైతాయోనని ప్రజలు భయపడుతున్నారు.

ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటం రూ. 2,389లు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రైతులు పండించిన పంటలకు కేంద్రం మద్దతు ధర ప్రకటించింది. ఇందుకు సంబంధించిన పోస్టరును శుక్రవారం జేసీ వెంకటేశ్వర్లు కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విడుదల చేశారు. ఈ ధరలు రైతులకు తెలిసేలా ప్రతీ మండల కేంద్రం, రైతు సేవా కేంద్రాలు, రెవెన్యూ కార్యాలయాలు, మండల వ్యవసాయాధికారుల కార్యాలయాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ కేంద్రాల్లో పోస్టర్లు అతికించాలని అధికారులకు సూచించారు. క్వింటం ఏగ్రేడ్ రకం ధాన్యం రూ.2389లు, సాధారణ రకం రూ.2369లు, మొక్కజొన్నకు రూ.2400, పత్తి పొడవు రకానికి రూ.8110, మినుములు రూ.7800, పెసలు రూ.8768, కందులు రూ.8వేలు, నువ్వులు రూ.9846, వేరుశనగ రూ.7263, పొద్దుతిరుగుడు విత్తనాలు రూ.7721, గడ్డి నువ్వులు రూ.9537, సోయాబీన్ రూ.5328, సజ్జలు రూ.2775, జొన్నలు(మల్‌దండి) రూ.3749, జొన్నలు(హైబ్రిడ్) రూ.3699లుగా ప్రకటించారు. అయితే ఈ ధరకు పంటలు అమ్ముకోవాలంటే రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. అలాగే వీఏఏలు, వీహెచ్ఏల వద్ద రిజిస్టర్ చేయించుకుకోవాల్సి ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ అనిత తదితరులు పాల్గొన్నారు.



8

నేడు నాగుల చవితి

● ఆలయాలు, పుట్టల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

పారిశ్రామిక ప్రగతి కోసమే ఇండస్ట్రీ పార్టనర్‌షిప్ డ్రైవ్

● ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిషోర్



మాట్లాడుతున్న ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిషోర్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రగతి కోసమే ఇండస్ట్రీ పార్టనర్‌షిప్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఏపీఐఐసీ ఎండీ ఎం.అభిషిక్త్ కిషోర్ అన్నారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో నెల్లూరు ఏకేనగర్‌లోని సంస్థ కార్యాలయంలో గురువారం ఇండస్ట్రీయల్ పార్కు పారిశామికవేత్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. నవంబరు 15 వరకు నెలపాటు రాష్ట్రంలోని అన్నీ జిల్లాల పారిశ్రామిక వాడల్లో ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు అనేక రాయితీలతో పాటు ప్రోత్సాహకాలు అందిస్తున్నదన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా యువత ముందుకు రావాలన్నారు.అనంతరం ఏకేనగర్ ప్రాంతంలో ఆయన మొక్కలు నాటారు. పలు పరిశ్రమల యజమానులు,యూనియన్ సభ్యులు ఈ సందర్భంగా వారి సమస్యలను ఎండీ దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జెడ్ఎం ఎల్.శివ కుమార్, డీజెడ్ఎం వెంకట సురేష్, ఐలా కమిషనర్ బ్రహ్మయ్య, ఇంజనీరింగ్ అధికారి శేఖర్‌రెడ్డి, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నుడా వైస్ చైర్మన్‌గా జేసీ

బాధ్యతల స్వీకరించిన వెంకటేశ్వర్లు

8

మరో ముప్పు

- అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మరోసారి భారీ వర్షాలు
- రానున్న రెండు, మూడు రోజులూ వానలే...
- పెన్నాకు వరదలు.. సెంట్రల్ వాటర్ కమిషన్ హెచ్చరిక
- 1281 హెక్టార్లలో పంట నష్టం



కందుకూరు : చుట్టుగుంట రోడ్డులో చప్టాపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీటిలో అవస్థలు పడుతున్న ద్విచక్ర వాహనదారులు

నెల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒక గండం తప్పిందనుకుంటే... ఇప్పుడు మరో గండం పొంచి ఉంది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడడంతో జిల్లాలో మళ్లీ వర్షాలు మొదలయ్యాయి. శుక్రవారం కొన్ని మండలాల్లో భారీగా, మరికొన్ని మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలో సరాసరి వర్షపాతం 65.3 మి.మీగా నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. అత్యధికంగా కందుకూరులో 168.2 మి.మీ, ఏఎస్‌పేటలో 100.6 మి.మీ, బుచ్చిలో 86.8 మి.మీ, కావలిలో 85.2 మి.మీ, ఉదయగిరిలో 85 మి.మీ, పొదలకూరులో 82.8 మి.మీ, వింజమూరులో 82.4 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. ఈ ప్రభావంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కొన్ని వాగుల ఉధృతి నాలుగు రోజుల నుంచి తగ్గడం లేదు. మనుబోలు వద్ద కండలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రోడ్డుపైకి నీరు చేరింది. దీంతో ఆ రోడ్డు మీదుగా రాకపోకలు నిలిపేశారు. కొండాపురం మండలం కొమ్మి గ్రామం వద్ద గండికట్ల చెరువు అలుగు దాటి నీరు ప్రవహిస్తుండడంతో కావలి, కొండాపురం మధ్య రాకపోకాలు నిలిచాయి. కాగా అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారే అవకాశాలున్నట్లు విపత్తు నిర్వహణ శాఖ అధికారులు ప్రకటించారు. ఈ ప్రభావంతో రానున్న రెండు, మూడు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలిపారు.



జలదంకి : ఒకరినొకరు పట్టుకుని వాగు దాటుతున్న గ్రామస్థులు, విద్యార్థులు

● హెచ్చరించిన సెంట్రల్ వాటర్ కమిషన్

పెన్నానదికి భారీ వరద వచ్చే అవకాశమున్నట్లు సెంట్రల్ వాటర్ కమిషన్ హెచ్చరించింది. ఈ మేరకు శుక్రవారం పెన్నా నది, దాని ఉపనదులకు సంబంధించిన పరిస్థితులను వివరిస్తూ ప్రత్యేక బులెటిన్‌ను జిల్లా అధికారులకు పంపింది. రాబోయే ఐదు రోజుల్లో పెన్నా, లోయర్ పెన్నార్, పాపఘ్ని, చెయ్యేరు నదుల క్యాచ్‌మెంట్లలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని, దాని మూలంగా భారీ వరద సోమశిలను తాకే అవకాశమున్నట్లు తెలిపింది.

● 1281 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

నెల్లూరు(వ్యవసాయం) : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటలపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనాకొచ్చారు. శుక్రవారం సాయంత్రానికి అందిన సమాచారం మేరకు జిల్లాలో దాదాపుగా 1281 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు లెక్కగట్టారు. 1265.4 హెక్టార్లలో వరి, 11.4హెక్టార్లలో వేరుశనగ, 4హెక్టార్లలో సజ్జ దెబ్బతిన్నాయి. దాదాపుగా 43 గ్రామాల్లోని 1125 మంది రైతులకు చెందిన 1281 హెక్టార్ల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారుల అంచనా.

● సోమశిలకు పెరుగుతున్న వరద

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద శుక్రవారం పెరిగింది. 47,348 క్యూసెక్కులు వస్తుండగా, దిగువకు నాలుగు గేట్ల ద్వారా 63,460 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టులో 69.407 టీఎంసీలు నిల్వ ఉంది.

● కండలేరులో 59.905 టీఎంసీలు

రాపూరు : మండలంలోని కండలేరు డ్యామ్ పూర్తి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 59.905 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 4600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 3450 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఉందన్నారు.

● సంగం బ్యారేజ్ పెరిగిన ప్రవాహం

సంగం : బ్యారేజ్‌కి వస్తున్న నీటి ప్రవాహం శుక్రవారం 74 వేల క్యూసెక్కులకు పెరిగింది. ఉదయం 64 వేల క్యూసెక్కుల ఉన్న నీటి ప్రవాహం క్రమేణా పెరిగి 74 వేల క్యూసెక్కులకు చేరింది. దీంతో బ్యారేజ్ గేట్లన్నీ పైకెత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే నెల్లూరు బ్యారేజ్‌కి విడుదల చేస్తున్నారు.

డ్యాముల నిండా నీరు



రాళ్లపాడు ప్రాజెక్టులో 18.5 అడుగుల నీటిమట్టం

● నిండుకుండలా రాళ్లపాడు

లింగసముద్రం : భారీ వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది.శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ప్రాజెక్టు నీటిమట్టం 18.5 అడుగులకు చేరింది.ప్రాజెక్టులోకి 2,500 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తున్నట్లు డీఈఈ ఎం వెంకటేశ్వర్లు చెప్పారు.కాగా కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాల సుబ్రహ్మణ్యం శుక్రవారం మధ్యాహ్నం ఎస్సై ఎం నారాయణతో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. తహసీల్దార్ కోటేశ్వరరావు, ఆర్ఐ రమణయ్య, వీఆర్‌వోలు ప్రాజెక్టు దిగువ గ్రామాలను సందర్శించి, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దండోరా వేయించారు.

● గండిపాళెంలో తొమ్మిది అడుగులు..

ఉదయగిరి : కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గండిపాళెం జలాశయ నీటిమట్టం తొమ్మిది అడుగులకు చేరినట్లు జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి శుక్రవారం తెలిపారు. పైతట్టు నుంచి 900 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుందన్నారు.

बैंक ऑफ़ इंडिया
బ్యాంక్ ఆఫ్ ఇండియా

హైదరాబాద్ అసెట్ రికవరీ శాఖ

10-1-1199/2, PTI బిల్డింగ్, 3వ అంతస్తు, A.C. గార్డ్స్, హైదరాబాద్-500004

ఫోన్: 9160006393, ఇ-మెయిల్ : AssetrecoveryBranch.Telangana@bankofindia.bank.in

ఇ-వేలం అమ్మకం ప్రకటన SARFAESI చట్టం, 2002 & అందులో రూపొందించబడిన నియామాల క్రింద

SARFAESI చట్టం, 2002 మరియు అందులో రూపొందించబడిన నియమాల క్రింద ఈ అమ్మకం ప్రకటన జారీ చేయడానికి మరియు అమ్మకం యొక్క అన్ని హక్కులను వినియోగించుకొనుటకు బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు పూర్తి హక్కులు కలిగి ఉన్నారు. **బ్యాంక్ ఆఫ్ ఇండియా** సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టబడిన/ చార్జ్‌చేయబడిన, బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిచే నిర్మాణాత్మక / భౌతిక స్వాధీనం చేసుకోబడినట్టి దిగువ వివరించబడిన స్థిరాస్తులు దిగువ వివరించబడిన రుణగ్రహీతలు మరియు హామీదారుల నుండి బ్యాంక్ ఆఫ్ ఇండియా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించవలసిన దిగువ వివరించబడిన బకాయిలను రాబట్టుకొనుటకు **"ఎక్కడ ఎలా ఉన్నది అలా", "అక్కడ ఏమున్నదో అది"** మరియు **"అక్కడ ఉన్నది ఉన్నట్లు"** ప్రాతిపదికన **25.11.2025** తేదీన ఇ-వేలం ద్వారా విక్రయించబడునని మీకు / రుణగ్రహీతలకు / హామీదారులకు / తనఖాదారులకు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

అమ్మకం తేది & సమయం: 25.11.2025 న ఉ. 11.00 గం. నుండి సా. 5.00 గం. వరకు (అమ్మకం ముగిసే వరకు బహుళ విస్తరణలతో)

1) సాధారణ ప్రజానీకం మరియు ఆసక్తిగల కొనుగోలుదారులు ఏదేని ఆస్తి కొనుగోలుకు సంబంధించి బిడ్‌లో పాల్గొనుటకు ఏదేని విచారణ కొరకు మరియు ఇందుకు సంబంధించి అన్ని ఇతర విషయాల కొరకు (నియమ నిబంధనలో తెలిపిన విధంగా వారి ఆన్‌లైన్ బిడ్ దాఖలు చేయుట మినహా) లేదా ఏదేని విచారణ వివరాలు పొందుటకు పైన తెలిపిన శాఖను సంప్రదించవలసినదిగా సూచించబడుచున్నారు. 2) మూడవ పార్టీలకు చెల్లించవలసిన ఏదేని దాని కొరకు లేదా ఇందుకు సంబంధించి ఏదేని మూడవ పార్టీతో కాగోరు కొనుగోలుదారులు, సాధారణ ప్రజానీకం ఏమేని వ్యవహారాలు జరిపితే దానికి బ్యాంక్ ఎలాంటి బాధ్యత వహించదు/ జవాబుదారీ కాదు అని సాధారణ ప్రజానీకం/ ఆసక్తిగల కొనుగోలుదారులను హెచ్చరించడమైనది. అది వారి సొంత బాధ్యత మరియు వ్యయ ప్రయాసలపై నిర్వహించుకొనవచ్చును. 3) బిడ్డింగ్ ప్రాసెసింగ్ కోట్ చేసిన వారి అంతిమ బిడ్ మొత్తాన్ని మాత్రమే బ్యాంకుకు ఆస్తి యొక్క కృతార్థ బిడ్డరుచే మొత్తం చెల్లించబడాలని తెలియజేయడమైనది (నియమ నిబంధనల ప్రకారం) + వర్తించు పన్నులు (అమ్మకం సర్టిఫికెట్ నమోదు నిమిత్తం TDS, స్టాంపు డ్యూటీ, చార్జీలు/ఫీజులు బిడ్డరుచే విడిగా చెల్లించబడాలి. 4) ఏదేని SRO వద్ద ఆస్తి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి బ్యాంకుకు తెలియరాని ఏదేని నిషేదం ఉన్నదేమోనని ఆస్తి నమోదు గురించి తమకుతాము కొనుగోలుదారులు సంతృప్తి చెందవలెను. 5) కాగోరు బిడ్డర్లు బిడ్ దాఖలు చేసే ముందు ఆస్తిపై ఏమేని చట్టబద్ధమైన / ప్రభుత్వ / మునిసిపాలిటీ క్లెయిమ్‌లు అనగా ఆస్తి పన్ను, ఎలక్ట్రిసిటీ, వాటర్, వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహణ బకాయిలు లేదా ఏమేని ఇతర బకాయులు మొదలగు వాటి గురించి వివరాలు పొందవలెను మరియు తమకుతాము సంతృప్తి చెందవలెను. 6) సదరు ఇ-వేలం ఆస్తి / ఆస్తులకు సంబంధించి భవిష్యత్‌లో ఏమేని వ్యాజ్యాలు ఎదురయ్యే విషయంలో సదరు వేలం అట్టి వ్యాజ్యం ఫలితానికి లోబడి ఉంటుందని కాగోరు బిడ్డర్లు గమనించవలెను. 7) కాగోరు బిడ్డర్లు బిడ్ దాఖలు చేసే ముందు సరియైన / స్వతంత్ర విచారణ చేసుకోవలెను.

క్ర. సం.	రుణగ్రహీతలు మరియు హామీదారుల పేరుతోపాటు మిగులు బకాయి వివరాలు
1)	**రుణగ్రహీతలు మరియు హామీదారులు: శ్రీ తల్లపనేని చిన్న వెంకటేశ్వర్లు,** డి.నం.26/2/1608, వెంకటరెడ్డినగర్, వేదాయపాలెం, నెల్లూరు, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా - 524004; **శ్రీ తల్లపనేని శ్రీనివాసులు** (స్వర్గీయ శ్రీమతి తల్లపనేని హైమావతి యొక్క న్యాయవారసులు), తండ్రి టి.చిన్న వెంకటేశ్వర్లు, ఇల్లు నం.88, 1వ మెయిన్, 2వ క్రాస్, పద్మావతి లేఅవుట్, కితిగనూరు మెయిన్‌రోడ్, శ్రీనివాస దేవాలయం దగ్గర, ఆర్‌కె పురం, బెంగళూరు నార్త్, బెంగళూరు, కర్నాటక - 560036; **శ్రీమతి జంపాల సుప్రజ** (స్వర్గీయ శ్రీమతి తల్లపనేని హైమావతి యొక్క న్యాయవారసులు), తండ్రి టి.చిన్న వెంకటేశ్వర్లు, 23510, అదాగియో టెర్, యాష్బర్న్, వివి 20148-7459, వర్జీనియా, యుఎస్ఏ; **శ్రీమతి తల్లపనేని జ్యోతి** (స్వర్గీయ శ్రీమతి తల్లపనేని హైమావతి యొక్క న్యాయవారసులు), తండ్రి టి.చిన్న వెంకటేశ్వర్లు, 1531 హాస్విండ్ పిఎల్, మిల్టన్, ఓఎన్, ఎల్9టి, 8వై3, ఒంటారియో, కెనడా; **శ్రీ తల్లపనేని చిన్న వెంకటేశ్వర్లు** (స్వర్గీయ శ్రీమతి తల్లపనేని హైమావతి యొక్క న్యాయవారసులు), డి.నం.26/2/1608, వెంకటరెడ్డి నగర్, వేదాయపాలెం, నెల్లూరు, SPSR నెల్లూరు జిల్లా - 524004; **శ్రీ లఘుంసాని వెంకటేశ్వర్లు తండ్రి కృష్ణయ్య,** డి.నం.26-2-1462, వెంకటరెడ్డినగర్, వేదాయపాలెం, నెల్లూరు, SPSR నెల్లూరు జిల్లా - 524004. **బకాయి మొత్తం: రూ.1,59,34,642.17** ప్లస్ కాంట్రాక్చువల్ రేటు వంతున 28.08.2023 నుండి వడ్డీతో పాటు వ్యయాలు, ఖర్చులు వగైరా, ఏదేని తిరిగి చెల్లించబడిన మొత్తం తగ్గించి **స్థిరాస్తి వివరణ: SRO నెల్లూరు వద్ద నమోదైన డాక్యుమెంట్ నం.6979/1994 తేది: 07.12.1994 ప్రకారం స్వర్గీయ శ్రీమతి తల్లపనేని హైమావతి భర్త శ్రీ తల్లపనేని చిన్న వెంకటేశ్వర్లు పేరున నమోదైన ఆస్తి:-** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా - SPSR నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా - నెల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం - నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ లిమిట్స్ - నెల్లూరు సిటీ - వేదాయపాలెం, పట్టా నం.43 సర్వే నం.7/1/బి లో కవర్ చేయబడిన ఎ.3.75 సెంట్ల విస్తీర్ణం గల భూమి లేఅవుట్ ప్లాన్‌చే ఇంటి ప్లాట్లుగా మార్పు చేయబడినవి మరియు అందులో ప్లాట్ నం.26 & 27 కలిగిన 66 2/3 అంకణములు సైట్ మొత్తంలో 41 2/3 అంకణముల విస్తీర్ణం గల సైట్ **సరిహద్దులు: తూర్పు:** రోడ్డు, **దక్షిణం:** ప్లాట్ నం.లు: 28 &29, **పశ్చిమం:** సదరు ప్లాట్ లోని మిగతా సైట్ అనగా ప్లాట్ నం.26 & 27 టి.హైమావతిచే బత్తిన బసవమ్మకు విక్రయించబడినవి, **ఉత్తరం:** ప్లాట్ నం.లు 22 & 23. అన్ని దాని అనుభోగ హక్కులతో దానిపై నిర్మాణాలు మరియు స్థలం యొక్క 41 2/3 అంకణాల విస్తీర్ణానికి పై సరిహద్దులతో **MOD:** 5682/2013 dt 24.06.2013, **SRO:** నెల్లూరు; **MOD:** 8461/2017 dt 27.11.2017, **SRO:** నెల్లూరు; **MOD:** 12473/2021 dt 30.10.2021, **SRO:** నెల్లూరు (R.O) **సేల్ డీడ్:** 6979/1994 dt 07.12.1994, **SRO:** నెల్లూరు, **స్వాధీనం:** భౌతిక

రిజర్వు ధర : రూ.166.06 లక్షలు   బయానా : రూ.16.61 లక్షలు   బిడ్ పెరుగుదల మొత్తం: రూ.1.00 లక్షలు

నియమ నిబంధనలు: 1) ఆస్తి వివరాలను చూడడానికి https://baanknet.comపై క్లిక్ చేయండి. 2) వేలం అమ్మకం వెబ్‌సైట్ https://baanknet.com/eauction-psb/x-login ద్వారా ఇ-వేలం ఆన్‌లైన్/ బిడ్డింగ్ ద్వారా **25.11.2025న ఉ.11.00 గం. నుండి సా.05.00 గం.** వరకు (అమ్మకం ముగిసేవరకు 10 నిమిషాల బహుళ విస్తరణలతో) ఉంటుంది. 3) కాగోరు బిడ్డర్లు పోర్టల్ **https://baanknet.com/eauction-psb/bidder-registration**లో తమ పేర్లను ఒకసారి నమోదు చేసుకొని యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్ పొందవలెను. సదరు పోర్టల్‌లో ఆన్‌లైన్ ఇ-వేలంలో పాల్గొనుటకు వారు అప్పుడు అనుమతించబడతారు. బయానా వారి వ్యాలెట్‌కు డిపాజిట్ చేయబడాలి. 4) ఏ సమయంలోనైనా కనీసం మొదటి బిడ్ పెంపుదల మొత్తం కంటే మీ బిడ్ మొత్తం రిజర్వు ధర కంటే ఎక్కువగా ఉండాలి మరియు బిడ్లు పై తెలిపిన పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో దాఖలు చేయాలి మరియు బిడ్డరు ఇ-వేలంలో పాల్గొనుటకు బయానా కొరకు వారి వాలెట్‌లో తగిన బ్యాలెన్స్‌ను కలిగియుండవలెను. 5) కాగోరు బిడ్డర్లు ఇ-వేలంలో పాల్గొనుట మరియు నమోదు కొరకు చెల్లుబాటగు ఇ-మెయిల్ చిరునామా & మొబైల్ నంబరు కలిగి ఉండవలెను. 6) బిడ్డర్లు తమ బిడ్లు దాఖలు చేసే ముందు మరియు ఇ-వేలం అమ్మకంలో పాల్గొనే ముందు ఇ-వేలం అమ్మకం సవివరమైన నియమ నిబంధనల కొరకు మా వెబ్‌సైట్ **https://www.bankofindia.co.in** చూడవలసిందిగా సూచించడమైనది. 7) సెక్యూర్డ్ క్రెడిటార్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ **https://www.bankofindia.co.in/**లో ఏర్పాటు చేయబడిన నియమ నిబంధనలకు లోబడి అమ్మకం ఉంటుంది. 8) సంబంధిత శాఖ యొక్క ముందస్తు అనుమతితో ఆస్తిని తనిఖీ చేసుకోవచ్చును. సంప్రదించవలసిన వారి వివరాలు పైన పొందుపరచబడినవి. 9) అమ్మకం క్రింద కొనుగోలుదారులకు ఏమేని భూములను భౌతిక స్వాధీనం చేయడానికి లేదా డీమార్కేట్ చేయడానికి బ్యాంకు బాధ్యత వహించదు. 10) ఎక్కడైనా వర్తించే TDSను మరియు ఎక్కడైనా వర్తించే చట్టబద్ధమైన బకాయిలు, రిజిస్ట్రేషన్ చార్జీలు & స్టాంప్ సుంకం మొదలగువాటిని వేలం కొనుగోలుదారే భరించవలెను.

తేది: 22.10.2025, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254
కోడిగుడ్ల ధర (100): 560	

పొంగిన వాగులు - స్తంభించిన రాకపోకలు

కొండాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా మూడు రోజులుగా భారీ వర్షాలు కురిశాయి. శుక్రవారం వర్షం ఆగినప్పటికీ నీటి ప్రవాహం తగ్గలేదు. కొండాపురం-రేణమాల మధ్యలో ఉన్న ఉప్పుటేరు బ్రిడ్జి పై నుంచి నీరుపారడంతో పోలీసులు వాహనాలు వెళ్లకుండా నిలిపివేశారు. సత్యవోలు - అగ్రహారం మధ్యలో ఉన్న మిడతవాగు, కొమ్మి గ్రామం వద్ద గండికట్ల చెరువు అలుగు పారడంతో రోడ్లపైకి నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీవో ఆదినారాయణ, ఎస్‌ఐ మాల్యాద్రి వాహనదారులు వెళ్లకుండా సిబ్బందిని ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యారు.



ఉధృతంగా పారుతున్న గండికట్ల చెరువు అలుగు

రూ.30 లక్షల వెచ్చించినా...

తప్పని వరద ముప్పు!

- జలదిగ్బంధంలో అన్నపుగుంట ప్రాంత వాసులు
- ఫలించని అధికారుల ముందు జాగ్రత్త చర్యలు
- రైల్వే ట్రాక్ వెంబడి కాలువ నిర్మిస్తేనే శాశ్వత పరిష్కారం

కావలి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అనుకున్నదొక్కటి.. అయిందొక్కటి.. అన్నట్లుగా తయారైంది పట్టణంలోని వైకుంఠపురం అన్నపుగుంట ప్రాంత వాసుల పరిస్థితి. ఈ ప్రాంతానికి వరద ముప్పు తప్పించేందుకు మున్సిపాల్టీ రూ.30 లక్షల ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టినా వరద ముప్పు తప్పలేదు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు అన్నపుగుంట లోతట్టు ప్రాంతమంతా జలమయమైంది. ఆ ప్రాంతం ముంపునకు గురికాకుండా చేసేందుకు మున్సిపల్ అధికారులు తమ సిబ్బంది ద్వారా ఎప్పటి కప్పుడు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినా వరద ముంచెత్తింది. అర్ధరాత్రి వరకు ఎలాంటి వర్షం లేకుండా ప్రశాంతంగా ఉండడంతో ఆ ప్రాంత వాసులు తమ ద్విచక్ర వాహనాలను సైతం ఇంటి ముందు రోడ్లపైనే ఉంచారు. అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి ఆ ప్రాంతమంతా జలదిగ్బంధంలో చిక్కుకుంది. వీధుల్లో నడుము లోతు నీరు చేరడంతో ఇళ్లు మునకనకు గురయ్యాయి. దీంతో పాటు ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన వాహనాలు నీట మునిగి స్టార్ట్ కాకుండా మొరాయించాయి. జనతాపేట పై ప్రాంతంలోని అటవీ ప్రాంతం నుంచి వచ్చే నీటి సంతటిని అన్నపుగుంటకు మళ్లించడంతో ఇన్‌ఫ్లోకు తగ్గట్లు అవుట్ ఫ్లో లేక ఆ ప్రాంతం మునకకు గురైంది. ఓ పక్క మున్సిపల్ అధికారులు కార్మికులతో నీటిని బయటకు పంపే చర్యలు చేపట్టారు. అయి తే రైల్వే లేను మార్గంలో నీరు వెళ్లేందుకు ఉన్న తూముకు అడ్డంగా ముళ్ల చెట్లు, చెత్తా చెదారం చేరడంతో అక్కడ నీరు ముందుకు కదలడం లేదు. ఈ క్రమంలో అన్నపుగుంట నుంచి ఉత్తరం వైపున రైల్వే ట్రాక్ వెంబడి పెద్ద కాంక్రీట్ కాలువ నిర్మిస్తే తప్ప ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం ఉండదని స్థానికులు అంటున్నారు.



అన్నపుగుంట ప్రధాన రోడ్డులో ద్విచక్ర వాహన చోదకుల అవస్థ



అన్నపుగుంట పక్క వీధిలో ఇళ్లను చుట్టుముట్టిన వర్షపు నీరు



నీరు వెళ్లేందుకు చర్యలు చేపట్టిన అధికారులు

కావలి డివిజన్‌లో వర్షపాత వివరాలు

కావలి డివిజన్‌లో గురువారం రాత్రి ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. శుక్ర వారం ఉదయం వరకు డివిజన్‌లో సరాసరి 78.1 మి.మీ వర్షపాతం నమోదైంది. డివిజన్‌లో అత్యధికంగా అల్లూ రులో 117.6మి.మీ కురవగా అత్యల్పంగా జలదంకిలో 40.2 మి.మీ వర్షం కురిసింది. దుత్తలూరులో 70.2, వింజమూరులో 82.4, కలిగిరిలో 116.8, కావలి 85.2, బోగోలులో 79.8, దగదర్తిలో 48.6, కొడవలూరులో 73.2, విడవలూరులో 67.4 మి.మీ వర్షపాతం సమోదైంది.

బాధితులకు ఎంపీ, ఎమ్మెల్యేల పరామర్శ



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలం దారకానిపాడులో కారుతో గుద్దించిన ఘటనలో గాయపడిన పవన్, భార్గవ్‌లను, వారి కుటుంబ సభ్యులను శుక్రవారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పరామర్శించారు. వారు చికిత్స పొందుతున్న గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి పరామర్శించిన ఎంపీ వేమిరెడ్డి వారికి వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం అందజేసి మాట్లాడుతూ ఈ దుర్ఘటన చాలా బాధాకరమని, వారి కుటుంబానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు గ్రామీణ రహదారుల ఛిద్రం

కందుకూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కందుకూరు ప్రాంతంలోని రహదారులు అధ్వానంగా మారాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల రహదారులు పూర్తిగా దెబ్బతిని అడుగుకో గుంత ఏర్పడడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. పలు గ్రామాలకు అనుసంధానంగా ఉన్న గ్రావెల్ రోడ్లు, పొలాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిని మోటారు సైకిళ్లపై కూడా ప్రయాణించలేని దుస్థితి నెలకొంది. కందుకూరు నుంచి శింగమనేనిపల్లి వెళ్లే రహదారి కేపీఎస్ఎం రోడ్డు నుంచి శింగమనేనిపల్లి వరకు పూర్తిగా దెబ్బతినగా, పోకూరు-చీమలపెంట రోడ్డు కూడా గతుకు లమయంగా మారింది. కందుకూరు నుంచి చుట్టుగుంట వెళ్లేమార్గంలో మూడుచోట్ల లోలెవల్ చప్టాలపై ఉధృతంగా వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలోని మన్నేటికోట, ఆత్మకూరు, చుట్టుగుంట, కుమ్మరి పాలెం, కంద్రావారిపాలెం గ్రామాలతో పాటు ఉలవపాడు నుంచి కందు కూరుకు వచ్చేవారు చుట్టూ తిరిగిరావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కందు కూరు నుంచి ఆదిఆంధ్రకాలనీ, దివివారిపాలెం, గనిగుంట గ్రామాలకు వెళ్లే రోడ్డులో కూడా ఆదిఆంధ్రకాలనీ సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి ఎంతో కాలంగా అసంపూర్తిగా ఉండగా ఇక్కడ నిర్మించిన డైవర్షన్ రోడ్డు పైపు లు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. కందుకూరు-మాచవరం, ఆనందపురం, దొండపాడురోడ్డు దెబ్బతిని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



కందుకూరు మున్సిపాలిటీలోని ఆదిఆంధ్రకాలనీ రోడ్డులో పైపు కల్వర్టుకు ఏర్పడిన రంధ్రం

వర్షాలొస్తే వణుకే!

జలదంకి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో మండలంలో ప్రజలు, వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. జలదంకి-తెల్లపాడు రహదారిపై గోపన్నపాలెం వద్ద చప్టాపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాహనరాకపోకలు నిలిచిపోవడంతో కావలి పట్టణం, మండలకేంద్రం జలదంకి వివిధ పనుల నిమిత్తం వెళ్లేందుకు గోపన్నపాలెం, అన్నవరం, గట్టుపల్లి, తిమ్మసముద్రం తదితర గ్రామాల ప్రజలు. విద్యార్థులు ఒకరి చేయి ఒకరు పట్టుకుని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే మండలంలోని బ్రాహ్మణ క్రాక నుంచి బోగోలు మండలంలోని కప్పరాళ్ళతిప్ప వద్ద ఎన్‌హెచ్-16 జాతీయ రహదారిని కలిపే ఈ ఆర్ అండ్‌బి రోడ్డుపై చామదల వద్ద ఉన్న చప్టాపై నేరెళ్ల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అలాగే కమ్మవారి పాలెం వాగు చప్టాపై ఉధృతంగా నీరు ప్రవహిస్తుండడంతో ప్రజల రాకపోకలు స్తంభిస్తున్నాయి. సాధారణంగా పల్లెప్రజలు కోరుకునేది భారీవర్షాలు కురిసి ఊళ్లో చెరువు నిండాలి, జిల్లాలోని జలాశయాలు నిండాలి, వాగులు, వంకలు, కుంటలు జలకళతో ఉట్టిపడాలి అని కోరుకోవడం సహజం. ఎందుకంటే వర్షాలు పడితే పంటలు పండుతాయని, పాడిపశువులకు బీళ్లలో మేతదొరుకుతుందని ఆశ. కానీ ఇదే గ్రామీణుల్లో కొన్ని గ్రామాల ప్రజలు వాతావరణంలో మార్పులు వచ్చి భారీ వర్షసూచన వాతావరణశాఖ ప్రకటిస్తే వీరి వెన్నులో వణుకే. ఎందుకంటే భారీవర్షాలు వస్తే ఊరిని ఆనుకుని ఉండే వాగులు ఉధృతంగా ప్రవహించి బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి, ఎప్పుడు ఏ ఆరోగ్య సమస్య వచ్చి సమీపంలోని పట్టణంలో ఆసుపత్రికి వైద్యం నిమిత్తం వెళ్లలేమోననే భయంతో పాటు నిత్యావసర సరుకులు రోజుల తరబడి దొరకని పరిస్థితి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



కమ్మవారిపాలెం రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

ప్రమాదకరంగా రామన్న చెరువు

అల్లూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామన్న చెరువు నీటిమట్టం అధికమై రోడ్డుపైకి నీరు పారుతుండడంతో ప్రమాదాలు జరుగకుండా అల్లూరు కావలి రోడ్డుపై రాకపోకలను నిలిపి వేసినట్టు ఇన్‌చార్జి తహసీల్దారు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్ర వారం రోడ్డుపై కంపను వేయించి రోడ్డును మూయించి వేశారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు కౌరుగుంట మీదుగా వెళ్లాలని ఈ రోడ్డుపై రాకపోకలు జరపకూడదని పేర్కొన్నారు. రామన్న చెరువు నీటిమ ట్టం తగ్గేంతవరకు ప్రమాదాలు జరుగకుండా ఉండేం దుకు ఈ చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రభు, ఏఈ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.





కాలనీలోకి చేరిన వర్షపు నీరు, రహదారికి అడ్డంగా కంప వేయిస్తున్న తహసీల్దారు

- పట్టణ పరిధిలోని కాలనీల్లోకి వర్షపు నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గాంధీకాలనీ, రజకకాలనీ, బీసీ కాలనీల్లో వర్షపునీరు ఇళ్లలోకి చేరింది. మహిళలు వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొనగా స్థానిక నాయకుడు నజీర్‌బాషా చొరవతో సమాచారం అందుకున్న నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు పూడిపోయిన కాలువలను ఎక్స్‌కవేటర్‌తో పూడిక తొలగించి నీటిని తొలగింప చేయించారు. దీంతో కాలనీ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


విద్యార్థులకు నగదు పురస్కారం



విద్యార్థులకు నగదు అందజేస్తున్న జడ రజని

లింగసముద్రం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): లింగసముద్రం కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో గత ఏడాది 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన దేవూరి కిషోర్‌కు రూ.5000, ఏసుపోగు శృతికి రూ.5000 చొప్పున అదే హైస్కూల్ పూర్వపు విద్యార్థి, డీఆర్‌డీవో మాజీ డైరెక్టర్ మండలంలోని తిమ్మారెడ్డిపాలెంకు చెందిన జడ శ్రీనివాసులు జ్ఞాపకార్థం ఆయన సతీమణి రజనీ శుక్రవారం నగదు పురస్కారాలు అందజేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడిశెట్టి మాధవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మెన్ డీ.రవి, మాజీ సర్పంచు ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎం.కొండయ్య, కే.వెంకటేశ్వర్లు, కే.ప్రభాకర్, శ్రీనివాసులు బంధువులు, విద్యార్థులు పాల్గొన్నారు.













జిల్లాను అన్నీ రంగాల్లో అగ్రపథంలో నిలుపుదాం

● కలెక్టర్‌తో మంత్రి ఆనం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అన్నీ రంగాల్లో జిల్లాను అగ్రపథంలో నిలిపేందుకు అందరం కలిసి కృషి చేద్దామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కలెక్టర్ హిమాన్షు శుక్లాకు సూచించారు. శుక్రవారం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆనం రామనారాయణరెడ్డిని కలెక్టర్ మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, పురుగతిపై వారు చర్చించారు.

● ఆనంను కలిసిన లంకా దినకర్

20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ మంత్రి ఆనంను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వివిధ కేంద్ర పథకాలు, పలు కార్యక్రమాలపై చర్చించారు.

సైకో జగన్ బాలయ్యను విమర్శించడమా..?

● నుడా చైర్మన్ కోటంరెడ్డి



మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఒక సైకోలా నందమూరి బాలకృష్ణను విమర్శించటం ఏమిటని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నీచ, రౌడీ, దోపిడీ సంస్కృతితో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్, 50 ఏళ్లగా కళామతల్లి సేవలో ఉన్న బాలయ్యను విమర్శంచడం తగదన్నారు. అసెంబ్లీలో బూతుల సంస్కృతిని ప్రోత్సహించింది నీవు కాదా జగన్ అని ప్రశ్నించారు. ఆస్తికోసం తల్లిని, చెల్లిని గెంటేశావ్, రాజకీయాల కోసం బాబాయిని హత్య చేయించావని విమర్శించారు. తాగుబోతులా జగన్ మాట్లాడుతున్నా డని, ముందు ఆయన మానసిక స్థితిని చక్కదిద్దుకోవాలని సలహా ఇచ్చారు.

విస్తరిస్తున్న స్క్రబ్ టైఫస్

గడ్డి జ్వరం కలవరం


స్క్రబ్ టైఫస్ వ్యాధిగ్రస్తుడు, వ్యాధికి కారణమయ్యే కీటకం

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలో ఐదుగురు వ్యాధిగ్రస్థులు నమోదు అయ్యారు. వెంటనే చికిత్సలు అందించగా వారు కోలుకుంటున్నారు. ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్నాం. వ్యాధికి మందులు అందుబాటులో ఉన్నాయి.

- డాక్టర్ భాస్కర్‌రావు, ఎపిడమాలజీ సెల్ ప్రాజెక్టు డైరెక్టర్

వ్యాధిపై ఆందోళన వద్దు



స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. వ్యాధికి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఎక్కువగా పిల్లలపై ప్రభావం ఉంటుంది. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.

- డాక్టర్ ఎంవీ రమణయ్య, ప్రజారోగ్య పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

● జిల్లాలో ఇప్పటికే ఐదు కేసుల నమోదు
● నిర్లక్ష్యం చేస్తే కోమాలోకి...
● అరుదుగా వచ్చే వ్యాధితో ఆందోళన
● లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడ్ని సంప్రదించాలి

నెల్లూరు (వైద్యం) అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జిల్లాలో స్క్రబ్ టైఫస్ వ్యాధి (గడ్డి జ్వరం లేదా జంగిల్ ఫీవర్) ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. నల్లిని పోలి ఉండే కీటకం వల్ల వస్తున్న ఈ వ్యాధిని నిర్లక్ష్యం వహిస్తే వ్యాధిగ్రస్థులు కోమాలోకి వెళ్లే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చాలా అరుదుగా వచ్చే ఈ వ్యాధి ప్రస్తుతం జిల్లాలోనూ వెలుగు చూస్తోంది. ఇప్పటికే ఐదుగురు ఈ వ్యాధినపడి చికిత్స పొందుతున్నారు. రెండు నెలల వ్యవధిలో ఐదు కేసులు నమోదు కావటం వైద్య ఆరోగ్యశాఖలో కలవరం రేకెత్తిస్తున్నది.

● లక్షణాలు కనిపిస్తే డాక్టర్ని సంప్రదించాలి

ఈ వ్యాధి సోకితే డెంగీ తరహాలో తీవ్రమైన కండరాల నొప్పి, తలనొప్పి ఉంటాయి. అలాగే జీర్ణ సంబంధింత వ్యాధుల లక్షణాలు కనిపిస్తాయి. ఆయా లక్షణాలు గమనించి వెంటనే వైద్య నిపుణులను సంప్రదించాలి. నిర్లక్ష్యం వల్ల శరీరంలోని పలు అవయవాలు దెబ్బతినే అవకాశం ఉంది. ఇంట్లోనే నక్కినల్లిని పోలే ఈ చిన్న కీటకం ఎక్కువగా పిల్లలపై ప్రభావం చూపుతుంది.

● జాగ్రత్తలు తప్పనిసరి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పాత మంచాలు, పరుపులు, దిండ్లు లాంటివి తీసివేయాలి. పిల్లలకు కాళ్ల, చేతులు ఉప్పి ఉంచేలా దుస్తులు వేయడం వల్ల ఈ కీటకానికి దూరంగా ఉండవచ్చు. ఊపిరితిత్తుల్లో వాపు వచ్చి ఊపిరి తీసుకోవటం ఇబ్బందిపై ఉంటే స్క్రబ్ టైఫస్ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలి. మెదడులోని రక్షిత పొరల్లో వాపు రావటం వల్ల తీవ్రమైన నరాల సమస్యలు తలెత్తే ప్రమాదం కూడా ఉంటుంది. మూత్ర పిండాల వ్యాధుల తో ఈ వ్యాధివల్ల వచ్చి ప్రాణాపాయానికి దారి తీసే అవకా శం, గుండె కండరాల వాపు వచ్చే అవకాశం ఉంటుంది.

● ఐదు కేసుల నమోదు

గత నెలలో నెల్లూరు వెంకటేశ్వరపురం, ఎన్టీఆర్ నగర్‌లో వ్యాధిగ్రస్థులు నమోదయ్యారు. ఈనెలలో మనుబోలు, కావలి, తోటపల్లి గూడూరుకి చెందిన ఒక్కొక్కరు వ్యాధి బారిన పడారు. వీరంతా చిన్న పిల్లలే కావటం తల్లిదండ్రుల్లో ఆందోళన రెకెత్తిస్తుంది. దీంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వ్యాధి బాధితుల నివాసాలు ఉండే చుట్టు పక్కల ఎవరైనా ఈ వ్యాధికి గురయ్యారా..? అనే విషయాన్ని క్షణ్ణంగా పరిశీలిస్తున్నారు. వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే వీల్‌పెలిక్స్ పరీక్ష చేస్తున్నారు. అయితే అనుమానితుల్లో వ్యాధిగ్రస్థులు లేరని నిర్ధారించుకుని ఊపిరి వైద్యాధికారులు పీల్చుకున్నారు.

నేడు నాగుల చవితి

● ఆలయాలు, పుట్టల వద్ద ఏర్పాట్లు
● నోములు, వ్రతాలు చేయనున్న మహిళలు



నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శనివారం వివిధ ఆలయాలు, పలు ప్రాంతాల్లోని పుట్టల వద్ద భక్తులు నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. తెల్లవారుజాము నుంచే ప్రారంభమయ్యే ఈ పండుగకు భక్తులు ఇబ్బందులు పడకుండా అన్నీ సౌకర్యాలను నిర్వాహకులు కల్పించారు. ఆలయాలు, పుట్టల వద్ద విద్యుత్ అలంకరణ, క్యూలైన్లు, తాగునీరు, ఉచిత ప్రసాదాల వితరణకు ఏర్పాట్లు చేశారు. కార్తీక, శ్రావణ మాసాల్లో చతుర్థి రోజున సర్పాలను పూజించడం వల్ల పుణ్యం, సౌభాగ్యం, ఆరోగ్యం, సంతానం లాంటి ఫలితాలు లభిస్తాయని పురాణ కథనం. అలాగే కుజ, కాలసర్ప దోషం, రాహు, కేతు గ్రహాల దోషాలు తొలగాలంటే కఠిన ఉపవాసంతో నాగుల చవితి నోములు నోస్తారు. నాగులను పూజించడం వల్ల సర్ప దోషాలు, రోగాలు పోయి సౌభాగ్యవంతులవుతారని భక్తుల నమ్మకం. పొలాల్లో పుట్టల వద్ద నాగుల చవితి సందర్భంగా పూజలు చేయడం వల్ల పంటలను నాశనం చేసే ఎలుకలను నాగులు నివారిస్తాయని భక్తుల విశ్వాసం. మానవ శరీరాన్ని పుట్టతో పోలుస్తారు. పుట్టలో 9 రంధ్రాలు ఉన్నట్లే మానవ శరీరంలోనూ 9 రంధ్రాలు ఉంటాయిని భావిస్తుంటారు. నాగుల చవితి పూజలు, నోములను ఎక్కువగా మహిళలే ఆచరిస్తారు. దీపావళి అనంతరం కార్తీక శుద్ధ చవితిరోజున నాగుల చవితిని జరుపుకుంటారు.

నుడా వైస్ చైర్మన్‌గా జేసీ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నుడా కార్యాలయంలో శుక్రవారం నుడా వైస్ చైర్మన్‌గా జేసీ మొగిలి వెంకటేశ్వర్లు బాధ్యతలు తీసుకున్నారు. ఈసందర్భంగా నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆయనకు అభినందలు తెలియజేశారు. నూతన బాధ్యతలు చేపట్టిన జేసీకి పుష్పా గుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. నుడా అభివృద్ధి దిశగా పయనించేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం నుడా ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. నుడా పరిధిలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పారదర్శకమైన పరిపాలనతో సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా పని చేస్తానని వైస్ చైర్మన్ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నుడా అభివృద్ధి పథంలో పయనించేందుకు వైస్ చైర్మన్ అనుభవం, మార్గదర్శకత చాలా కీలకం కానుందన్నారు.

బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్ అరెస్ట్

నెల్లూరు(క్రైం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చంపుతానని పండ్ల వ్యాపారిని బెదిరించి నగదు దోచుకున్న కేసులో బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు కేసు వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. బుచ్చిరెడ్డిపాలెం శాంతినగర్‌కు చెందిన కావలి మహేష్ సంవత్సర కాలంగా మద్రాసు బస్టాండు కూరగాయల మార్కెట్ సమీపంలో తోపుడు బండిపై పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని వద్ద శోధన్‌నగర్‌కు చెందిన కృష్ణసింగ్ తరచూ పండ్లు కొనుకున్నేవాడు. గురువారం రాత్రి వహాబ్‌పేటలోని పెట్రోల్‌బంకు వద్ద మహేష్ పండ్లు అమ్ముతుండగా కృష్ణసింగ్ అక్కడికి వెళ్లి మద్యం తాగేందుకు రూ.వెయ్యి ఇవ్వమని అడిగాడు. ఆయన డబ్బులు లేవని చెప్పడంతో పక్కనే దొరికిన ఖాళీ బీర్‌బాటిల్‌ను పగులగొట్టి డబ్బులు ఇవ్వకపోతే చంపుతానని బెదిరించాడు. మహేష్ భయంతో నగదు ఇచ్చాడు. విషయాన్ని గమనించిన మహేష్ స్నేహితులు తైసిఫ్, మహబూబ్ అక్కడికి రావడాన్ని గమనించిన కృష్ణసింగ్ పరారయ్యాడు. బాధిత పండ్ల వ్యాపారి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేసి శుక్రవారం నిందితుడుని అరెస్ట్ చేశారు.

ముళ్లపొదల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆత్మకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారంపేట గ్రామ సమీపంలో ఎంఎస్ఎంఈ పార్కు, నేషనల్ హైవే మధ్య ముళ్ల పొదల్లో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటపడింది. సమాచారం అందుకున్న పోలీసులు, వీఆర్వో కె సాయికుమార్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

'ఏక్ భారత్ - ఆత్మనిర్భర్ భారత్' పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత

వెంకటాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యూలో శుక్రవారం సర్దార్ వల్లభాయి పటేల్ 150వ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సమైక్య పాదయాత్రకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 'ఏక్ భారత్ - ఆత్మనిర్భర్ భారత్' సమైక్య పాదయాత్ర పోస్టర్లను విక్రమసింహపురి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయి పటేల్ దార్శనికతను స్మరించుకుంటూ 'ఒక దేశం- ఒకే దృక్పథం' అనే భావన ప్రతిబింబించేలా పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 31న ఉదయం 8 గంటలకు నెల్లూరులోని వీఆర్‌సీ మైదానం నుంచి వేదాయపాలెం వరకు జరిగే పాదయాత్రలో విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, జిల్లా యువజన అధికారి మహేందర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, ప్రొఫెసర్ సుజా ఎస్ నాయర్, డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్, డాక్టర్ వై విజయ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఉదయగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సౌకర్యార్థం డిపోలో శనివారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం రమేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలను ఉదయం 9 నుంచి 10 గంటల వరకు 9959225095 అనే నెంబర్‌కు ఫోన్‌చేసి తెలపాలన్నారు. డిపో పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డిగ్రీ పరీక్షలలో ఇద్దరు డీబార్

వెంకటాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : విక్రమసింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలలో 15,421 మంది విద్యార్థులకుగాను 14,391 మంది హాజరు కాగా మిగిలిన 1030 మంది గైర్హాజరయ్యారు. సూళ్లూరుపేటలోని ఎస్‌వీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.

రేపు పెన్షనర్స్ సమావేశం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, కార్యదర్శి ఎస్‌పీవీఎస్ మూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశం నెల్లూరులోని భక్తవత్సలనగర్ పెన్షన్ భవనంలో ఉదయం 9.30గంటలకు జరుగుతుందని తెలిపారు. డీఆర్, 11వ పీఆర్‌సీ బకాయిలు, కొత్తగా మంజూరైన డీఆర్ విడుదల తదితర అంశాలపై చర్చిస్తామని, అనంతరం డాక్టర్ రామచంద్రారెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో షుగర్ వ్యాధిపై అవగాహన కోసం తియ్యని ముప్పు అనే నాటికను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని పెన్షనర్లు హాజరుకావాలని కోరారు

రేపు వెటరన్ అథ్లెటిక్స్ ఎంపికలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం వెటరన్ అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆ రోజు ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులు గుంటూరు జిల్లాలో డిసెంబర్ 13, 14 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ఎవరినీ దస్తావేజు లేఖరులుగా నియమించలేదు

● జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎవ్వరినీ దస్తావేజు లేఖరులుగా నియమించలేదని, ఎవ్వరికీ దస్తావేజు లేఖరులుగా లైసెన్సు ఇవ్వలేదని రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు తమకు తామే ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో చలానాలు చెల్లించి కావాల్సిన సమయంలో స్లాట్ బుక్ చేసుకుని నేరుగా సబ్ రిజిస్ట్రార్‌లను సంప్రదించి దస్తావేజులను రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని కోరారు. నిషేధిత భూముల జాబితా, మార్కెట్ విలువలు, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్లు, స్పెషల్ వివాహాల కోసం ఐజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

27న ఈపీఎఫ్ సమావేశం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27న నెల్లూరులో నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి డీ కృష్ణారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్య నిధి చెల్లించే ఉద్యోగులు ఈ పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరంలో సరస్వతీనగర్‌లోని కృష్ణ చైతన్య జూనియర్ కాలేజీలో ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందని, ఈపీఎఫ్‌కు సంబంధించిన నగదు తీయడం, జమ చేయడం, క్లైమ్స్ పెండింగ్ వంటి అన్నీ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కట్టా



నెల్లూరు(స్టోన్ హౌస్‌పేట), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన కట్టా సుబ్రమణ్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం నుంచి తిరుపతిలో జరుగుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ 13వ రాష్ట్ర మహాసభల్లో శుక్రవారం సుబ్రహ్మణ్యం ఎన్నిక జరిగింది. 1989లో ఆర్టీసీలో చేరిన ఎస్‌డబ్ల్యూఎఫ్‌లో పలు హోదాల్లో పనిచేశారు.

లంచాల కోసం పీడించొద్దు!

● మీ అవినీతి ఆధారాలు నా దగ్గరున్నాయి..! ● రిజిస్ట్రేషన్ అధికారుల సమీక్షలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి


రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (రూరల్/వైద్యం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆస్తుల క్రయ, విక్రయాలు జరిపేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వచ్చే పేద ప్రజల వద్ద లంచాలు డిమాండ్ చేయవద్దు.. మీ అవినీతికి సంబంధించిన అన్నీ ఆధారాలు నా దగ్గరున్నాయి... జాగ్రత్తగా ఉద్యోగాలు చేసుకోండి అంటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి సబ్ రిజిస్ట్రార్లను హెచ్చరించారు. జిల్లా రిజిస్ట్రార్ ఆంజనేయులతో కలిసి నెల్లూరులోని పలువురు సబ్‌రిజిస్ట్రార్లతో ఆయన నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలు వారి అవసరాల కోసం ఆస్తులు అమ్ముకోవడం, కొనుగోలు చేయడం జరుగుతుందని, వారిని లంచాల కోసం పీడిస్తే ఊరుకోనని చెప్పారు. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగే అవినీతికి సంబంధించి అన్నీ ఆధారాలు తనవద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. జాగ్రత్తగా వ్యవహరించకపోతే అవన్నీ ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించారు.

సబ్ రిజిస్ట్రార్లపై విజిలెన్స్ విచారణ జరపాలి

జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ల తీరుపై విజిలెన్స్ విచారణ జరపాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు లీలా మోహన్, నందిపోగు రమణయ్య విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లు ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారి రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నారని ఆరోపించారు. నగర నడిబొడ్డున ఉన్న రూ.1.50 కోట్ల ఇరిగేషన్ స్థలానికి అక్రమ రిజిస్ట్రేషన్ చేసి స్వాహా చేసిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదో అర్థం కావటం లేదన్నారు. అక్రమాలు, అక్రమ రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ఆ ధారాలు తన వద్ద ఉన్నాయని చెబుతున్న రూ రల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, ఆ ఆధారాలను బయటపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి విజయకుమార్, తల్లు శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

సుబ్బానాయుడు మృతి టీడీపీకి తీరని లోటు

● మాలేపాటి కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి నారాయణ


మాలేపాటి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి నారాయణ, వక్ఫ్‌బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్, తదితరులు

దగదర్తి(బిట్రగుంట), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు హఠాన్మరణం పార్టీకి తీరని లోటు అని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి మాలేపాటి స్వగృహానికి వెళ్లిన మంత్రి నారాయణ మాలేపాటి సుబ్బానాయుడు, టీడీపీ యువనేత మాలేపాటి భానుచందర్ నాయుడు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్బానాయుడు సోదరులు రవీంద్రనాయుడు, సుధాకర్‌నాయుడు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బానాయుడు ఆలస్యంగానైనా కోలుకుని క్షేమంగా బయటకు వస్తారని భావించామన్నారు. హఠాత్తుగా మృతి చెందుతాడని ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో ఆత్మీయంగా ఉండే సుబ్బానాయుడుని కోల్పోయినందుకు బాధగా ఉందన్నారు. అలాగే టీడీపీ కార్యక్రమాల్లో బాబాయి సుబ్బానాయుడుకు తోడుగా ఉండి చురుగ్గా పనిచేసే టీడీపీ యువనేత భానుచందర్‌నాయుడు అకాలమృతి మనస్సుకు బాధ కలిగించిందన్నారు. భానుచందర్ మృతి చెందిన 24 గంటల్లోనే సుబ్బానాయుడు మృతి చెందడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, మాలేపాటి కుటుంబ సభ్యులకు మనోధైర్యాని భగవంతుడు ప్రసాదించాలని మంత్రి కోరారు. వారి వెంట సోమశిల ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, స్థానిక టీడీపీ నాయకులు, మాలేపాటి అభిమానులు, తదితరులు ఉన్నారు.

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి : డీఈవో



మాట్లాడుతున్న డీఈవో బాలాజీరావు

నెల్లూరు(విద్య), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత పెంపొందించేలా సిబ్బంది పనిచేయాలని డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు సూచించారు. నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో లెవల్-1 మాస్టర్ ట్రైనర్స్ రిఫ్రెషర్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. రెండు రోజులు జరిగే ఈ కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు టీచ్ టూల్ ప్రాముఖ్యతను తెలుసుకుని, విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా బోధనా పద్ధతులను మెరుగు పరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్‌బాబు, జిల్లా కోఆర్డినేటర్ షకీల్, 60 మంది మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

రెగ్యులర్ పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులు(ఓల్డ్ సిలబస్) ఓపెన్ స్కూల్ విధానంలో టెన్త్ పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పిం చినట్లు డీఈవో ఓ ప్రకటనలో తెలిపారు. apopen-s-c-hoo-l.a-p.-go-v.in వెబ్‌సైట్‌లో రూ.300 ఫీజుతో అడ్మిషన్ పొందవచ్చని, ఏపీ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ ద్వారా కూడా ప్రవేశం పొందవచ్చన్నారు. పూర్తి వివరాలకు పాఠ శాలల ప్రధానోపాధ్యాయులనుగానీ, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోగానీ సంప్రదించాలని కోరారు.

డైట్ ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు

జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఆర్ బాలాజీరావుకు పల్లిపాడు డైట్ ప్రిన్సిపాల్(ఎఫ్ఏసీ)గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డైట్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న కే వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ చేయడంతో పరిపాలనపరమైన ఇబ్బందులు రాకుండా గతంలో డైట్‌లో సీనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహించి, ప్రస్తుతం డీఈవోగా పనిచేస్తున్న బాలాజీరావును వెంటనే అదనపు బాధ్యతలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించండి


మన్నేటికోట పునరావాస కేంద్రంలో అధికారులతో చర్చిస్తున్న సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ

ఉలవపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టు గేట్లు ఎత్తే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు తరలించాలని కందుకూరు సబ్‌కలెక్టర్ దామెర హిమవంశీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని లోతట్టు ప్రాంతాలు, వరద నీరు భారీగా ప్రవహిస్తున్న ప్రాంతాల్లో పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. ముందు జాగ్రత్తగా తిరుపతి కుంట ఎస్టీ కాలనీవాసులను జీపీఆర్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. మన్నేటికోటలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో అధికారులు కల్పించిన వసతులను పరిశీలించారు. మండలంలోని భీమవరం, బద్దిపూడి, మన్నేటికోట, ఆత్మకూరు, ఉలవపాడు, గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దారు శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

దళిత కూలీ బిడ్డకు డాక్టరేట్

● సత్కరించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి


వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ పరిధిలోని లింగంపల్లి అరుంధతీయవాడకి చెందిన దళిత కూలీ బిడ్డ గార్ల వెంకటేశ్వర్లు ఇటీవల డాక్టరేట్ అందుకున్నారు. విషయం తెలుసుకున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తన నివాసంలో వెంకటేశ్వర్లును శాలువా, పుష్పగుచ్ఛంతో శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీపీసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, తల్లిదండ్రులు వెంకటస్వామి, పద్మమ్మ వీరేపల్లి పార్థసారథిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.